ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
19-8-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 200 పేజీలు: 8+4 వెల: 6.50


సిజెపిపై పోలీసు చర్య.. విచారణ కమిటీ ఏర్పాటు 5లో

ఇమ్రాన్‌కు తక్షణమే ఆస్పత్రికి తరలించండి: పాక్ సుప్రీం

# జయహో బిసి

## స్థానిక సంస్థల్లో 34% రిజర్వేషన్

నిబంధనలకనుగుణంగా పెంపు

28జిల్లాలకూ జిల్లా పరిషత్‌లు

మేయర్, చైర్మన్‌లకు ప్రత్యక్ష ఎన్నికలు

అసెంబ్లీలో సభ్యుల హర్షాతిరేకాల మధ్య మంత్రివర్గ నిర్ణయాన్ని ప్రకటించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** జయహో బిసి అంటూ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ దద్దరిల్లింది. సభ్యుల హర్షాతిరేకాల మధ్య స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్ల పెంపుపై కేబినెట్ నిర్ణయాన్ని మంగళవారం జరిగిన రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయానికి, బిసి సాధికారతకు కట్టుబడి ఉందని అసెంబ్లీ సాక్షిగా స్పష్టం చేశారు. పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా సామాజిక న్యాయమే అజెండా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. స్థానిక సంస్థల్లో బిసిలకు తొలిసారిగా రిజర్వేషన్‌లను వర్తింప చేస్తూ ఎన్టీఆర్ నాడు తీసుకున్న నిర్ణయం మొదలుకుని ఇప్పటి వరకు జరిగిన పరిణామాలను సిఎం చంద్రబాబు సభలో వివరించారు. నిబంధనలకు అనుగుణంగా అన్ని పరిమితులకు లోబడి స్థానిక సంస్థల్లో బిసిల రిజర్వేషన్ల పెంపుపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంత స్థానిక సంస్థల్లో 34శాతం, పట్టణ స్థానిక ప్రాంత సంస్థల్లో 33.33శాతం మేర రిజర్వేషన్‌లను బిసి వర్గాలకు వర్తింప చేయనున్నట్టు అసెంబ్లీలో సిఎం చంద్రబాబు ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రానికి తొలిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసిన పంచాయతీరాజ్ చట్ట ప్రకారం రిజర్వేషన్ల పెంపును అమలు చేస్తున్నట్టు తెలిపారు. 1995, 2001, 2006, 2013 సంవత్సరాల్లో 34శాతం రిజర్వేషన్‌లతోనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించినట్టు ముఖ్యమంత్రి సభకు గుర్తు చేశారు. సామాజిక న్యాయం అజెండాతో పని చేయడం వల్లే ఎర్రన్నాయుడు, కెఇ కృష్ణమూర్తి, యనమల రామకృష్ణ, దేవేందర్ గౌడ్, అయ్యన్న పాత్రుడు వంటి లెజండరీ నాయకత్వం బిసి వర్గాల నుంచి వచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బిసిల రిజర్వేషన్‌లను 24శాతానికి కుదించడం ద్వారా 16800 మంది స్థానిక బిసి నేతలకు రాజకీయాల్లో అవకాశాలు దక్కలేదని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల సామాజిక, రాజకీయ, ఆర్థిక అభ్యున్నతే ధ్యేయం గా కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 34శాతం రిజర్వేషన్‌లను వర్తింప చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, ప్రత్యేక కేబినెట్ సమావేశం నిర్వహించి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపుపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. ఈ 34శాతం రిజర్వేషన్ ప్రతిపాదనను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించాలని ముఖ్యమంత్రి కోరారు.

**స్థిరమైన పాలన కోసమే పట్టణ స్థానిక సంస్థల్లో ప్రత్యక్ష ఎన్నికలు:** ఆయారాం.. గయారాం అనే విధానం కాకుండా సుస్థిరమైన పాలన అందించడం కోసమే పట్టణ స్థానిక సంస్థల్లో మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల ఎన్నికలను ప్రత్యక్ష ఎన్నికల ద్వారా చేపడతామని సిఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ మేరకు కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. దీంతో పాటు జిల్లాల విభజన జరిగినా ప్రస్తుతం 13 జిల్లా ప్రజా పరిషత్‌లే ఉండటంతో, పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లా ప్రజా పరిషత్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. 16వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ.2,300 కోట్ల గ్రామీణ గ్రాంట్లు, రూ.1,562 కోట్ల పట్టణ గ్రాంట్లు రావాలంటే స్థానిక ఎన్నికలు నిర్వహించడం అత్యంత ఆవశ్యకమని, సరైన అభ్యర్థుల ఎంపిక ద్వారా భావి నాయకత్వాన్ని >>2

## అక్టోబర్ లోగా లోకల్ పోల్స్

ప్రత్యక్ష పద్ధతిలోనే మేయర్, చైర్మన్ల ఎన్నిక

జిల్లాల విభజనకనుగుణంగా జడ్పీలు

సిఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్‌లో నిర్ణయం

57 అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోదం

10,060 పోస్టులతో జాబ్ కేలెండర్‌కు ఓకే

బిసి విద్యార్థులకు ఐఐటి-జెఇఇ, నీట్ కోచింగ్ సెంటర్లు

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్ల అమలుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.1 శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించింది. కేంద్రఆర్థికసంఘం నుంచి రావాల్సిన >>2



మంగళవారం సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశం



గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా

## రమాదేవి, రామయ్య

**విజయవాడ,ఆగస్టు18,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ గవర్నర్ కోటా ఎంఎల్‌సీలను ఖరారు చేసింది. ఎప్పటి నుంచో పార్టీకి విధేయంగా ఉంటున్న వర్ల రామయ్య, దళవాయి రమాదేవి గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ఖరారయ్యారు. వర్ల రామయ్య ప్రస్తుతం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఉన్నారు. ఆయనకు ఎస్సీ కోటాలో మండలిలో ప్రాతినిధ్యం కల్పించనున్నారు. వర్లరామయ్య గతంలో అనేక పర్యాయాలు ప్రజాప్రాతినిధ్య పదవిని అడుగుతూ వచ్చారు. పార్టీ ఆయన ఎంఎల్‌ఏ అభ్యర్థిగా అవకాశం ఇచ్చినప్పటికి గెలవలేకపోయారు. పార్టీ తగిన బలం లేనప్పటికి అసెంబ్లీ నుంచి రాజ్యసభకు పోటీ ఓటమి పాలయ్యారు. టీడీపీ హయం లో ఆయన ఆర్టీసీ చైర్మన్‌గా చేసారు. ఇక అనంతపురంలో డ్వాక్రా సంఘం అధ్యక్షురాలిగా ఉన్న రమాదేవికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. ఆమె బీసీ మహిళ, టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. ఈ నియామకంతో పనిచేసే వారికి పదవులు దక్కుతాయని టీడీపీ సంకేతం పంపింది. ఈ మేరకు ప్రభుత్వం లోక్‌భవన్‌కు దస్త్రం పంపింది.

హైకోర్టులో మీడియేషన్ సెంటర్: మంత్రి ఎన్ఎండి ఫరూక్ 2లో



పుల్లెల గాయత్రి, ధనుష్ శ్రీకాంత్ సహా

## 17 మందికి 'అర్జున' అవార్డులు

ముగ్గురికి 'ద్రోణాచార్య'

ఈ సారికూడా లేని ఖేల్‌రత్న

జాతీయ క్రీడాపురస్కారాలు ప్రకటించిన కేంద్రం

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి గాను జాతీయ క్రీడా పురస్కారాలను మంగళవారం ప్రకటించింది. భారత బ్యాడ్మింటన్ దిగ్గజం, కోచ్ పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రిని ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డు వరించింది. మహిళల డబుల్స్‌లో తన భాగస్వామి ట్రీసా జాలీతో కలిసి పుల్లెల గాయత్రి ఈ పురస్కారానికి ఎంపికైంది. వీరితో పాటు డెకాథ్లాన్ అథ్లెట్ తేజస్విన్ శంకర్, చెస్ ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ సహా మొత్తం 17 మంది క్రీడాకారులకు అర్జున అవార్డులను ప్రకటించారు. ఈ ఏడాది దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డును ఎవరికీ ప్రకటించకపోవడం గమనార్హం. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సిఫార్సుల మేరకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఈ అవార్డుల జాబితాను విడుదల చేసింది. గత నాలుగేళ్లుగా నిలకడగా రాణిస్తూ, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించిన వారికి అర్జున అవార్డును ప్రదానం చేస్తారు. కామన్వెల్త్ క్రీడల్లో డెకాథ్లాన్‌లో పతకం గెలిచిన >>2

## డ్రోన్ సిటీగా ఓర్వకల్లు

రూ.5వేల కోట్ల పెట్టుబడులు లక్ష్యం

5వేల మందికి ప్రత్యక్షంగా, 25వేల మందికి పరోక్షంగా ఉపాధి

3నెలల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక కమిటీ చర్యలు

కేంద్ర పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు

**కర్నూలు, ఆగస్టు 18, ప్రభాతవార్త:** ఓర్వకల్లు డ్రోన్ సిటీని దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన డ్రోన్ తయారీ, పరిశోధన, పరీక్షలు, శిక్షణ, ధ్రువీకరణ, సాంకేతిక సేవల కేంద్రంగా అభివృద్ధి చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో డ్రోన్ సిటీని దశలవారీగా అభివృద్ధి చేస్తున్నాయని చెప్పారు. మంగళవారం ఓర్వకల్లు డ్రోన్ సిటీలో డ్రోన్ పరిశ్రమలకు చెందిన సుమారు 150 మంది ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. డ్రోన్ సిటీలో మొత్తం 600 ఎకరాలు కేటాయించగా, తొలి దశలో 12ప్లాట్లకుగాను 8 ప్లాట్లను ఇప్పటికే కంపెనీలకు కేటాయించినట్లు తెలిపారు. సుమారు 55ఎకరాల్లో వివిధ సంస్థలు తయారీ యూనిట్లు ఏర్పాటుచేసేందుకు చర్యలు చేపడుతున్నాయన్నారు. డ్రోన్ పరిశ్రమ ప్రతిని ధులు టెస్టింగ్, శాండ్‌బాక్స్ సదుపాయాలతో పాటు >>2



మంగళవారం ఓర్వకల్లులో డ్రోన్లను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

## గ్రామగ్రామానికి పార్టీ జెండా
# అదే బిజెపి అజెండా




మంగళవారం విశాఖలో జరిగిన రాష్ట్ర బిజెపి కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపి పురందేశ్వరి

ప్రజలతో నిరంతరం మమేకం కావాలి

పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలి

వికసిత్ భారత్ నిర్మాణం లక్ష్యంగా పనిచేయండి

పార్టీ శ్రేణులకు జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ దిశానిర్దేశం

స్థానిక సంస్థల ఎన్నికల్లో కమలం వికసించాలి

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ పిలుపు

**విశాఖపట్నం, ఆగస్టు 18 ప్రభాతవార్త:** కేవలం పార్టీసమావేశాలకే పరిమితం కాకుండా నేరుగా ప్రజల్లో కి వెళ్లి వారితో నిరంతరం మమేకం కావాలని బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఎపి బిజెపి క్షేత్రస్థాయి శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. విశాఖపట్నం వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ పార్టీ భవిష్యత్ కార్యాచరణపై పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బిజెపిని ప్రతి గ్రామానికి, ప్రతి బూత్‌కు తీసుకెళ్లాలని, ప్రజలతో నిరంతరం మమేకమవుతూ సేవా కార్యక్రమాల ద్వారా వారి విశ్వాసాన్ని గెలుచుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సంపర్కం, సంభాషణ, సంబంధం అనే విధానంతో ప్రజల మధ్య నిరంతరం ఉండాలని పిలుపునిచ్చారు. సాధారణ కార్యకర్తగా రాజకీయ జీవితం ప్రారంభించి జాతీయ స్థాయికి ఎదిగిన వెంకయ్యనాయుడు వంటి నాయకుల ప్రస్థానం బిజెపి ప్రత్యేకతకు నిదర్శనమన్నారు. పదవులు కాకుండా ప్రజల మధ్య పనిచేసే కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని స్పష్టం చేశారు. 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణం లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని నితిన్ నబిన్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయేకు ప్రజలు ఇచ్చిన అపూర్వ విజయాన్ని అభివృద్ధి, ప్రజాసేవకు వేదికగా మార్చాలని అన్నారు. 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమికి 21 లోక్‌సభ స్థానాలు, 164 >>2




మంగళవారం మంత్రి నారా లోకేష్‌ను అభినందిస్తున్న ఢిల్లీ విద్యాశాఖమంత్రి సర్దార్ మన్‌జిందర్‌సింగ్ శిర్సా

మెగా డిఎస్సీ నిర్వహణ
## అభినందనీయం

16వేల టీచర్ పోస్టులు పారదర్శకంగా భర్తీ చేశారు

టీచర్ రిక్రూట్‌మెంట్ అంటే ఢిల్లీలో కోర్టులు, కేసుల చిక్కులే

విద్యా మంత్రి నారా లోకేష్‌ను ప్రశంసించిన ఢిల్లీ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా పారదర్శకంగా రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి 16వేల మంది ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టిన తీరుపై ఢిల్లీ పరిశ్రమల శాఖ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌పై ప్రశంసలు కురిపించారు. మంగళవారం ఆయన ఆర్‌టిజిఎస్‌లో విద్యా, ఐటి, ఆర్‌టిజిఎస్ శాఖల మంత్రి నారా లోకేష్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా డిఎస్సీ ద్వారా 16వేల మంది ఉపాధ్యాయులను ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ఎలా నియామకాలు చేపట్టగలిగారని ఆయన మంత్రి నారా లోకేష్‌ని ఆసక్తిగా అడిగారు. ఢిల్లీలో టీచర్ రిక్రూట్మెంట్ అంటేనే కోర్టులో కేసులు, ఫిర్యాదులు, గందరగోళాలు సృష్టించేసి దాని జోలికెళ్లాలంటే జడిపించేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎపిలో ఎలాంటి వివాదాలు లేకుండా పారదర్శకంగా టీచర్ రిక్రూట్మెంట్ పూర్తి చేసిన లోకేష్‌కు అభినందనలు తెలిపారు. దీనికి మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ తాము డిఎస్సీ ద్వారా పరీక్ష నిర్వహించి ఎక్కడా ఎలాంటి చిన్న పొరబాట్లకు తావు లేకుండా 16వేల మందికిపైగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టామన్నారు. దీనిపైన కూడా ప్రతిపక్ష పార్టీ చాలా ఆరోపణలు చేసి విఫలమైందన్నారు. కోర్టుల్లో సైతం వారు ఎక్కడా చిన్న అక్రమం జరిగినట్లు ఆధారాలు చూపించలేక పోయారన్నారు. త్వరలో మరో 3వేల మందికిపైగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టనున్నట్లు చెప్పారు. విద్యాశాఖ తనకు ఎంతో ఇష్టమైన శాఖని, విద్యాశాఖలో వినూత్న విధానాలు అమలు చేయడం ద్వారా సత్ఫలితాలు సాధిస్తున్నామన్నారు. మొట్టమొదటి సారి ప్రైవేటు పాఠశాలల నుంచి 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలపై, ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలపై ప్రజల్లో పెరిగిన నమ్మకానికి ఇదో ఉదాహరణ అన్నారు. ఉపాధ్యాయుల కార్యకలాపాలు, విద్యాశాఖలో మొత్తం కార్య కలాపాలన్నీ పర్యవేక్షించడానికి లీప్ యాప్ రూపొందించామన్నారు. >>2



ఎఇ నూకరాజు ఫ్యామిలీ సూసైడ్ కేసు

అల్లుడిని చంపింది సాధిక్కేనా? 3లో





సిబిఐ వలలో మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ 2లో



మంగళవారం హైదరాబాద్‌లో స్వాధీనం చేసుకున్న కల్తీనెయ్యి రసాయనాలను పరిశీలిస్తున్న సిపి సజ్జనార్

తినేదంతా నెయ్యేనా?

హైదరాబాద్‌లో విస్తరిస్తున్న కల్తీనెయ్యి మాఫియా 7లో



మంగళవారం ఓర్వకల్లులో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సమక్షంలో ఒప్పందపత్రాలు

# డ్రోన్ సిటీగా ఓర్వకల్లు

>> డ్రోన్లను గగనతలంలో పరీక్షించేందుకు అవసరమైన అనుమతులు వేగంగా లభించే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారని మంత్రి తెలిపారు. ఈ అంశాలపై నిర్ణయాలు వేగంగా తీసుకునేందుకు కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, డిజిసిఎ, నాణ్యతా మండలి తదితర విభాగాల అధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నామని, మూడు నెలల కాలపరిమితిలో అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. డ్రోన్ పరిశ్రమ ద్వారా రానున్న కాలంలో ఓర్వకల్లులో రూ.5 వేల కోట్ల వరకు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఇప్పటికే సుమారు రూ.130 కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. డ్రోన్ సిటీ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందితే 5 వేల మందికి ప్రత్యక్షంగా, 25 వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రానున్న రెండు నుంచి మూడు సంవత్సరాల్లో అన్ని ప్లాట్ల కేటాయింపులు పూర్తి చేసి డ్రోన్ తయారీ కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వ్యవసాయం, పారిశుద్ధం, శాంతిభద్రతలు, భూసర్వే, విపత్తుల నిర్వహణ, మౌలిక వసతుల పరిశీలన, వైద్య సేవలు తదితర రంగాల్లో డ్రోన్ల వినియోగం వేగంగా పెరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 6 లక్షలకు పైగా డ్రోన్ల అవసరం ఉండగా ప్రస్తుతం 40 వేలకుపైగా డ్రోన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ భారీ మార్కెట్‌ను దేశీయ తయారీ ద్వారా సద్వినియోగం చేసుకోవడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్థానిక యువతకు డ్రోన్ తయారీ, నిర్వహణ, ఆపరేషన్, సాంకేతిక సేవలు, పైలట్ శిక్షణలో నైపుణ్యాభివృద్ధి కల్పించి ఉపాధి అవకాశాలను పెంచుతామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం డ్రోన్ తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు రూ.120 కోట్ల ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాన్ని అమలు చేస్తోందన్నారు. కర్నూలు విమానాశ్రయం నుంచి భవిష్యత్‌లో బెంగళూరుకు విమాన సేవలు ప్రారంభించే అంశంపై కృషి చేస్తానని రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమానాశ్రయంలో విమాన శిక్షణ సంస్థలను ఏర్పాటు చేయడం ద్వారా పైలట్ శిక్షణకు అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. మెల్‌స్టార్ విమాన శిక్షణ సంస్థ ప్రారంభానికి సిద్ధంగా ఉందని, మరో సంస్థ కూడా ఏర్పాటు కానుందని తెలిపారు. ఓర్వకల్లు డ్రోన్ సిటీని కేవలం తయారీ కేంద్రంగా కాకుండా పరిశోధన, పరీక్షలు, శిక్షణ, ధ్రువీకరణ, సేవలు వంటి అన్ని విభాగాలతో కూడిన సమగ్ర డ్రోన్ పర్యావరణ వ్యవస్థగా అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి పెట్టుబడులు ను ఆకర్షించేందుకు చేస్తున్న కృషికి అనుగుణంగా డ్రోన్ ప్రభుత్వం సహకారం అందిస్తుందని చెప్పారు.

# 17మందికి 'అర్జున' అవార్డులు

>> తొలి భారతీయ అథ్లెట్‌గా తేజస్విన్ శంకర్ చరిత్ర సృష్టించగా, ఫిడే మహిళల ప్రపంచ కప్ గెలుచుకున్న దివ్య దేశ్‌ముఖ్ సంచలనం రేపారు. హాకీ క్రీడాకారుడు హార్దిక్ సింగ్ పేరు ఖేల్ రత్న కోసం పరిశీలనకు వచ్చినప్పటికీ, అతను పోటీ నుంచి తప్పుకోవడంతో ఈసారి ఎవరికీ ఈ పురస్కారం దక్కలేదని తెలిసింది. సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు అరుణ్ నాయగాం అర్జున అవార్డు (జీవన సాఫల్యం) వరించింది. 1962 జకార్తా ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత జట్టులో ఆయన సభ్యుడు. కోచ్‌లకు ఇచ్చే ద్రోణాచార్య అవార్డులు ముగ్గురిని వరించాయి.

**అవార్డు గ్రహీతల పూర్తి జాబితా:** అర్జున అవార్డు గ్రహీతలు (17 మంది) తేజస్విన్ శంకర్, మహమ్మద్ అబ్బల్, ప్రియాంక గోస్వామి (అథ్లెటిక్స్), ట్రీసా జాలీ, పుల్లెల గాయత్రి (బ్యాడ్మింటన్), నరేందర్ బెర్వాల్ (బాక్సింగ్), విదిత్ సంతోష్ గుజరాతీ, దివ్య దేశ్‌ముఖ్ (చెస్), లాలెర్మిన్‌సియామి, రాజ్‌కుమార్ పాల్ (హాకీ), సుర్జీత్, పూజ (కబడ్డీ), ధనుష్ శ్రీకాంత్, రుద్రాంక్ష్ ఖండేల్వాల్ (పారా షూటింగ్), ఏక్తా భయాన్ (పారా అథ్లెటిక్స్), అరవింద్ సింగ్ (రోయింగ్), అఖిల్ షెయోరాన్ (షూటింగ్) అర్జున అవార్డు (జీవన సాఫల్యం), అరుణ్ నాయగాం (ఫుట్‌బాల్), ద్రోణాచార్య అవార్డు (కోచ్‌లు)ఫోటో లాల్ యాదవ్ (బాక్సింగ్)పర్వీర్ సింగ్ (అథ్లెటిక్స్)నేహా నందకుమార్ చవాన్ (షూటింగ్)జీవితకాల సాఫల్య పురస్కారం (ధ్యాన్‌చంద్ అవార్డు)ధర్మేంద్ర సింగ్ యాదవ్ (బాక్సింగ్)వీరేందర్ కుమార్ (రెజ్లింగ్) రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్ ఆర్మీ పారాలింపిక్ నోడ్, పుణే ఈ పురస్కారాలు వరించాయి.

# మెగా డిఎస్సీ నిర్వహణ అభినందనీయం

>>అనంతరం ప్రతినిధుల బృందాన్ని మంత్రి నారా లోకేష్ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సమావేశంలో ఢిల్లీ ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి సజ్జన్ సింగ్ యాదవ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సిబిఐ వలలో మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్

## రూ.2 లక్షలు లంచంతో పట్టుబడిన శివశంకర్

## మరో నలుగురిని విచారిస్తున్న సిబిఐ అధికారులు

### క్వారీల భద్రతా తనిఖీలు, ప్రమాదాలపై ఆరా

**ఒంగోలు(క్రైమ్), ఆగస్టు 18 ప్రభాతవార్త:** ఒంగోలులో మైనింగ్ శాఖ అధికారిపై సిబిఐ అధికారులు పక్కా ప్రణాళికతో నిర్వహించిన ట్రాప్ తీవ్ర కలకలం రేపింది. మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ యు.శివశంకర్ గ్రానైట్ వ్యాపారుల నుంచి రూ.2 లక్షల లంచం తీసుకుంటుండగా మంగళవారం తెల్లవారుజామున సిబిఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రకాశం జిల్లాలోని గ్రానైట్ క్వారీల్లో భద్రతా ప్రమాణాల తనిఖీల కోసం శివశంకర్ సోమవారం బల్లికురవ ప్రాంతానికి వెళ్లినట్లు తెలుస్తోంది. అక్కడి క్వారీలను పరిశీలించిన అనంతరం చీమకుర్తి ప్రాంతంలోని పలు క్వారీలను తనిఖీ చేయాల్సి ఉన్నట్లు సమాచారం. చీమకుర్తిలోని వాసవి గోల్డెన్ గ్రానైట్ క్వారీతో పాటు మరికొన్ని క్వారీల్లో భద్రతా ప్రమాణాలు, గతంలో చోటుచేసుకున్న ప్రమాదాలు, క్వారీల నిర్వహణ తీరుపై పరిశీలన చేయాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. అయితే తనిఖీలకు ముందే క్వారీ నిర్వాహకులతో శివశంకర్ సంప్రదింపులు జరిపినట్లు సిబిఐ అధికారులు గుర్తించినట్లు సమాచారం. భద్రతా తనిఖీల్లో కొన్ని అంశాలను అనుకూలంగా మార్చడం, క్వారీల్లో గతంలో జరిగిన ప్రమాదాలకు సంబంధించిన వ్యవహారాలను సెటిల్ చేయడం వంటి అంశాల కోసం లంచం డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో రూ.2 లక్షలు చెల్లించేందుకు క్వారీ నిర్వాహకులు అంగీకరించినట్లు సమాచారం. లంచం డిమాండ్ వ్యవహారంపై ముందస్తు సమాచారం అందుకున్న సిబిఐ అధికారులు పూర్తి స్థాయిలో నిఘా పెట్టి ట్రాప్ నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తోంది. డబ్బులు అందజేసే ప్రదేశాన్ని కూడా అధికారులు పర్యవేక్షిస్తూ, లంచం స్వీకరించే సమయంలోనే అధికారిని పట్టుకునేలా ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ఇందులో భాగంగా ఒంగోలులోని ఓ రెస్టారెంట్‌లో నగదు అందజేసేలా ఏర్పాట్లు చేశారు. మంగళవారం తెల్లవారుజామున అక్కడ గ్రానైట్ వ్యాపారుల నుంచి రూ.2 లక్షలు స్వీకరిస్తున్న సమయంలో మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ శివశంకర్‌ను సిబిఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిసింది. ట్రాప్ అనంతరం అధికారులు సంఘటనా స్థలంలో ఆధారాలను సేకరించి, నగదు లావాదేవీకి సంబంధించిన వివరాలను నమోదు చేసినట్లు సమాచారం. లంచం స్వీకరణకు సంబంధించి అవసరమైన ఆధారాలను కూడా సిబిఐ అధికారులు సేకరించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి గ్రానైట్ వ్యాపారులు సిద్దా సురేష్, భాస్కర్‌రెడ్డి, ప్రవీణ్‌తో పాటు సర్వేయర్ శుభాష్కర్‌ను కూడా సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. లంచం ఇచ్చే వ్యవహారంలో వీరి పాత్ర ఏమిటి, నగదు ఎవరి సూచనల మేరకు సమకూర్చారు, క్వారీ యాజమాన్యాలకు సంబంధించిన ఇతర వ్యక్తుల ప్రమేయం ఏమైనా ఉందా అనే అంశాలపై అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. క్వారీ యాజమాన్యాలు, మైనింగ్ అధికారుల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలు, సమావేశాలు, నగదు లావాదేవీలకు సంబంధించిన వివరాలను కూడా సిబిఐ అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. చీమకుర్తి ప్రాంతంలోని రెండు గ్రానైట్ క్వారీల్లో గతంలో జరిగిన ప్రమాదాల నేపథ్యంలోనే శివశంకర్ తనిఖీలకు వచ్చినట్లు సమాచారం. ఒంగోలులోనే శివశంకర్‌ను సిబిఐ అధికారులు అధికారికంగా అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. అనంతరం అరెస్టయిన మైనింగ్ అధికారితో పాటు అదుపులోకి తీసుకున్న క్వారీ నిర్వాహకులు, సర్వేయర్‌ను తదుపరి న్యాయ ప్రక్రియ కోసం విజయవాడకు తరలించినట్లు తెలుస్తోంది. అక్కడ కేసుకు సంబంధించిన తదుపరి ప్రక్రియ కొనసాగనున్నట్లు సమాచారం.

# హైకోర్టులో మీడియేషన్ సెంటర్: మంత్రి ఎన్ఎండి ఫరూక్

**విజయవాడ ఆగస్టు18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం హైకోర్టులో మీడియేషన్ సెంటర్ మరియు ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటుకు మంత్రివర్గ సమావేశం లో ఆమోద ముద్ర వేయడం జరిగిందని మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో ముఖ్య మంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో న్యాయ శాఖకు సంబంధించిన రెండు కీలకమైన అంశాలకు ఆమోద ముద్ర వేసిన విషయాలను మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. 14 మంది సిబ్బందితో మీడియేషన్ సెంటర్ తో పాటుగా 15 మంది సిబ్బందితో ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటుకుఆమోదముద్ర వేయడం జరిగిందన్నారు. హైకోర్టులో పరిపాలన సౌలభ్యం కోసం ఒక అడ్మి నిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ )పోస్టును డైరెక్టరేట్ ఆఫ్ ప్రిజన్స్ క్రింద పనిచేస్తున్న పీపీ లేదా ఏపీపీ ద్వారా డిప్యుటేషన్ పై భర్తీ చేయడానికి కూడా మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపిందని మంత్రి తెలిపారు.

# జయహో బిసి

>>అందించాలని కూటమి నేతలను కోరారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలను గాంధీజీ స్ఫూర్తితో అభివృద్ధి చేయడానికి కూటమి అంతా కలిసి కట్టుగా పనిచేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

**ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు బిసిలే వెన్నెముక:** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను, గ్రామీణ వ్యవస్థను, వ్యవసాయాన్ని, చేతివృత్తులను నిలబెట్టింది బిసి సమాజమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియా డారు. రాష్ట్రంలో 50.42 శాతం ఉన్న బిసిల శ్రమకు, చీరను నేసి అగ్గిపెట్టెలో పెట్టే అద్భుత నైపుణ్యానికి సాంకేతికతను జోడించి వారి శక్తిని ప్రపంచానికి అందిస్తామన్నారు. బిసి రెసిడెన్షియల్ స్కూళ్లను అత్యుత్తమంగా మార్చి విద్యకు మెరుగైన బాటలు వేస్తామన్నారు. విద్య, నైపుణ్యం, ఉపాధి, ఎంటర్‌ప్రెన్యూర్లు, రాజకీయ ప్రాతినిధ్యం ద్వారా వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కేవలం రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు మాత్రమే అభివృద్ధి కాదని,ఆర్థిక అసమానతలు లేకుండా జీవన ప్రమాణాలు పెంచుతూ చివరి వ్యక్తిని ముందుకు తేవడమే అసలైన అభివృద్ధి అని చెప్పారు. బిసి రిజర్వేషన్లు ఎవరికీ వ్యతిరేకం కాదని, రాజ్యాంగ పరిధిలో చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా సామాజిక న్యాయం సాధించడమే ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. బిసి అంటే వెనుకబడిన వారు కాదు, అవకాశం రాక వెనుకబడిన వారు మాత్రమే అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ఎంపిటిసి నుంచి ఎంపిగా అవకాశం:** 1984లో ఎన్టీఆర్ స్థానిక సంస్థలు, మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్‌లలో బిసిలకు 20శాతం రిజర్వేషన్లు కల్పించగా, 73, 74వ రాజ్యాంగ సవరణల స్ఫూర్తితో తన హయాంలో 'యాక్ట్ ఆఫ్ 5' కింద బిసిలకు 34శాతం మేర రిజర్వేషన్లు పెంచామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అదే కోటా ప్రకారం 1995, 2001, 2006, 2013 స్థానిక ఎన్నికల్లో 34శాతం రిజర్వేషన్లు అమలు చేశారన్నారు. పార్టీ ప్రోత్సహించి స్థానిక సంస్థల్లో భాగస్వామ్యం కల్పిస్తే క్షేత్రస్థాయి నుంచి నేతలుగా ఎదుగుతారని, కర్నూలు జిల్లాకు చెందిన ఎంపిటిసి బస్తిపాటి నాగరాజును ఎంపిగా చేసి సముచిత న్యాయం చేశామని ఉదహరించారు. పంచాయతీల నుంచి కేంద్ర మంత్రివర్గం వరకు బిసిలకు ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు చేపడతామన్నారు.

**కోర్టుల్లో కేసులు వేస్తే చరిత్ర హీనులే:** శాసనసభలో ఈ ప్రకటన చేయగానే వైసిపి కోర్టుల్లో కేసులు వేసేందుకు సిద్ధంగా ఉంటుందని సిఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మెగా డిఎస్సీ విషయంలోనూ ఇదే తరహాలో వందలాది కేసులు వేశారని తెలిపారు. ఈ రిజర్వేషన్ల విషయంలో కోర్టులకు వెళ్లి కేసులు వేస్తే వారు చరిత్ర హీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. ఇంతటి చారిత్రక సమావేశానికైనా వైసిపి నేతలు హాజరవుతారని భావించానని, కానీ రాకపోవడం దారుణమని సిఎం అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున కూడా జాతీయ జెండా ఎగురవేయకుండా నిర్లక్ష్యం చేస్తూ అవమానించిన వ్యక్తులను ఏమనాలని ప్రశ్నించారు. గత పాలకుల పై కేసులు 20యేళ్లుగా కింది కోర్టుకు, హైకోర్టుకూ ఊగిసలాడుతూనే ఉన్నాయని ఎద్దేవా చేశారు. 2019లో గత పాలకులు బిసి రిజర్వేషన్ల విషయంలో 176 జిఒ తెచ్చి నాటకాలు ఆడారని, సుప్రీం కోర్టుకు కూడా అప్పీలు చేయకుండా వదిలేశారని సిఎం విమర్శించారు. 559, 560 జిఒల ద్వారా రిజర్వేషన్‌లను 34శాతం నుంచి 24.15శాతానికి తగ్గించి, 16,800 మంది బిసి నాయకత్వానికి తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. బిసిలకు ద్రోహం చేయడంలో వైసీపీ నెంబర్ వన్ అని ధ్వజమెత్తారు. గత పాలకులు బిసిలపై కక్షగట్టి, తమ వెనుక లేరన్న భావనతో ఇబ్బందులు పెట్టారని సిఎం తెలిపారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అయ్యన్నపాత్రుడు, పల్లా శ్రీనివాస్, కూన రవికుమార్ వంటి బిసి నేతలపై కేసులు పెట్టి వేధించారని ఆరోపించారు. రేపల్లెలో అమర్నాథ్ గౌడ్ అనే కుర్రాడిని పెట్రోలు పోసి తగులబెట్టారని, టిడిపికి మద్దతిస్తున్నారన్న కారణంతో తోట చంద్రయ్య గొంతుపై కత్తిపెట్టారని, కంచర్ల జాలయ్య, నందం సుబ్బయ్య ప్రాణాలు కోల్పోయినా సిద్ధాంతాలను వదులుకోలేదని గుర్తుచేశారు. చివరికి బిసి కార్పొరేషన్ల ఏర్పాటు చేసినా కనీసం కుర్చీలు కూడా వేయకుండా అవమానించారని సిఎం చంద్రబాబు అన్నారు. ప్రసంగం ముగించగానే ముఖ్యమంత్రి వద్దకు బిసి మంత్రులు, ఎమ్మెల్యేలు వెళ్లి అసెంబ్లీ సమావేశ మందిరంలో కృతజ్ఞతలు తెలిపారు.

# అక్టోబర్‌లోగా లోకల్ పోల్స్

>> సుమారు రూ.16,500 కోట్ల నిధులు మురిగిపోకుండా అక్టోబర్‌లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఏపి పంచాయతీరాజ్ చట్టం1994 నిబంధనల ప్రకారం బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. న్యాయపరమైన అంశాల్లో ఉన్న 23 మునిసిపాలిటీల విలీనాన్ని తర్వాత పరిశీలిద్దామని, ముందుగా అన్ని స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహిద్దామని స్పష్టం చేశారు.మేయర్ ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని, పాత విధానంలో ఒక్క డిప్యూటీ మేయర్ పదవికే పరిమితం కావాలని నిర్ణయం తీసుకుంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు ఉండదని, ప్రస్తుతం అమల్లో ఉన్న రిజర్వేషన్లే కొనసాగుతాయని స్పష్టం చేసింది. బిసి రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు కేబినెట్‌కు వివరించారు. ప్రస్తుతం ఉన్న 13 జెడ్పీలను జిల్లాల పునర్విభజనకు అనుగుణంగా 28 జిల్లా పరిషత్‌లుగా ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. మొత్తం 57 అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలే ప్రధాన అజెండాగా సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశమైంది. అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో సభా విరామ సమయంలో జరిగిన ఈ భేటీలో దాదాపు అన్ని అజెండా అంశాలపై చర్చ కొనసాగింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై మంత్రివర్గం చర్చించి నిర్ణయం తీసుకుంది.

ఇటీవల 20వ ఎస్ఐపిబి సమావేశంలో ఆమోదం పొందిన 25 ప్రాజెక్టులకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఉద్యోగాల కల్పన, పరిశ్రమలు, ఐటీ, ఇంధనం, పర్యాటక రంగాలకు సంబంధించిన కీలక ప్రతిపాదనలపై నిర్ణయాలు తీసుకున్నారు. 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్‌పై కీలక నిర్ణయం తీసుకున్నారు. బిసి విద్యార్థులకు ఐఐటి-జెఇఇ, నీట్ కోచింగ్ సెంటర్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు బిల్లు, ఉన్నత విద్యలో ఫీజుల నిర్ణయానికి కొత్త కమిషన్ బిల్లుపై చర్చించింది.

**ప్రత్యర్థుల కువిమర్శలు తిప్పికొట్టండి**

మంత్రివర్గ అజెండా అంశాలపై చర్చ పూర్తయిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ పరిణామాలపై మంత్రులు, అధికారులతో చర్చించారు. డిఎస్సీ2025లో సహా, శాంతి భద్రతలపై ప్రత్యర్థి పక్షం చేస్తున్న చర్చలను బలంగా తిప్పికొట్టాలని సిఎం ఆదేశించారు. సామాజిక మాధ్యమంలో వస్తున్న తప్పుడు కథనాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో ధరల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో వస్తున్న నెగెటివ్ కామెంట్లపై ధీటుగా స్పందించాలని సూచించారు. మద్యం బ్రాండ్లకు పిచ్చిపిచ్చి పేర్లు పెట్టకుండా కమిటీ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అక్రమంగా కంటైనర్లలో ఇసుక తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# గ్రామగ్రామానికి పార్టీ జెండా అదే బిజెపి అజెండా

>> అసెంబ్లీ సీట్లు లభించాయని నితిన్ నబిన్ గుర్తుచేశారు. ఈ విజయం గర్వించడానికి మాత్రమే కాదని, ప్రజలు పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. బిజెపి- టిడిపి - జనసేన కూటమి రాష్ట్ర అభివృద్ధికి కొత్త అధ్యాయానికి నాంది పలికిందన్నారు. బిజెపి కేవలం అధికారం కోసం ఏర్పడిన పార్టీ కాదని నితిన్ నబిన్ అన్నారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ జాతీయవాదం, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయం, అటల్ బిహారీ వాజ్‌పేయి సుపరిపాలన బాటలో పార్టీ ఎదిగిందన్నారు. త్యాగం, తపస్సు, సిద్ధాంతం, దేశ ప్రథమ భావన బిజెపికి పునాదులని చెప్పారు. "నేషన్ ఫస్ట్.. పార్టీ నెక్స్ట్.. సెల్ఫ్ లాస్ట్" అనే సిద్ధాంతంతో పనిచేసే పార్టీ బిజెపి అని పేర్కొన్నారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూనే రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయాలని, ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించాలని కార్యకర్తలకు నబిన్ పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం శంకుస్థాపనలకే పరిమితం కాకుండా ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రారంభిస్తోందని నితిన్ నబిన్ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, అమరావతి అభివృద్ధి, రాయ్‌పూర్- విశాఖపట్నం గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే, ఎఎంసిఎ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. భారత్ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని నితిన్ నబిన్ అన్నారు. యువతను ఉద్యోగాల కోసం ఎదురుచూసేవారిగా కాకుండా ఉద్యోగాలు సృష్టించే పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే వాతావరణాన్ని కేంద్రం కల్పిస్తోందన్నారు. స్టార్టప్‌లు, మేక్ ఇన్ ఇండియా, పరిశోధన, ఇంజినీరింగ్, వైద్య రంగాల్లో అవకాశాలను యువతకు వివరించాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా కొత్త తరంతో నిరంతరం సంభాషించాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో కమలం వికసించాలి:** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ప్రారంభోపన్యాసం చేస్తూ పార్టీని ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి గ్రామానికి విస్తరించడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. "మన ఊరు-మన జెండా' కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో బిజెపి జెండా ఎగరాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అందిస్తున్న నిధులు, రహదారులు, కాలువలు, వీధిదీపాలు, మరుగుదొడ్లు, ఆరోగ్యం, విద్య, పారిశుద్ధ్య కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 13,219 గ్రామ పంచాయతీల్లో బిజెపి ప్రజాప్రతినిధులు గెలిచేలా కార్యాచరణ రూపొందించాలని పివిఎన్ మాధవ్ అన్నారు. అవకాశం ఉన్న ప్రతి చోట సర్పంచ్, వార్డు సభ్యుడు, ఎంపిటిసి, జడ్‌పిటిసి, మున్సిపల్ కౌన్సిలర్, కార్పొరేటర్ నుంచి చైర్మన్, మేయర్ వరకు బిజెపి ప్రజాప్రతినిధులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని, ప్రతి జిల్లాలో పర్యటించి పార్టీ బలాన్ని పెంచుకోవాలని కార్యకర్తలకు సూచించారు. 'ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న 'జనతా వారధి' కార్యక్రమాన్ని మండల స్థాయికి తీసుకెళ్లాలని మాధవ్ అన్నారు. ప్రజలు బిజెపిని ఆశ్రయిస్తే తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకం కల్పించాలన్నారు. ప్రతి బూత్‌లో 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని నిర్వహించాలని, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో యువతకు దేశ సంస్కృతి, సంప్రదాయాలు, విజయాలను పరిచయం చేసే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు కావడం చారిత్రాత్మక పరిణామమని పివిఎన్ మాధవ్ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,414 కోట్ల రివైవల్ ప్యాకేజీ అందించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. విశాఖకు గూగుల్ సెంటర్, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు, అనకాపల్లి బల్క్ డ్రగ్ పార్క్ వంటి పెట్టుబడులు రావడం అభివృద్ధికి సంకేతమన్నారు. పోలవరం.. ఉత్తరాంధ్రకు నీళ్లుపోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి రాష్ట్రానికి సాగునీటి భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని మాధవ్ అన్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకెళ్లే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. కృష్ణా-గోదావరి జలాల సమన్వయంతో రాయలసీమకు దక్కాల్సిన నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని జలవనరుల ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడంపై రాష్ట్ర కార్యవర్గంలో తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ సెప్టెంబర్ 17న 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పూర్తి చేసుకోనున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు 'సేవా సంకల్ప ఉత్సవం' నిర్వహించాలని పివిఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. బిజెపి కార్యక్రమాలు రాజకీయాలకే పరిమితం కాకుండా అన్ని సామాజిక వర్గాలను కలుపుకొని సాగాలని మాధవ్ అన్నారు. సంత్ రవిదాస్ జయంతి, విశ్వకర్మ జయంతి కార్యక్రమాలతో పాటు నాయీ బ్రాహ్మణులు, రజకులు, చేనేత, గీత కార్మికులు, యాదవులు, కుమ్మరి, కమ్మరి తదితర వర్గాలతో విస్తృతంగా అనుసంధాన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. 'వికసిత్ భారత్ - యువ సంవాద్' వంటి కార్యక్రమాలను మండల, జిల్లా స్థాయిలో విస్తృతంగా నిర్వహించి యువతను బిజెపికి మరింత చేరువ చేయాలని మాధవ్ అన్నారు. సమావేశంలో బిజెపి జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్, జాతీయ సహ సంస్థాగత ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి వై.సత్యకుమార్ యాదవ్, జాతీయ ఉపాధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఎంపిలు సిఎం రమేష్, పాకా వెంకటసత్యానారాయణ, ఆర్.కృష్ణయ్య, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, నడికుడి ఈశ్వర రావు, శాసనమండలి పక్ష నేత సోము వీర్రాజు, పోతుల సునీత, జాతీయ సెల్స్ కోకన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం విశాఖలో జరిగిన సభలో నితిన్ నబీన్‌తో రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు మాధవ్

# ఎస్సీ వర్గీకరణతో దళితులపై మోడీ రాజకీయ కుట్ర

## నేషనల్ ఫ్రంట్ ప్రెసిడెంట్ మాల మహానాడు అండ్ రాక్స్ డాక్టర్, ఆర్ఎస్ రత్నాకర్

**బొబ్బిలి, ఆగస్టు 18 ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణతో దళితులపై బిజెపి మోడీ రాజకీయ కుట్ర చేస్తున్నారని నేషనల్ ఫ్రంట్ ప్రెసిడెంట్ మాల మహానాడు అండ్ రాక్స్ డాక్టర్, ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు. బొబ్బిలి సూర్య రెసిడెన్సీలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం చేస్తున్న వర్గీకరణ ఆయన వ్యతిరేకిస్తున్నారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితులపై బీజేపీ మోడీ రాజకీయ కుట్ర దేశవ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణతో పూర్తిగా ఉనికి కోల్పోయిన మాల సామాజిక వర్గం.

ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితులపై దేశవ్యాప్తంగా రాజకీయ కుట్ర!! ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్లో చట్టం చేసేంతవరకు నిరంతరం శాంతియుత పోరాటం కొనసాగుతుంది. మిత్రు లారా అసలు ఈ ఎస్సీ వర్గీకరణను శాంపుల్‌గా పంజాబ్ హర్యానాలో మొట్టమొదటిగా ఈ దేశంలో చేసింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే, వర్గీకరణకు బీజం కాంగ్రెస్ పార్టీ వేస్తే దీన్ని దేశం మొత్తం చేశాడు మన మోడీ సాబ్, నిజానికి ఎస్సీ రిజర్వేషన్ వల్ల వందలో 12కి బెనిఫిట్ జరుగుతోంది, ఇది కూడా అధికారిక లెక్క కాదు, ఈ వందలో యిద్దరికిచ్చే ఈ ఫలాలను, సమన్యాయం, సామాజిక న్యాయం పేరుతో దేశవ్యాప్తంగా ఎస్సీ లిస్టులో ఉన్న 1108 ఎస్సీ కులాలకు ఎలా పంచుతారు? మోడీ అలాగే ఈ రెండు సీట్లను తెలుగు రాష్ట్రాల్లో 59 ఎస్సీ కులాలకు చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఎలా పంచుతారు? ఇది దళితుల ఐక్యతపై కుట్ర కాదా అని ప్రశ్నిస్తున్నాను, సామాజిక న్యాయం దళితులకు ఇచ్చే రిజర్వేషన్లలో మాత్రమేనా ఈ దేశ సంపదలో అక్కర్లేదా మోడీ చంద్రబాబు రేవంత్ రెడ్డి క్యాబినెట్లో మంత్రి పదవుల విషయంలో సామాజిక న్యాయం అక్కర్లేదా మాల వర్గంపై కుట్ర చేస్తుంటే, ఎస్సీ వర్గీకరణ చట్టాలు అయిపోయినవి కదా, ఇక చేసేదేముందని అనుకోకండి మిత్రులారా, ప్రజల తలుచుకుంటే ఏ చట్టాలైన ప్రభుత్వాలు ప్రజాస్వామ్యంలో వెనక్కి తీసుకోవాల్సిందే, తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి తొక్కేస్తా ఉంటే మాల ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు.

# నైపుణ్యాల సాధనతోనే ఉజ్వల భవిష్యత్తు: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**విజయనగరం (భోగాపురం), ఆగస్టు 18 ప్రభాతవార్త :** యువత తమకిష్టమైన రంగంలో నైపుణ్యాలను పెంపొందించుకుని, నిరంతరం శ్రమిస్తే జీవితంలో తిరుగులేని విజయాలు సాధించవచ్చని భారతదేశ గౌరవ పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా భోగాపురం సమీపంలోని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఆయన సందర్శించి, శిక్షణ పొందుతున్న విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అంతకు ముందు భోగాపురంలో ఇటీవల ప్రారంభించిన అల్లూరి సీతారామరాజు విమానాశ్రయాన్ని సందర్శించిన ఆయన, అక్కడి సౌకర్యాలను అభినందించారు. ఓ వైపు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూనే, అత్యాధునిక అంతర్జాతీయ ప్రమాణాలతో దేశానికే తలమానికంగా విమానాశ్రయాన్ని నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే తనకు మిత్రుడైన జీఎంఆర్ గ్రూప్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు, బి.వి.ఎన్. రావుల ఆధ్వర్యంలో నడుస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. స్వర్ణభారత్ ట్రస్ట్, ముప్పవరపు ఫౌండేషన్, జీఎంఆర్ ఫౌండేషన్ వంటి సంస్థలు నిరుద్యోగ యువతకు ఉచిత వసతి, భోజన సదుపాయాలతో స్వయం ఉపాధి శిక్షణ అందిస్తూ వారి కాళ్లపై వారు నిలబడేలా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఎలక్ట్రీషియన్, ఏసీ, టీవీ, మొబైల్ మెకానిజం, ఐటీ వంటి సాంకేతిక రంగాలలో శిక్షణ ద్వారా యువత స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు.

**ప్రసంగంలోని ముఖ్య ముఖ్యాంశాలు:**

'ఇష్టపడిన పనిని కష్టపడి చేస్తే నష్టపడేది లేదు' అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ నిత్యం గుర్తుంచుకోవాలని, చేసే పని పట్ల అంకితభావం, నైపుణ్యం కలగలిస్తేనే నిజమైన శక్తిమంతులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. మాతృభాష కంటిచూపు లాంటిదని, ఇతర భాషలు కళ్లద్దాల వంటివని స్పష్టం చేశారు. పరభాషలను నేర్చుకోవడంలో తప్పులేదు కానీ సొంత భాషను, సంస్కృతి సంప్రదాయాలను ఎప్పటికీ విస్మరించకూడదని హితవు పలికారు. ప్రపంచం భారతదేశాన్ని గౌరవించడానికి ఇక్కడి పటిష్టమైన కుటుంబ వ్యవస్థే మూలకారణమని గుర్తుచేశారు. యువత ఖాళీ సమయాల్లో సెల్‌ఫోన్లు, టీవీలకు పరిమితం కాకుండా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో గడపాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అయితే పూర్తిగా యంత్రాలపై ఆధారపడకుండా మానవ సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టాలని కోరారు. ప్రతి ఒక్కరూ నిర్మాణాత్మకంగా, సానుకూల దృక్పథంతో ఆలోచించాలని, సమాజంలో ఒకరికొకరు సహాయపడుతూ టీమ్ స్పిరిట్‌తో పని చేయాలని పిలుపునిచ్చారు.

## వారం - వర్జ్యం

19-08-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.సప్తమి రా.7.23
న.స్వాతి ఉ.6.47
వ. మ.12.56-మ.2.42
దు.ఉ.11.45-మ.12.36
రాహు.మ.12.00-మ.1.30
శుభ ఉ.7.00-ఉ.8.00

## వార్తాఫలం

**మేషం :** ఇంటియందు శుభకార్యాలు దిగ్విజయంగా పూర్తి చేస్తారు. పుస్తక పఠనం యందు ఆసక్తిగా ఉంటారు. వస్త్ర లాభం.

**వృషభం :** పాలసీ రెన్యువల్ పట్ల అప్రమత్తత వహించండి. చేపట్టిన కార్యక్రమాలు నిదానంగా పూర్తి చేస్తారు. సభలలో పాల్గొంటారు.

**మిథునం :** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. నూతన విద్యావకాశాలు లభిస్తాయి. కాంట్రాక్ట్‌లు దక్కుతాయి.

**కర్కాటకం :** ఇంటా బయటా ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆప్తుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు.

**సింహం :** సంబంధాలు మెరుగుపడతాయి. మిత్రులతో ఏర్పడిన విభేదాలు తొలుగుతాయి. వాహన యోగం కలదు.

**కన్య :** అనుకోని అవకాశాలు దగ్గరకు వస్తాయి. దూరపు ప్రాంతాల నుండి శుభ వార్తలు అందుకుంటారు. సోదరుల కలయిక.

**తుల :** కాలానుగుణంగా పరిస్థితులను మార్చుకోగలుగుతారు. వృత్తి, ఉద్యోగాలు, వ్యాపారాలు సానుకూలంగా ఉంటాయి. వస్త్ర లాభం

**వృశ్చికం :** కుటుంబ పురోభివృద్ధి. సంఘంలో గౌరవ మర్యాదలు పెంపొందుతాయి. స్పెక్యులేషన్ లాభించదు.

**ధనుస్సు :** కార్యాలయంలో సెలవు కోసం మీరుచేసే యత్నాలు ఫలవంతం కాకపోవచ్చు ప్రయాణాలు. శుభకార్యాలలో పాల్గొంటారు.

**మకరం :** మధ్యవర్తిత్వాలు చేయడం, మానుకోవడం చెప్పదగిన సూచన. శుభ ఆహ్వానాలు అందుకుంటారు. వాహన యోగం.

**కుంభం :** ప్రయాణాలలో వస్తు భద్రత పట్ల జాగ్రత్తలు పాటించండి. నూతన పదవీ ప్రాప్తి కలుగుతుంది. ఇంటా బయటా ప్రోత్సాహం.

**మీనం :** పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడుతాయి. ఆ పరిచయాలు మీకు అనుకూలంగా మారుతాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

### ఎఇ నూకరాజు ఫ్యామిలీ సూసైడ్ కేసు

# అల్లుడిని చంపిందీ సాధిక్కేనా?


- పాయిజన్ ఇంజెక్షన్ ఇచ్చి చంపాడంటూ ఫిర్యాదు
- కోచ్ సాధిక్‌ఖాన్‌పై మరో కేసు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18 ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా పిఠాపురం పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) నూకరాజు కుటుంబం గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడినన ఘటనలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. షూటింగ్ కోచ్ షేక్ సాధిక్‌ఖాన్ వేధింపులు, బెదిరింపులు, ఆర్థిక దోపిడీ కారణంగానే కుటుంబం తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా నూకరాజు వియ్యంకుడు భాస్కర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో సాధిక్‌ఖాన్‌పై మరో హత్య కేసు నమోదు కావడం కేసులో కొత్త మలుపుగా మారింది. కాకినాడ అశోక్‌నగర్‌కు చెందిన తిల్లపూడి నూకరాజు(61) పిఠాపురంలో పంచాయతీరాజ్ శాఖ ఏఈగా పనిచేస్తున్నారు. వచ్చే జనవరిలో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది. కొన్నేళ్ల క్రితం ఆయన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఏడాది జూలై 2న ఆయన కుమార్తె సౌజన్య(38) భర్త జగదీశ్‌రెడ్డి మృతి చెందారు. దీంతో భర్తను కోల్పోయిన సౌజన్య తన పదేళ్ల కుమారుడు రియాన్స్ కార్తికేయరెడ్డితో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఈ సమయంలో కాకినాడలో ప్రో రైఫిల్ షూటింగ్ అకాడమీ నిర్వహిస్తున్న షేక్ సాధిక్‌ఖాన్‌తో కుటుంబానికి పరిచయం ఏర్పడినట్లు సమాచారం. సౌజన్యకు అండగా ఉంటానని నమ్మించినా నూకరాజు కుటుంబం అంగీకరించకపోవడంతో సాదిక్‌ఖాన్ తరువాత వేధింపులకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యుల ఆరోపణలు. కుటుంబాన్ని చంపేస్తానని బెదిరిస్తూ బంగారం, ఆస్తులు, బ్యాంకు ఖాతాలు, లాకర్ వివరాలు తన ఆధీనంలోకి తీసుకున్నాడని ఆరోపిస్తున్నారు. సాధిక్‌ఖాన్ వేధింపులను తట్టుకోలేక నూకరాజు కుటుంబం తీవ్రనిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**జగదీశ్‌రెడ్డి మృతిపై అనుమానాలు:** సౌజన్య భర్త జగదీశ్‌రెడ్డి మృతిపై కూడా అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. జులై 2న తన కుమారుడికి సాధిక్‌ఖాన్ పాయిజన్ ఇంజెక్షన్ ఇచ్చి హత్య చేశాడని నూకరాజు వియ్యంకుడు భాస్కర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ ఘటనలో మరో వ్యక్తి పాత్ర కూడా ఉందని ఆరోపించినట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు సాధిక్‌ఖాన్‌పై మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సౌజన్యకు చెందిన ద్విచక్ర వాహనంలో లభించినట్లు చెబుతున్న లేఖలు కూడా కేసులో కీలక ఆధారాలుగా మారే అవకాశం ఉంది. తన భర్త జగదీశ్‌రెడ్డి మృతిపై అనుమానాలు ఉన్నాయని, సాధిక్‌ఖాన్ తనను బెదిరించి ఆస్తులు, బ్యాంకు లాకర్ తదితర వివరాలు తీసుకున్నాడని ఆమె లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. తనపై మతం మారాలని ఒత్తిడి తెచ్చాడని కూడా అందులో పేర్కొన్నట్లు తెలుస్తోంది.

**ప్రత్యేక బృందాలతో గాలింపు:** ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల ఎస్పీలతో మాట్లాడి సమగ్ర విచారణ జరపాలని, ఆరోపణలు ఎదుర్కొంటున్న సాధిక్‌ఖాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరారీలో ఉన్న సాధిక్‌ఖాన్ కోసం పోలీసులు పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు సమాచారం. కుటుంబ సమస్యలు, బెదిరింపులు, వేధింపులు ఎదురైనప్పుడు ఆత్మహత్యకు పాల్పడకుండా పోలీసులను, న్యాయవ్యవస్థను ఆశ్రయించాలని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. మరోవైపు, తల్లిదండ్రులను కోల్పోయిన బాలుడి పరిస్థితి హృదయవిదారకంగా మారింది. పూర్తి స్థాయి దర్యాప్తుతో ఈ ఘటన వెనుక ఉన్న వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

# ఎపి పారిశ్రామికాభివృద్ధి విధానం భేష్



- డేటా లేక్, స్మార్ట్ గవర్నెన్స్ పాఠాలు మాకు నేర్పండి
- 'అమరావతి' ప్రపంచంలోనే అద్భుత నగరం అవుతుంది
- మంత్రి లోకేష్‌తో ఢిల్లీ మంత్రి సర్దార్ మంజిందర్ సింగ్

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి రాజధాని నిర్మాణ తీరును చూశాం. నిజంగా ఇదొక అద్భుతం అని ఢిల్లీ పరిశ్రమల శాఖ మంత్రి సర్దార్ మంజిందర్ సింగ్ శిర్సా ప్రశంసించారు. 'ప్రపంచంలోనే ఇదొక గొప్ప నగరంగా మారుతుంది. నారా చంద్రబాబు నాయుడు విజనరీ ముఖ్యమంత్రి. అభివృద్ధికి, దార్శనికతకు ఆయనొక విశ్వవిద్యాలయం. పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంలో ఎపి ప్రభుత్వం మార్గదర్శి. ఎపిని చూసి ఢిల్లీ ప్రభుత్వం నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. పెట్టుబడుల ఆకర్షణ, స్మార్ట్ గవర్నెన్స్ తదితర అనేక రంగాల్లో మాకు మీ సహకారం కావాల్ణి అని మంత్రులు లోకేశ్, టిజి భరత్‌లతో ఢిల్లీ పరిశ్రమలు, ఆహారం, అటవీ పర్యావరణ శాఖ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా కోరారు. ఢిల్లీ ప్రభుత్వ పరిశ్రమలు, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా నేతృత్వంలో ఆ ప్రభుత్వానికి చెందిన ప్రత్యేక ప్రతినిధుల బృందం ఎపిలో పర్యటించి ఇక్కడి పారిశ్రామిక విధానాలు, పాలనా సంస్కరణలను అధ్యయనం చేస్తోంది. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టిజిఎస్)లో రాష్ట్ర పరిశ్రమల శాఖ అధికారులతో ఈ బృందం మంగళవారం సమావేశమైంది. ఈ బృందానికి రాష్ట్ర ఐటి, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్, పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్‌లు సాదర స్వాగతం పలికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం గురించి వివరించారు. పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ పెట్టుబడులు పెట్టడానికి ఎపి అన్నివిధాలా అనుకూలమైన రాష్ట్రంగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చే వారికి ఎలాంటి అవరోధాలు లేకుండా అనుమతులన్నీ సులభంగా వచ్చేలా సింగిల్ డెస్క్ పోర్టల్ అమలు చేస్తున్నామన్నారు. డేటా సెంటర్లు, షిప్ బిల్డింగ్, సెమీకండక్టర్స్, మెడికల్ డివైజులు, ఫార్మా, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్స్‌ల మొదలు రాష్ట్రంలో 22 ప్రత్యేక క్లస్టర్లు అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత రెండేళ్లుగా నూతన పారిశ్రామికాభివృద్ధి విధానం 4.0 ద్వారా సత్ఫలితాలు సాధిస్తున్నామన్నారు.

**ఎపి నుంచి మేమెంతో నేర్చుకోవాలి.. ఎపి సహకారం కావాలి**

పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామికాభివృద్ధి విధానాల అమలు తదితర అనేక అంశాల్లో ఆంధ్రప్రదేశ్‌ను చూసి మేము చాలా నేర్చుకోవాల్సి ఉందని ఢిల్లీ ప్రభుత్వ పరిశ్రమల శాఖ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా అన్నారు. తాను చాలా ప్రభుత్వాలను చూస్తున్నానని కానీ డేటాను ఇంత సమర్థవంతంగా వినియోగించుకుని సత్ఫలితాలు సాధిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే అన్నారు. పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్‌కు ఆంధ్రప్రదేశ్ దేశానికే మార్గదర్శిగా నిలిచిందన్నారు. అమరావతిలో ఇంత పెద్ద నిర్మాణ పనులు జరుగుతుండటం చూసి ఆశ్చర్యపోయానన్నారు. ఢిల్లీలో ఇంత పెద్ద నిర్మాణాలు జరగడానికి ఆస్కారం లేదన్నారు. భవిష్యత్తులో అమరావతి ప్రపంచంలోనే ఒక గొప్ప నగరంగా అభివృద్ధి చెందుతుందనడంలో ఎంత మాత్రం అనుమానం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక విశ్వవిద్యాలయం లాంటి వారని, ఆయన పుత్రులు మంత్రి నారా లోకేష్ అని కొనియాడారు. మీ విశ్వ విద్యాలయంలో ఇప్పుడు మాకు కూడా అడ్మిషన్ ఇవ్వండి అని మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ చమత్కరించారు. పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామిక విధానాల రూపకల్పన, డేటా డ్రివన్ గవర్నెన్స్ అమలు, స్మార్ట్ గవర్నెన్స్ తదితర అంశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికున్న అపార అనుభవంతో ఢిల్లీ ప్రభుత్వానికి ఎపి సహకారం అందించాలని కోరారు.

ఎపి బృందాన్ని ఢిల్లీకి పంపాలని, అక్కడ తమ అధికారులకు ఇక్కడ చేపడుతున్న కార్యక్రమాలు, విధానాల గురించి వివరించాలని కోరారు. దీనికి మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ ఢిల్లీ ప్రభుత్వానికి తాము పూర్తి సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం ప్రతినిధుల బృందాన్ని మంత్రి నారా లోకేష్ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సమావేశంలో ఢిల్లీ ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి సజ్జన్ సింగ్ యాదవ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### మత్స్యకారుల ఆచూకీ లభించే వరకు

# గాలింపు చర్యలు



- కోస్ట్ గార్డ్, మత్స్యశాఖ సమన్వయంతో గాలింపు ముమ్మరం
- కోనసీమ మత్స్యకారుల గల్లంతు ఘటనపై సిఎం చంద్రబాబు సమీక్ష

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** కోనసీమ జిల్లా మత్స్యకారులు వున్న బోటు సముద్రంలో గల్లంతయిన ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. మంగళవారం పొద్దుటే సీఎంఓ అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మత్స్యకారుల కోసం జరుగుతున్న గాలింపు చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. గల్లంతైన ఎనిమిది మంది మత్స్యకారుల ఆచూకీ లభించేంత వరకు గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలోని ఒడలరేవు, దుమ్మలపేట, వాసలతిప్ప గ్రామాలకు చెందిన 8 మంది మత్స్యకారులు ఆగస్టు 3వ తేదీ ఉదయం 10 గంటలకు ఒడలరేవు జెట్టి నుంచి చేపల వేటకు సముద్రంలోకి వెళ్లినట్లు అధికారులు సీఎంకు వివరించారు. బయలుదేరిన గంట తర్వాత, అంటే ఉదయం 11 గంటల వరకు వారు తమ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారని, ఆ తర్వాత నుంచి వారి నుంచి ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు. వారి బోటులో వీహెచ్‌ఎఫ్ సెట్‌తో పాటు వ్యక్తిగత మొబైల్ ఫోన్లు కూడా ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం 6 గంటల ప్రాంతంలో బోటు చేపలు పట్టే ప్రదేశానికి చేరుకొని ఉండవచ్చునని అంచనా వేస్తున్నట్లు అధికారులు సీఎంకు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 12 నాటికి బోటు తిరిగి రావాల్సి ఉన్నా రాకపోవడంతో, కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీంతో వెంటనే గాలింపు చర్యలు ప్రారంభించామని అధికారులు సీఎంకు తెలిపారు. కోస్ట్ గార్డ్ నౌకలను అప్రమత్తం చేసి గాలింపు చేపడుతున్నామని, అలాగే కాకినాడ, భైరవపాలెం, విశాఖపట్నం, పారాదీప్ ప్రాంతాలకు చెందిన మత్స్యకార బోట్లకు కూడా సమాచారం అందించి గల్లంతైన బోటు ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ కోస్ట్ గార్డ్, మత్స్యశాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసి గాలింపు చర్యలను మరింత ఉధృతం చేయాలని ఆదేశించారు. గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలతో అధికారులు నిరంతరం టచ్‌లో ఉండాలని, గాలింపు వివరాలను ఎప్పటికప్పుడు వారికి తెలియజేస్తూ ధైర్యం చెప్పాలని సూచించారు. బాధిత కుటుంబాలు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. మత్స్యకారులను సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను వినియోగించాలని స్పష్టం చేశారు.

# చంద్రబాబు బిసిల పక్షపాతి, ఆ నిర్ణయం చరిత్రాత్మకం

- శాసనసభలో బిసి వర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు హర్షం



మంగళవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్న బిసి వర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

**విజయవాడ,ఆగస్టు 18,ప్రభాతవార్తప్రతినిధి:** స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు కేబినెట్ ఆమోదం తెలపటం పట్ల అసెంబ్లీ వేదికగా తెలుగుదేశం పార్టీకి చెందిన మంత్రులు, ఎంఎల్ఏలు హర్షం వ్యక్తం చేసారు. సీఎం చంద్రబాబును ఆయనను సభలో కలిసి వారంతా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బీసీలకు స్థానిక సంస్థలలో 34శాతం రిజర్వేషన్లు కల్పించడంపై శాసనసభలో గళమెత్తారు. తమ మనోభావాలను వ్యక్తం చేసారుజగత ప్రభుత్వం రిజర్వేషన్ తగ్గించడం వల్ల బీసీలు పదవులు కోల్పోయారన్నారు. ఎన్టీఆర్ బాటలోనే నడిచి బీసీలకు మరింత అండగా నిలిచిన వ్యక్తి చంద్రబాబు అని ఎమ్మెల్యేలు గుర్తు చేసుకున్నారు. బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో జరిగిన చర్చలో పాల్గొన్న కూటమి పార్టీల ఎమ్మెల్యేలు స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికల విధానం తెచ్చినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ వచ్చిన తర్వాతే బీసీలకు సామాజిక న్యాయం జరిగిందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. బీసీలను చట్టసభలకు పంపిన పార్టీ టీడీపీ అని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై శాసనసభలో నిర్వహించిన చర్చలో మంత్రులు అచ్చెన్నాయుడు, సవిత, కొల్లు రవీంద్ర, పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. బలహీనవర్గాలు ఎప్పుడూ టీడీపీకు అండగా ఉంటున్నాయని అచ్చెన్నాయుడు అన్నారు. 1987లో మొదటిసారి ఎన్టీఆర్ హయాంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించారు. 1995లో చంద్రబాబు వాటిని 34 శాతానికి తీసుకొచ్చారు. 2020 వరకు స్థానిక సంస్థల్లో ఏ ఎన్నికలు జరిగినా ఎలాంటి ఇబ్బందీ లేకుండా 34 శాతం రిజర్వేషన్లు అమలయ్యాయి. 2019లో జగన్ సీఎం అయ్యాక రాష్ట్రానికి శని పట్టింది. బీసీలపై దమనకాండ జరిగింది. ఆ వర్గాల నేతలపై దాడుల చేసి హింసించారు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా టీడీపీకి బీసీలు అండగా నిలిచారు. అందుకే జగన్ కక్షగట్టారు. చట్టసవరణ చేయకుండా రిజర్వేషన్లు పెంచారు. బీసీలకు మాయమాటలు చెప్పారు. పెంచిన రిజర్వేషన్లపై కోర్టులో కేసు వేయించి వాటిని అమలు చేయకుండా అడ్డంకులు సృష్టించారు. హైకోర్టు ఆ జీవోను కొట్టివేసింది. బాధ్యత గల ప్రభుత్వం అయితే అప్పుడే సుప్రీంకోర్టుకు వెళ్లాలి. కానీ అలా జరగలేదు. ఆదరాబాదరాగా 24 శాతంతో స్థానిక ఎన్నికలు నిర్వహించారు. దీంతో బీసీలకు చాలా అన్యాయం జరిగింది. సర్పంచ్‌లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మేయర్ పదవులు చాలా వరకు బీసీలకు దక్కలేదన్నారు, ఎమ్మెల్యేలు గౌతు శిరీష, కూన రవికుమార్, బండారు సత్యానంద్, షాజహాన్ బాషా మాట్లాడుతూ బీసీలు అంటేనే టీడీపీ, టీడీపీ అంటేనే బీసీలు అన్నారు. టీడీపీ వచ్చాకే బీసీలకు రాజకీయ ప్రాధాన్యం దక్కిందన్నారు. 2016లో బీసీలకు సబ్‌ప్లాన్ తెచ్చిన ఘనత చంద్రబాబుదేనని కొనియాడారు. బీసీలకు సబ్‌ప్లాన్‌ను ఎందుకు రద్దు చేశారో జగన్ చెప్పాలని, బీసీ పథకాలకు ఎందుకు రద్దు చేశారని, బీసీల రిజర్వేషన్లపై జగన్ సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లలేదు నిలదీశారు. రిజర్వేషన్ల పెంపు వల్ల బీసీల జీవితాల్లో అనేక మార్పులు వస్తాయన్నారు. ఈ నిర్ణయంతో చంద్రబాబు దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. తల్లికి వందనం పేరుతో బీసీ విద్యార్థులు చదువుకునేలా అండగా ఉన్నారని, గ్రామస్థాయి నుంచి బీసీలకు రాజకీయ అవకాశాలు ఇచ్చే నిర్ణయమన్నారు. బీసీలకు విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించిన ఘనత టీడీపీదేనని తెలిపారు. గ్రామం నుంచి వచ్చిన సామాన్య కార్యకర్తను కూడా టీడీపీ మంత్రిగా చేసిందన్నారు. ఎందరో బీసీలను చట్టసభ సభ్యులు చేసిన ఘనత ఎన్టీఆర్‌దని, టీడీపీ చొరవ వల్లే అనేకమంది బీసీ వ్యక్తులు సభలో ఉన్నారని ఆయన హర్షం వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో సామాజిక న్యాయం ఉండాలని టీడీపీ కోరుకుంటోందన్నారు. జగన్ హయాంలో అనేక బీసీ పథకాలను నిర్వీర్యం చేశారని, బీసీ నాయకులను అణగదొక్కారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంలో అనేకమంది బీసీలు మంత్రులు అయ్యారన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో బీసీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. టీడీపీకి, బీసీలకు విడదీయరాని అనుబంధం ఉందని గుర్తు చేశారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 34 నుంచి 24 శాతానికి తగ్గించడంతో 16,800 పదవులను బీసీలు కోల్పోయారని మంత్రి సవిత ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీల కోసం బడ్జెట్ కేటాయింపులు పెంచడంతో పాటు గీత కార్మికులు, వడ్డెరలు, నాయీ బ్రాహ్మణులు, చేనేతలు, మత్స్యకారులకు పలు ప్రత్యేక ప్రయోజనాలు కల్పించిందన్నారు. బీసీలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేశామని, నామినేటెడ్ పోస్టుల్లోనూ 34 శాతం రిజర్వేషన్లకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకోవడంపై సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లడం శుభవార్త అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో బీసీలను అణచివేయాలని ప్రయత్నించారని చెప్పారు. టీడీపీ బీసీ నేతలపై కేసులు పెట్టారని ఎంతోమందిని పొట్టన పెట్టుకున్నారన్నారన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన తోట చంద్రయ్యను నడిరోడ్డుపై హత్య చేశారని నందం సుబ్బయ్య, అమర్నాథ్ గౌడ్‌ను చంపేశారన్నారు.

## వెయిట్‌లిఫ్టర్ గురునాయుడిని సత్కరించిన శాప్ ఛైర్మన్ రవినాయుడు

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** వెయిట్‌లిఫ్టర్ గురునాయుడిని శాప్ ఛైర్మన్ రవినాయుడు సత్కరించారు. ఉజ్బెకిస్తాన్‌లో వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో గురునాయుడు 3 రజతాలు సాధించారు. గురునాయుడు స్వస్థలం విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం చందకపేట. గురునాయుడు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని శాప్ ఛైర్మన్ ఆకాంక్షించారు. గురునాయుడికి త్వరలో ప్రోత్సాహకాలు అందజేస్తామని శాప్ ఛైర్మన్ హామీ ఇచ్చారు.

## మంత్రి నారాయణను కలిసిన విఎంసి కాంట్రాక్టర్లు

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో పెండింగ్ బకాయిల చెల్లింపుపై మంత్రి నారాయణను వీఎంసీ కాంట్రాక్టర్లు కలిశారు. తక్షణం రూ.50 కోట్లు చెల్లించేందుకు మంత్రి నారాయణ సుముఖత వ్యక్తం చేశారు. మిగిలిన బకాయిలు ఎలా చెల్లిస్తారని కాంట్రాక్టర్లు స్పష్టమైన హామీ కోరారు. మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో చర్చించి చెబుతానని మంత్రి చెప్పారు. బకాయిలు చెల్లించే వరకూ సమ్మె విరమించేది లేదని కాంట్రాక్టర్లు తెలిపారు.

## ఎపి గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా నాగబాబు నియామకం పట్ల మంత్రి దుర్గేష్ హర్షం

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పచ్చదనం పెంపు, అటవీ విస్తీర్ణం, పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఎకలాజికల్ ఎన్‌రిచ్‌మెంట్ (ఏపీ గ్రీన్) ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా కేబినెట్ హోదా కల్పిస్తూ ఎమ్మెల్సీ కొణిదెల నాగేంద్రరావు (నాగబాబు) నియామకం పట్ల మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ నాగబాబు నేతృత్వంలో "పచ్చని ఆంధ్రప్రదేశ్ – ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్" ఆశయ సాధన దిశగా రాష్ట్రం వేగంగా అడుగులు వేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఏపీ గ్రీన్ లక్ష్యాలు, కార్యక్రమాల అమలులో వివిధ ప్రభుత్వ శాఖలు, జిల్లా స్థాయి సంస్థల మధ్య సమన్వయం సాధించడంతో వాటి పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం వంటి కీలక బాధ్యతలను ఎమ్మెల్సీ నాగబాబు సమర్థ వంతంగా నిర్వహిస్తారని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎఫ్‌సివి పొగాకు కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- నోబిడ్స్ మరింత తగ్గాలి.. రైతులకు మెరుగైన ధర దక్కేలా చర్యలు చేపట్టాలి
- పొగాకు బోర్డు ఉన్నతాధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష



**విజయవాడ ఆగస్టు 18 ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఎఫ్‌సీవీ పొగాకు వేలాలు, కొనుగోళ్ల తాజా పరిస్థితిపై మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పొగాకు బోర్డు సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసు కున్నారు. కొనుగోళ్ల వేగం పెరగడం, నోబిడ్ శాతం క్రమంగా తగ్గుతుండటం సానుకూల పరిణామమని పేర్కొన్న మంత్రి, ఇదే వేగాన్ని కొనసాగిస్తూ రైతులకు మరింత మెరుగైన ధర లభించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇప్పటివరకు 117 వేలాలు పూర్తయ్యాయని, సుమారు 60 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు జరిగిందని, ప్రస్తుతం సగటు ధర కిలోకు సుమారు రూ.210 వద్ద కొనసాగుతోందని అధికారులు మంత్రికి వివరించారు. ఇటీవల రోజుల్లో కొనుగోళ్ల వేగం పుంజుకుని రోజుకు సగటున 1.5 నుంచి 2 మిలియన్ కిలోల వరకు అమ్మకాలు జరుగుతున్నాయని తెలిపారు. అదే సమయంలో నోబిడ్ శాతం క్రమంగా తగ్గుతూ రావడం రైతులకు ఊరటనిచ్చే పరిణామమని మంత్రి పేర్కొన్నారు. పొగాకు రైతుల ప్రయోజనాలే ప్రాధాన్యంగా కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. పొగాకు కొనుగోలు కంపెనీలు, ట్రేడర్లతో మరోసారి చర్చించి కొనుగోళ్ల పరిమాణాన్ని పెంచాలని, "నోబిడ్స్‌ను మరింత తగ్గించాలని పొగాకు బోర్డు అధికారులకు సూచించారు. ముఖ్యంగా రైతులకు లభిస్తున్న సగటు ధర మరింత పెరిగేలా కంపెనీలు, ట్రేడర్లతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పొగాకు రైతులు ఇబ్బందులు పడకుండా వేలాలు, కొనుగోళ్ల పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు మెరుగైన ధర దక్కేలా పొగాకు బోర్డు, కొనుగోలు కంపెనీలు, ట్రేడర్లతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## నేడు చెన్నైకి సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగస్టు 19, 20 తేదీల్లో చెన్నైలో పర్యటించనున్నారు. ఈ మేరకు సీఎం పర్యటన షెడ్యూల్ ఖరారైంది. రేపు సాయంత్రం 5:30 గంటలకు విజయవాడ ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో చెన్నై వెళ్లనున్నారు. ఆగస్టు 19వ తేదీ రాత్రి చెన్నైలోని తాజ్ ఫిషర్‌మ్యాన్స్ కోవ్ రిసార్ట్‌లో ముఖ్యమంత్రి బస చేయనున్నారు. ఆగస్టు 20వ తేదీన ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు జరిగే 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో సీఎం పాల్గొననున్నారు. అనంతరం ఆగస్టు 20వ తేదీ సాయంత్రం 5:15 గంటలకు ఉండవల్లి నివాసానికి సీఎం చంద్రబాబు చేరుకోనున్నారు.

## కేంద్ర మంత్రి నిర్మలకు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ



**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జన్మదినం సందర్భంగా "ఎక్స్"లో వేర్వేరు పోస్టుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్‌కు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని దేవుడిని ప్రార్థించారు. ఆపారమైన శక్తితో దేశ ప్రగతిని ఆమె ముందుకు నడిపించాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా చంద్రబాబు, లోకేశ్ పోస్టు పెట్టారు. ర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మీరు ఆయురారోగ్యాలతో సంతోషంగా నిండు నూరేళ్లు జీవించాలని కోరుకుంటున్నాను. దేశ ప్రగతికి మీరు అదే అంకితభావం, అవిశ్రాంత శక్తితో మార్గనిర్దేశం చేస్తూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాను అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.,నిర్మలా సీతారామన్‌కు మంత్రి నారా లోకేశ్ కూడా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి ఆమె అందిస్తున్న విశిష్ట సేవలు కొనసాగాలని ఆకాంక్షించారు. కేంద్ర మంత్రికి మంచి ఆరోగ్యం, సంతోషం, మరింత శక్తి లభించాలని దేవుడిని కోరారు. రాబోయే ఏడాది మరిన్ని విజయాలు సాధించాలని లోకేశ్ ప్రార్థించారు.

## ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. నిరంతరంగా అత్యధిక కాలం కేంద్ర ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ సేవలందిస్తున్నారని వ్యాఖ్యానించారు. నిర్మలా సీతారామన్ నాయకత్వంలో భారత ఆర్థిక ప్రస్థానం మరింత బలోపేతమైందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పోస్టు పెట్టారు. నిర్మలా సీతారామన్ నాయకత్వంలో భారత్ ప్రపంచంలో నాల్గో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని పవన్ కల్యాణ్ ప్రశంసించారు.

## బిజెపి నూతన బాధ్యులకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** బీజేపీ జాతీయ స్థాయిలో పదవులు పొందిన నేతలకు జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన దగ్గుబాటి పురందేశ్వరి, రామ్ మాధవ్‌లను ఆయన అభినందించారు. అన్ని విభాగాల సంయుక్త సమన్వయకర్తగా నియమితులైన విష్ణువర్ధన్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. జాతీయ కార్యవర్గంలో చోటు దక్కించుకున్న మిగతా నాయకులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

## పోలీసుల దెబ్బలు తట్టుకోలేక ఒకరి మృతి?

**సాలూరు, ఆగస్టు 18, ప్రభాతవార్త:** సాలూరు మున్సిపల్ పరిధి గుమడం గ్రామంలో ఏప్రిల్ నెలలో జరిగిన బంగారం దొంగతనం కేసులో రెండవ ముద్దాయి (ఏ2) బండారు. మణికంఠ (22) పట్టణ పోలీసులు దెబ్బలు తాళలేక మరణించినట్లు ఆ యువకుడు తల్లి అనురాధ, సోదరుడు సతీష్ ఆరోపిస్తున్నారు. వారు చెప్పిన వివరాలు ప్రకారం బంగారం చోరీ కేసులో మొదటి ముద్దాయి(ఏ1) గోల్డ్ దొంగతనం చేయగా అమ్మేందుకు సహకరించాడనే నెపంతో మణికంఠపై కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్‌లో చేర్చారన్నారు. ఈ మధ్యన ఆ దొంగతనం కేసు చేధించిన టౌన్ పోలీసులు మణికంఠను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. అంతేకాకుండా విచారణలో భాగంగా తీవ్రంగా కొట్టడంతో గాయాలు పాలై సోమవారం మరణించాడని చెప్పారు. ఇది ఇలా ఉంచితే కొంతకాలం క్రితం గుమడంకు చెందిన యువకుడితో మణికంఠకు పరిచయం కాగ అతను దొంగతనం చేసిన బంగారం అమ్మేందుకు అలాగే ఆ డబ్బులు తన బ్యాంక్ ఎకౌంట్‌లో పడడంతో మణికంఠను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సమాచారం. విచారణలో ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆ యువకుడ్ని ఆగస్టు 7 అదుపులోకి తీసుకొని రెండు రోజులు చిత్రహింసలకు గురి చేసినట్టు తెలుస్తుంది. అలాగే 9 తేదీన అరెస్టు చూపెట్టారని తల్లి సోదరుడు స్టేషనుకు వెళ్లి మణికంఠను చూపెట్టమన్నా చూపెట్టలేదని అరోపలు వినిపిస్తున్నాయి. ఆ తరువాత మణికంఠ తీవ్ర అస్వస్థకు గురికావడంతో ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లిన తర్వాత పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్టుగా తెలుస్తుంది. వెంటనే ఆసుపత్రికి కుటుంబసభ్యులు వెళ్లి చూసేసరికి తీవ్ర గాయాలతో ఆ యువకుడు ఉన్నాడని తల్లి సోదరుడు ఆరోపణ. వైద్యులు విజయనగరం రిఫర్ చేయగా మెడికవర్ హాస్పిటల్లో చేర్పించి చికిత్స అందించినప్పటికీ మణికంఠ మరణించాడని తెలిపారు. దీనికి పోలీసుల కారణమని, వారిపై చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారిపై మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేస్తూ నిరసన చేపట్టారు.

**సవరణ**

ది.17.08.2026 వ తేదీన జిల్లా కలెక్టరు, తూర్పు గోదావరి, రాజమహేంద్రవరం వారి కార్యాలయం నుండి వెలువడిన ప్రాథమిక ప్రకటన వరుస క్రమ సంఖ్య 78 లో సర్వే నెంబరు మరియు సంబంధిత ఆసామి పేరు పడియుండలేదు. కావున వాటిని సవరణ చేయడమైనది గమనించగలరు.

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 78 | 1839 (Old LPM No.1181) | 0.52 | 0.502 | నంజ | వంగూరి హేమ భర్త మున్నీ | 1178 | 1268, 1180 | 1219 | 1838 | ఇతర చెట్టు-2 |

జిల్లా కలెక్టరు, తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం.

వార్త


మారణాయుధాలు మనల్ని నాశనం చేయకముందే మనం వాటిని నాశనం చేయడం మంచిది.

- జాన్ కెనడీ

# కలగూరగంపలో కాలకూటం!


సంపూర్ణ ఆరోగ్యానికి బాసటగా ఉంటాయనుకున్న ఆకు కూరల్లో పురుగు మందుల్లోని రసాయనిక అవశేషాలున్నాయంటే ఒకేసారి గుండె గుభేల్మంటుంది. రోజువారీ భోజనంలో వండి వడ్డించుకునే ఆధరువుల్లో ఏదో ఓ కూరగాయ ఉడికించి తాళింపు వేసేవే. ఏ కూరగాయ ఎలా వండినా శరీరానికి పుష్టిచేకూర్చేవని నమ్ముతాం. టమోటాలు, వంకాయలు, క్యారెట్, క్యాబేజి, కేరట్, బీట్‌రూట్ ఏవి తిన్నా ఎన్నో పోషకాలున్న పౌష్టికాహారాన్ని తింటున్నామని భుక్తాయాసంతో తృప్తిపడతాం. తీరా వాటిల్లో పురుగు మందుల తాలూకు రసాయనిక అవశేషాలున్నాయని తెలిస్తే ఆరోగ్య బెంగ తప్పదు. తాజాగా లోక్‌సభలో తెలుగు రాష్ట్రాల్లో భారీగా పురుగు మందుల వాడకం, అదే మాదిరిగా ఇక్కడ పండించే కూరగాయల్లో రసాయనిక అవశేషాలను గురించి వివరించారు. పంట ఏదైనా, శాస్త్రజ్ఞులు వాటితో నిమిత్తం లేకుండా 'అధిక పురుగు మందు వాడకంతో అత్యధిక దిగుబడి' వస్తుందన్న ఆశతో ఎక్కువ మోతాదులో ఎరువులు,పురుగుమందులు వాడతారని అపప్రథ ఉండనే ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో 2,104 నమూనాల పరిశీలనలో 134 నమూనాల్లో అధిక రసాయనిక అవశేషాలున్నాయి. అంటే 6.36 శాతం. తెలంగాణ నమూనాలు 8198లో 486 శాంపిళ్లలో అధిక మోతాదు పురుగుమందులు కనిపించాయి. 5.92శాతం అని గణాంకాలు చెబుతున్నాయి. వీటితోపాటు హరియాణ నమూనాల్లో 6.41 శాతం అవశేషాలున్నాయి. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్‌ల నుంచి సేకరించిన నమూనాల్లో ఒక్కదానిలో కూడా ఎలాంటి అవశేషాలు లేవు. 2005 నుంచి జాతీయ స్థాయిలో పురుగుమందుల అవశేషాల అన్వేషణ ప్రాజెక్టు ఉంది. ఏటా తమకు అందిన నమూనాల్లో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియాతో సంస్థ ఏ మేరకు పురుగుమందుల అవశేషాలున్నాయో పరిశోధనల్లో తెలుస్తోంది. నమూనాలను సేకరించి అవశేషాలను బట్టబయలు చేయడం ఒక ఎత్తయితే పంటలకు పట్టిన తెగుళ్లను అక్కడికక్కడ విశ్లేషించి వ్యవసాయ సూచనలు చేసే ఒక ప్రత్యేక యంత్రాంగమూ ఉంటుంది. 2023 నుంచి 2026 వరకు దేశం మొత్తం మీద 70,652 పండ్లు కూరగాయల నమూనాలను పరీక్షించగా 2223 నమూనాల్లో మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఐఎస్ ప్రమాణాల సంస్థ నిర్దేశిత పరిమితి కన్నా అధిక పురుగుమందుల అవశేషాలున్నట్లు గుర్తించింది. అంతేకాదు దీర్ఘకాలికంగా నిలువ ఉండిపోయే సేంద్రియ కాలుష్య కారకాలు, కొన్ని సందర్భాల్లో భారీలోహాలు ఉన్నట్లు బయటపడింది. ఇలాంటివే 'ఆహార భద్రత, ఆరోగ్య రక్షణ' వంటిఅంశాల్లో అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఒక వ్యక్తి ప్రతిరోజూ ఏదో విధంగా తక్కువ మోతాదులో వచ్చి చేరే కలుషిత ఆహారం దీర్ఘకాల దుష్ప్రయోజనం గురించి తప్పనిసరిగా తెల్చుకోవాలి. అప్పుడే మంచి ఆరోగ్యాన్ని పొందగలుగుతాడు. పరిస్థితులు చెయ్యిదాటక ఎవరూ ఏమీచేయలేరు. పురుగుమందుల్లో అవశేషాల వలన నాడీవ్యవస్థ, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులపై చెడు ప్రవాహం కన్పిస్తుంది. ఆ తర్వాత వైద్యచికిత్సలకు శరీరం లొంగకపోతే ఇక మంచమే గతి. కొన్ని రసాయనాలు కేన్సర్, హార్మోన్‌ల అసమతుల్యత, రోగనిరోధక వ్యవస్థను దెబ్బ తీయడం వంటి అనారోగ్య సమస్యలు తెచ్చిపెట్టవచ్చు. అందుకే అన్ని సందర్భాల్లోనూ సురక్షిత వ్యవసాయానికి ఆర్థిక ప్రోత్సాహకాలతోపాటు, రసాయనిక అవశేషాలు మిగలకుండా చూసే శాస్త్రీయ విధానాలను అనుసరించాల్సి ఉంది. విత్తనం నుంచి వినియోగదారునికి సాగు ఉత్పత్తులు చేరేవరకు ప్రజారోగ్య విశ్లేషణ ప్రణాళికలు ఉండాలి. రసాయన కాలుష్యం కేవలం పురుగుమందుల పిచికారీ వల్లనేరాకపోవచ్చు. కలుషిత నీటితో సాగుకూడా మంచిది కాదు. భూమిలోకి పారిశ్రామిక వ్యర్థాలుచేరడం, మురుగునీటి వాడకం, కాలుష్యభరిత మట్టిలో పంటలు పండించడం వలనకూడా కూరగాయలపై కలుషిత ప్రభావం ఉంటుంది. పంటలను తెగుళ్ల నుంచి కాపాడుకోవడానికి రైతులు విచక్షణారహితంగా వాడే సింథటిక్ పురుగు మందులు కూడా వాడడంతో కలుషిత అవశేషాలు ఉండే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా నమోదైన మొత్తం అవశేషపు నమూనాల్లోసగం దక్షిణ భారతంలోని ఐదురాష్ట్రాల నుంచే కావడం ఆందోళనకరం. ఉండాల్సిన గరిష్ట పురుగు మందు పరిణామం (ఎం.ఆర్.ఎల్) ఎక్కువగా ఉంటే మానవ ఆరోగ్యానికి తీవ్రహాని కలిగిస్తుంది. ఆంధ్ర, తెలంగాణ మార్కెట్‌లలో విరివిగా లభించే వంకాయ, బెండ, టమాటా, క్యాప్సికం, ద్రాక్షలలో మోనోక్రోటోఫాస్, క్లోరోపైరిఫాస్, ప్రొఫెనోఫాస్‌లుంటాయి. ఇలాంటి అవశేషాలు తరచు మనం తినే కూరగాయల్లో ఉంటే, పది పదిహేనేళ్లలో దాని చెడు ప్రభావం 'స్లో పాయిజన్' రూపంలో శరీరానికి చేరుతుంది. సాధారణంగా నిర్దిష్ట గడువులో మందులు వాడాక పంటకోత కోస్తే, సమయంచూసుకుని కోతకు దిగాలి. అవేమీ పాటించకుండా మందు కొట్టిన వెంటనే కోతలు కోస్తే తప్పనిసరిగా అవశేష నమూనాలు వాటిని ఆశించి ఉంటాయి. దేశం ఆహార భద్రతలోనే కాకుండా విషరహిత ఆహారాన్ని వినియోగదారునికి అందించడంలోకూడా ముందడుగు వేయాలని లేకుంటే ఆరోగ్యానికి అన్నీ అనర్థాలేనని చెప్పడం తప్పదు. విషయం ఈనాటి గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మార్కెట్ నుంచి వచ్చిన కూరగాయలను వంట కోసం స్వీకరించినప్పుడు ఆ కూరలను ఉప్పునీళ్లలో లేదా బేకింగ్ సోడా నీళ్లలో పదినిమిషాలు నానబెట్టి ఆ తరువాత కడిగి వంటకు ఉపక్రమించడం ముఖ్యం. తోటల్లో స్ప్రే చేసే రైతులు కూడా దాని ప్రభావం మీద పడి కేన్సర్ వంటి రోగాలకు గురవకుండా చూసుకోవాలి. అప్పుడే రైతుకు, రైతు పండించే ఉత్పత్తులకు, వాటిని వండుకునే వినియోగదారులకు ఆరోగ్య రక్ష కాగలదు.

రచయిత మేధావిలా ఆలోచించాలి కానీ సగటు మనిషికి అర్థమయ్యేంత సులువుగా రాయాలి.



అరిస్టాటిల్

గొప్ప గొప్ప వివాదాలను పరిష్కరించగలిగేది సమర్థులు లేదా వ్యతిరేకులు మాత్రమే, తటస్థులు కాదు.



సిసిరో

# భారత్ ఆచితూచి అడుగులు వేయాలి

**పొరుగునున్న నేపాల్‌లో ప్రభుత్వాలు మారినప్పుడల్లా భారత్‌పై వాటి విదేశాంగ విధానం కూడా మారుతున్నది. ఇస్లామిక్ దేశాల్లో చాలావరకు మనకు అనుకూలత ఉన్నా, ఇతర దేశాల కుట్రలతో ఆయా దేశాలు ఎప్పుడెలా మారతాయో తెలియదు. ఇస్లామిక్ నాటో పట్ల కూడా భారత్ ఆచితూచి అడుగులు వేయాలి. మన చుట్టూ ముప్పుపొంచి ఉంది. సరికొత్త వ్యూహాలతో, భారత్‌ను రక్షణపరంగా శత్రు దుర్భేద్యంగా మార్చాలి. భారత్ సాంకేతికంగా, ఆయుధపరంగానూ బలీయమైన శక్తిగా ఎదిగినప్పటికీ మధ్య ప్రాచ్యంలో గతకొన్ని నెలలుగా జరుగుతున్న యుద్ధ పరిణామాలు, ఆయిల్ సంక్షోభం వలన ఆర్థికంగా నష్టపోతున్న విషయం విదితమే. యుద్ధాల అంచుల్లో పయనిస్తున్న ప్రపంచంలో ఎప్పుడు ఏ సంక్షోభం తలెత్తుతుందో ఊహించలేం. వర్తమాన అంతర్జాతీయ పరిణామాలను బట్టి భారత్ ఆచితూచి అడుగులువేయాలి.**



సుంకవల్లి సత్తిరాజు

బలూచిస్తాన్ స్వాతంత్ర్యం ప్రకటించుకుంది. ఇక ఇతర దేశాల గుర్తింపే మిగిలి ఉంది. పాక్ ఆక్రమిత కాశ్మీర్ కల్లోలంగా మారింది. పిఓకే పాక్ నుండి విడిపోవడానికి సిద్ధంగా ఉంది. పాక్ పాలకుల పట్ల, మిలటరీ వ్యవస్థ పట్ల అక్కడి ప్రజల్లో కోపాగ్ని కట్టలు తెంచుకుంది. ఇవన్నీ భారత దేశానికి సానుకూల అంశాలైనప్పటికీ, ఈ అవకాశాలను ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ వినియోగించుకుంటుందా? లేక మరికొంత కాలం వేచిచూస్తుందా అనే విషయంలో స్పష్టత రావలసి ఉంది. జంతర్ మంతర్‌లో సిజెపి సాగించిన ఉద్యమం తర్వాత భారత ప్రభుత్వంఎఫ్‌సిఆర్ఏ, మహిళా రిజర్వేషన్ల బిల్లు, డీలిమిటేషన్ బిల్లులను లోక్‌సభలో ప్రవేశ పెట్టకుండా వాయిదా వేసింది. విదేశీ విరాళాలకు సంబంధించిన ఎఫ్‌సిఆర్ఏ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపించాలని నిర్ణయించింది. ఒకవైపుఅంతర్జాతీయ ఒత్తిళ్లు, మరోవైపు ప్రతిపక్షాల నిరసనలు, ఇంకోవైపు జన్ జి హెచ్చరికలతో కేంద్రప్రభుత్వం కొంత ఇరకాటంలో పడింది. ఈ పరిస్థితుల దృష్ట్యా పాక్ విషయంలో సంయమనం పాటిస్తుందా?అనే అంశం ప్రస్తుతానికి సందిగ్ధంలోనే ఉంది. ఒకవైపు ఇరాన్ యుద్ధం వలన ఏర్పడిన ఇంధన కొరత వలన దేశం ఆర్థికంగా సవాళ్లను ఎదుర్కొంటున్నది. దేశం అనేక బాలారిష్టాలను అధిగమించి, వివిధ రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తున్నది. విద్య, వైద్య, శాస్త్ర, సాంకేతిక, అణు, ఆయుధ, రక్షణ రంగాలు బలోపేతమైనాయి. అయితే శత్రుశేషం మిగిలేఉంది. అమెరికా, చైనా, పాక్, బంగ్లాదేశ్ వంటి దేశాల వైఖరి వలన భారత్ అనేక అవరోధాలు ఎదుర్కొంటున్నది. దేశంలో ఇంకా పేదరికం పోలేదు. ఆర్థిక అంతరాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఉపాధి అవకాశాల కోసం యువత నానా అగచాట్లు పడుతున్నది. చమురు రంగం భారత్ ఆర్థిక పరిస్థితిని శాసిస్తున్నది. అమెరికా భారత్‌పై అసూయా ద్వేషాలతో రగిలిపోతున్నది. డ్రాగన్ తన రణవ్యూహాలకు పదును పెడుతున్నది. అంతర్యుద్ధంతో అతలాకుతలమవుతున్న దాయాది దేశం తన భూభాగాలను చైనాకు విక్రయించడానికి ప్రయత్నిస్తుందన్న వార్తలు వెలువడుతున్నాయి. తాచెడ్డ కోతి వనమెల్ల చెరిచిన చందంగా పాక్ వైఖరి దారుణంగా మారింది. సీమాంతర ఉగ్రవాదం ప్రోత్సహిస్తూ, కాశ్మీరంలో కల్లోలం సృష్టించిన పాక్‌కు ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ తగిన గుణపాఠం చెప్పడం ద్వారా ప్రపంచ దేశాలకు భారత్ ఆయుధ సామర్థ్యం తెలియవచ్చింది. అమెరికా, చైనా ఆయుధాల పేలవమైన ప్రదర్శన కూడా ఆయా దేశాల ఆయుధాలు కొనుగోలు చేసే దేశాలను పునరాలోచనలో పడేశాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత అమెరికా వైఖరిలో స్పష్టమైన మార్పు వచ్చింది. పాకిస్థాన్‌కు అండగా నిలబడుతూ, వివిధ రకాలుగా భారత్ వ్యతిరేక వైఖరి ప్రదర్శిస్తున్నది. ట్రంప్ భారత్‌పై ప్రదర్శిస్తున్నఅక్కసు వలన భారత్ ఆర్థికంగా నష్టపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. అమెరికా విధిస్తున్న టారిఫ్‌లవలన భారత వాణిజ్యం గందరగోళంలో పడింది. ట్రంప్ ట్రేడ్ పాలసీ, టారిఫ్‌లు, వీసా నిబంధనలను పరిశీలించి, విశ్లేషించిన తర్వాత భారత్ ఇక ఏ మాత్రం అమెరికాపై ఆధారపడకూడదన్న ఆలోచనభారత ప్రభుత్వానికి స్ఫూరించే ఉంటుంది. ఇంధన రంగంలో ఏర్పడిన సంక్షోభం దృష్ట్యా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా భారత్ స్వయం సంమృద్ధి సాధించవలసిన ఆవశ్యకత ఏర్పడింది. భారత్‌కు రష్యాతోగల వాణిజ్య, స్నేహ సంబంధాలు అమెరికాకు ఇష్టం లేదు. రష్యా ఉక్రెయిన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధానికి అమెరికా, నాటో దేశాలే కారణం. అయితే



అమెరికా ఈ విషయంలో భారత్‌పై అకారణ నింద మోపడం హాస్యాస్పదం. రష్యా, ఉక్రెయిన్ల మధ్య గత నాలుగున్నరేళ్లుగా యుద్ధం కొనసాగడానికి అమెరికాతో పాటు, ఇప్పుడు అమెరికాను విమర్శిస్తున్న నాటో కూటమి అందించిన ఆయుధ, ఆర్థిక సహకారమే కారణం. ఈ విషయాన్ని పక్కదారి పట్టించి రష్యానుండి భారత్ అధిక మొత్తంలో క్రూడాయిల్ దిగుమతి చేసుకుని, రష్యాకు ప్రధాన ఆదాయ వనరుగా మారిందని, అందువలనే ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం చేయగలుగుతున్నదని అమెరికా వితండవాదం చేయడమే కాకుండా భారత్ ఉత్పత్తులపై 100శాతం సుంకాలు విధిస్తూ అమెరికా సెనేట్ భారీ మెజారిటీతో తీర్మానం ఆమోదించడం విడ్డూరం. ట్రంప్, మోడీలు మంచి స్నేహితులు కాబట్టి ఈటారిఫ్‌లపై వారే మాట్లాడుకుంటారని ట్రంప్ సలహాదారులు వ్యాఖ్యానించడం కొసమెరుపు. భారత్ అమెరికాల మధ్య ట్రేడ్‌డీల్ అమల్లోకి వస్తే సెనేట్ ఆమోదించిన తీర్మానానికి విలువ ఉంటుందా? ఇరాన్ పై యుద్ధం ప్రకటించి, తమకు గల ఆయుధ నిల్వలను ఖాళీచేస్తూ, ఆర్థికంగా దివాలా తీసిన అమెరికాకు ఇతర దేశాల వ్యవహారాల్లో తలదూర్చితే ఏం జరుగుతుందో ఇరాన్ యుద్ధ ఫలితాలు నిరూపించాయి. ఇరాన్ చేతిలో భంగపడి, చేతులు కాల్చుకున్న అమెరికా ఒకవైపు మేక పోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ, మరోవైపు ఇరాన్‌ను బుజ్జగించి, శాంతి ఒప్పందానికి పాక్ లాంటి దేశాల మధ్యవర్తిత్వం కోసం ఆర్థికసహాయం చేస్తూ, అంతర్జాతీయంగా అపకీర్తి మూటగట్టుకుంది. భారత్ పై అమెరికా పగబట్టి, ఆర్థికంగా దెబ్బతీయాలని చూస్తుంటే, భారత్‌కు చైనా మరోవైపు పొగబెడుతున్నది. చైనా బ్రహ్మపుత్ర నదిపై 14 లక్షల కోట్ల రూపాయల ఖర్చుతో ప్రపంచంలో అతిపెద్ద డ్యామ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టి భారత్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నది. జల విద్యుత్ ప్రాజెక్టు పేరుతో చైనా నిర్మిస్తున్న ఈ డ్యామ్ వలన భారత్ ఈశాన్య రాష్ట్రాలకు నీటి సరఫరా చేయకుండా నిలిపి వేయడం, వరదలు సంభవిస్తే ఈ ప్రాంతాలను ముంపుకు గురిచేసే దురుద్దేశ్యం ఇందులో దాగివుంది. భారత్ పాక్‌కు సింధు జలాలను నిలిపివేయడం వలన పాక్‌లో నీటి సంక్షోభం ఏర్పడగా మరోవైపు, పాక్‌ఆక్రమిత కాశ్మీర్, బలుచిస్తాన్ ప్రాంతాల్లో అంతర్యుద్ధం చెలరేగింది. త్వరలో బ్రిక్స్‌దేశాల సమావేశం భారత్‌లో జరగనున్న దృష్ట్యా భవిష్యత్ అవసరాలదృష్ట్యా చైనా దేశం భారత్ పట్ల సానుకూల వైఖరి ప్రదర్శిస్తుందా? అమెరికాకు వ్యతిరేకంగా భారత్‌తో చేతులు కలుపుతుందా? అనే విషయంలో ఒక స్పష్టమైన సంకేతం వెలువడే అవకాశముంది. ఏదిఏమైనప్పటికీ పొరుగు దేశాల వలన భారత్‌కు అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. 'యు కెన్ ఛేంజ్ ఫ్రెండ్స్ బట్‌నాట్ నైబర్స్' అంటూ అప్పటి మన ప్రధాని వాజ్ పేయి చెప్పిన మాటలు అక్షరసత్యాలు. ఈ వాస్తవం వర్తమాన భారతంలో జరుగుతున్న పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి. ఒకప్పుడు పాక్ ఆగడాలు, అలసత్వం, నియంతృత్వం భరించలేక భారత్ శరణు జొచ్చి, తూర్పు పాకిస్థాన్‌ను 'బంగ్లాదేశ్' ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేయడంలో భారత్ చేసిన కృషిని నేడుఅక్కడి పాలకులు, యువత మరచిపోవడం దురదృష్టకరం. చైనా, పాకిస్తాన్, ఆఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, మయన్మార్, నేపాల్ దేశాలతో భూ సరిహద్దులను పంచుకుంటున్నభారత్‌కు చైనా, పాక్, బంగ్లాదేశ్‌లతో ప్రస్తుతం బద్ధవైరం నెలకొని ఉంది. భారత్‌తో సముద్ర సరిహద్దులు గల శ్రీలంక, మాల్దీవులతో గతంలో కొన్ని విభేదాలుతలెత్తి ప్రస్తుతం సద్దుమణిగాయి. ఇప్పుడు శ్రీలంక భారత్‌తో సఖ్యంగానే ఉంటున్నా భారత్‌కు జరగవలసిన అనర్థ ఇప్పటికే జరిగిపోయింది. ఇక పొరుగునున్న నేపాల్‌లో ప్రభుత్వాలు మారినప్పుడల్లా భారత్ పై వాటి విదేశాంగ విధానం కూడా మారుతున్నది. ఇస్లామిక్ దేశాల్లో చాలా వరకు మనకు అనుకూలత ఉన్నా, ఇతర దేశాల కుట్రలతో ఆయా దేశాలు ఎప్పుడెలా మారతాయో తెలియదు. ఇస్లామిక్ నాటో పట్ల కూడా భారత్ ఆచితూచి అడుగులువేయాలి. మన చుట్టూ ముప్పుపొంచిఉంది. సరికొత్త వ్యూహాలతో, భారత్‌ను రక్షణపరంగా శత్రు దుర్భేద్యంగా మార్చాలి. భారత్ సాంకేతికంగా, ఆయుధపరంగానూ బలీయమైన శక్తిగాఎదిగినప్పటికీ మధ్య ప్రాచ్యంలో గతకొన్ని నెలలుగా జరుగుతున్న యుద్ధ పరిణామాలు, ఆయిల్ సంక్షోభంవలన ఆర్థికంగా నష్టపోతున్న విషయంవిదితమే. యుద్ధాల అంచుల్లో పయనిస్తున్న ప్రపంచంలో ఎప్పుడు ఏసంక్షోభం తలెత్తుతుందో ఊహించలేం. వర్తమాన అంతర్జాతీయ పరిణామాలనుబట్టి భారత్ ఆచితూచి అడుగులువేయాలి. ●

# కోర్టులలో 5.74 కోట్లు దాటిన పెండింగ్ కేసులు!



శిరందాసు నాగార్జున

దేశంలోని న్యాయస్థానాలలో కోట్ల సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. పెండింగ్ కేసుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. 2022 జూన్ నెలాఖరు నాటికి దేశవ్యాప్తంగా వివిధ న్యాయస్థానాల్లో దాదాపు4.83 కోట్లకుపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్ర ప్రభుత్వంవెల్లడించింది. ప్రస్తుతం దేశం మొత్తం కోర్టులలో పెండింగ్ కేసులు 5.74 కోట్లు దాటిపోయాయి. ఒక్క సుప్రీంకోర్టులోనే పెండింగ్ కేసులసంఖ్య 95 వేలు దాటింది. సాక్షుల గైర్హాజరు కావడం, సరైన సమయానికి ఆధారాలు అందకపోవడంతో కేసుల విచారణ ప్రక్రియ క్లిష్టంగా మారింది. లోక్ అదాలత్‌ల నిర్వహణ ద్వారా రాజీ పడదగిన కేసులను త్వరగా పరిష్కరించడం, ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయడం, ఈకోర్టుల ప్రాజెక్ట్ ద్వారా డిజిటల్ విధానంలో స్పీడ్ పెంచడం వంటి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయినా కేసుల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతూనే ఉన్నాయి. జడ్జిల పోస్టులు ఖాళీగా ఉండటం కూడా ఒక కారణం. నేషనల్ జ్యుడిషియల్ డేటా ప్రకారం ఈ ఏడాది ఆగస్ట్ 17వ తేదీనాటికి దేశవ్యాప్తంగా సుప్రీంకోర్టు, హైకోర్టులు, రాష్ట్రాలలోని ఇతర కోర్టులలో సివిల్ కేసులు 1,58,54,896ఉండగా, క్రిమినల్ కేసులు 4,15,76,022ఉన్నాయి. మొత్తం 5,74,30,918 పెండింగ్ కేసులున్నాయి. ఇందులో 30ఏళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న కేసులు కూడా ఉన్నాయి. ప్రస్తుతం సుప్రీం కోర్టులో సివిల్ కేసులు 73,915, క్రిమినల్ కేసులు 21,653, మొత్తం 95,568 పెండింగ్ కేసులున్నాయి. రిజర్వ్ చేసిన తీర్పుల వెల్లడిలో కూడా హైకోర్టులలో తీవ్ర జాప్యం జరగడం పట్ల సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హైకోర్టుల్లో విచారణలు, తీర్పుల వెల్లడిలో జాప్యం నివారించేందుకు సుప్రీం కోర్టు చర్యలు చేపట్టింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కల్పించిన విశేషఅధికారాలను ఉపయోగించి న్యాయవ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేలా, జాప్యం తగ్గించేలా పలు అంశాలపై అన్ని హైకోర్టులకు సుప్రీం కోర్టు కొన్ని సూచనలుచేసింది. సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బగ్చిలతో కూడిన ధర్మాసనం మే 29న కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఝార్ఖండ్‌కు సంబంధించిన ఒక కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ సూచనలు చేసింది. రిజర్వ్‌చేసిన తీర్పులు గరిష్ఠంగా 3నెలల్లోపు వెలువరించాలి. తీర్పు ధృవీకరించిన కాపీలో తీర్పును రిజర్వ్ చేసిన తేదీ, తీర్పును ప్రకటించిన తేదీ, తీర్పును అప్‌లోడ్ చేసిన తేదీని పేర్కొనాలి. సవివరమైన తీర్పును వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినప్పుడు, పార్టీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న న్యాయవాదులకు ఇమెయిల్/ ఎస్ఎంఎస్ ద్వారా పంపాలి. బెయిల్ పిటిషన్లపై ఉత్తర్వులు అదే రోజు ప్రకటించి, అప్‌లోడ్ చేయాలి. బెయిల్ ఉత్తర్వులు రిజర్వ్‌చేస్తే మరుసటి రోజే ప్రకటించాలి. బెయిల్ లేదా శిక్ష సస్పెన్షన్ ఉత్తర్వులు వెంటనే అధికారులకు తెలపాలి. ఖైదీల విడుదల సాధ్యమైనంత వరకు అదేరోజు, లేకపోతే మరుసటిరోజు జరగాలి. బెయిల్ ఉత్తర్వుల అమలుపై ట్రయల్ కోర్టు హైకోర్టుకు నివేదిక ఇవ్వాలి. కస్టడీలో ఉన్న అప్పిలెంట్ల కేసుల్లో 7 రోజుల్లోపే అదనపు వివరణలు కోరవచ్చు. ఇక అత్యవసర కేసు (కూల్చివేతలు, బహిష్కరణలు, విద్యాసంస్థల్లో ప్రవేశాలు, బెయిల్ తదితరాలు)ల్లో కేవలం ప్రధాన నిర్ణయం (ఆపరేటివ్ ఆర్డర్) ముందుగా ఓపెన్ కోర్టులో ప్రకటించినా, దానికిగల పూర్తికారణాలతో తీర్పును సాధారణంగా 7రోజుల్లోపు, అసాధారణ పరిస్థితుల్లో 15రోజుల్లోపు వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేయాలి. ప్రకటించిన తీర్పు 24గంటల్లోపు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. పెండింగ్ రిజర్వ్ తీర్పులపై ప్రతి నెల ఆటోమేటెడ్ ఇమెయిల్ పంపాలి. 2 నెలలు దాటిన పెండింగ్ తీర్పులను జడ్జిల దృష్టికి తీసుకెళ్లాలని లాయర్లకు సూచన చేశారు. 3 నెలల్లో తీర్పురాకపోతే కేసు చీఫ్ జస్టిస్ దృష్టికి వెళ్లాలి. మరో 2 వారాలు ఆలస్యమైతే కేసును వేరే బెంచ్‌కు బదిలీ చేసే అవకాశం ఉంటుంది. 3 నెలలైనా తీర్పురాకపోతే పక్షాలు దరఖాస్తు చేసుకోవచ్చు. 4 నెలలు గడిచినా తీర్పురాకపోతే బెంచ్ మార్పు కోరే హక్కు పక్షాలకు ఉంటుంది. రిజర్వు చేసిన తీర్పులు వెలువరించడంలో జరిగే జాప్యాన్ని తగ్గించి న్యాయ ప్రక్రియలో వేగం పెంచాలన్నది సుప్రీంకోర్టు భావన. హైకోర్టు, దిగువ కోర్టులలో ఈసూచనలు పాటిస్తే, తీర్పుల వెల్లడిలో జాప్యం జరగదు. విచారణ ప్రక్రియ వేగంగా జరిగేలా నూతన ఆలోచనలతో, సుప్రీంకోర్టు రూపొందించవలసిన అవసరంఉంది. ●

# ప్రజావాక్కు



### ప్రత్యక్ష పెట్టుబడులు రావాలి

**భారత** ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, దాని పూర్తి సామర్థ్యాన్ని అందిపుచ్చుకోవడానికి కొన్ని నిర్మాణాత్మక అడ్డంకులను తొలగించాల్సిన అవసరం ఉంది. 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ ప్రస్తావించిన నియంత్రణ పరమైన అవరోధాలు, వాణిజ్య విధానసవాళ్లు, పెట్టుబడులకు ఎదురవుతున్న ఇబ్బందులు ఈ నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. విదేశీ సంస్థలు భారత్‌లో భౌతికంగా వ్యాపారాలను స్థాపించేందుకు ఇంకా అనేక అనుమతులు, నిబంధనలు దాటాల్సి వస్తోంది. విదేశీ పెట్టుబడులు అధికంగా ప్రైవేట్ ఈక్విటీ రూపంలోకి మళ్లడం కంటే ఉత్పాదక రంగాల్లో ప్రత్యక్ష పెట్టుబడులు పెరిగేలా వాతావరణాన్ని సులభతరం చేయాలి. ఇందుకోసం వ్యాపార నిబంధనలను సరళీకరించడం, అనవసరమైన అనుమతులను తగ్గించడం అవసరం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కృత్రిమ మేధ ఎగతాళి కాకూడదు!

**ఈ** మధ్య కాలంలో సామాజిక మాధ్యమాలు సమాజ శ్రేయస్సును నాశనంచేసే వేదికగామారుతుండటం చాలా దురదృష్టకరం. మహాత్మాగాంధీ సిగరెట్‌పట్టుకుని నాట్యం చేస్తున్నట్లుగా ఒక కృత్రిమ మేధ వీడియోను ప్రచారం చేసి జాతిపితను అవమానిస్తున్నారు. గణేష్ చతుర్థి, రాఖీ పండుగ, ఆయుధపూజ, క్రిస్మస్, స్వాతంత్ర్య దినోత్సవం వంటి ప్రతి మత, జాతీయవేడుకను ఎగతాళి చేస్తూ అవమానిస్తున్నట్లుగా రకరకాలుగా వీడియోలు వైరల్ అవుతున్నాయి. ప్రతి వేడుకకు, సంప్రదాయానికి దానికంటూ ఒక చరిత్ర ఉంటుంది. దానిని ఎగతాళి చేసి వికృతమైన ఆనందాన్ని పొందడం ఎంతవరకు సబబు? ఈ ధోరణిని అరికట్టడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### మనశ్శాంతిలో ఆత్మానుభూతి

**మనశ్శాంతి** అనేది బయట ఎక్కడో దొరికేది కాదు. మన ఆలోచనల్లో, మన దృక్పథంలో, మననిర్ణయాల్లో ఉంటుంది. అందుకే కొన్నిమార్చుకోవాలి. కొన్ని మర్చిపోవాలి. కొన్ని వదులుకోవాలి. కొన్ని వదిలేయాలి. అప్పుడు మనసు తేలికఅవుతుంది. జీవితం ప్రశాంతంగా మారుతుంది. గతం పాఠంగా మిగులుతుంది. వర్తమానం ఆనందంగా మారుతుంది. భవిష్యత్తు ఆశాజనకంగా కనిపిస్తుంది. ఇదే నిజమైన మనశ్శాంతి.

- డా.దన్నాన అప్పలనాయుడు,విజయనగరం

### ఇదేనా పారదర్శక పాలన?

ఏపీ అసెంబ్లీ సమావేశాలలో దొంగ బాబాల ప్రభుత్వ భూ ఆక్రమణలపై చర్చజరపాలి. గాలిరకాలు, పోరంబోకు వెధవలు బాబాలుగా, స్వాములవార్లుగా వేషాలు వేసినవాళ్లకు మన వాళ్ళు సాష్టాంగపడుతున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించినా మంత్రులు అధికారులు పట్టించుకోవటం లేదు. క్విడ్ ప్రోకోనాఏమో. అసెంబ్లీలో చర్చించాలి. మంత్రాలు మహిమలు అనేవి ఈ విశ్వంలో లేవు. ఈబాబాలు తమ మహిమల వలన మన జీవితాలు బాగుపరుస్తారని చాలామంది వీరి వద్దకు వెళ్ళి దాసోహం అంటారు. వీరి బలహీనతలను ఆధారం చేసుకొని ఈ దొంగలు రకరకాలుగా మోసం చేస్తుంటారు. ఇలాంటివారిని ది డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీ యాక్ట్ 1954 కింద అరెస్ట్ చెయ్యాలి. కానీ చెయ్యరు. ఎందుకంటే 'క్విడ్ ప్రోకో' నేను నీకు ఇది ఇస్తాను నువ్వు నాకు అది ఇవ్వు. జగన్ తెచ్చిన కొత్త పదం. అసెంబ్లీ సమావేశాలలో దొంగ బాబా భూ ఆక్రమణలపై చర్చలు జరపాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య,ప్రకాశం జిల్లా

### తీరు మారాలి

**హోటల్‌లో** రుచికరమైన ఆహారంతినాలని అందరికీ ఉంటుంది. కానీ ఆ ఆహారం ఎంతపరిశుభ్రంగా తయారవుతోంది, ఉపయోగించే పదార్థాలు తాజాగా ఉన్నాయా అనే విషయాలను కూడా గమనించాలి. కొన్ని చోట్ల అపరిశుభ్ర వాతావరణంలో, నిల్వ చేసిన పదార్థాలతో ఆహారం తయారవుతోంది. ఆహార తనిఖీలు జరుగుతున్నా, మంచినాణ్యమైన ఆహారాన్ని అందించాలని చెబుతున్నా, కొందరి తీరులో మాత్రం మార్పు కనిపించడం లేదు. కల్తీ పూర్తిగా తగ్గాలంటే హోటళ్ల, రెస్టారెంట్ల యాజమాన్యాలు కూడా తమ బాధ్యతను గుర్తించాలి. వంటగదిని శుభ్రంగా ఉంచి, నాణ్యమైన తాజాపదార్థాలతో ఆహారం తయారు చేయాలి. ప్రజలు హోటల్‌కు వెళ్లినప్పుడు పరిసరాలతో పాటు పరిశుభ్రతను గమనించాలి.


- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### పేదరికాన్ని జయిద్దాం

మన నిత్య జీవితంలో బాల్య జీవితం నుండి మొదలుకొని ఒక వయస్సు అనుకోని ఆటుపోట్లు నిరంతరం ఎదురవుతూనే ఉంటాయి. అనుకున్న లక్ష్యంపై ఏకాగ్రతతో కూడిన కఠోర సాధన చేస్తేనే జీవితం మెరుగ్గా ఉంటుంది. ఎలాంటి ఆటుపోట్లు ఎదురైనావెనకడుగు వేయకుండా ముందుకు సాగుతూ కుటుంబానికి అండగా ఉంటూ పది మందికి సాయం చేసే జీవితం గడపాలి.


-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

# యుపిఐ ఉచిత సేవల నుండి సుస్థిర భవిష్యత్తు వైపు



రామ కిష్టయ్య సంగన భట్ల

భారతదేశ ఆర్థిక వ్యవస్థను ఆధునిక సాంకేతిక సౌధంగామలిచి, నగదు రహిత లావాదేవీలలో ప్రపంచానికే మార్గదర్శిగా నిలిచిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) వ్యవస్థ నేడు ఒక కీలక చారిత్రక ఘట్టానికి చేరింది. దేశంలోని కోట్లాది మంది ప్రజల దైనందిన జీవితంలో అంతర్భాగంగా మారిన ఈ డిజిటల్ మౌలిక వసతిని మరింత సమగ్రంగా నియంత్రించేందుకు, అవసరమైతే నామమాత్రపు సేవా రుసుములు లేదా మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే చట్టబద్ధమైన అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికి కల్పిస్తూ లోక్‌సభ ఇటీవల కీలక చట్ట సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది. ఈ ఆమోదం ఆర్థిక వర్గాల్లోనూ, సామాన్య ప్రజానీకంలోనూ విస్తృత చర్చకు తెరలేపింది. అయితే, ఈ చట్ట సవరణ ఆమోదం పొందినంత మాత్రాన తక్షణమే యూపీఐ ద్వారా జరిగే ప్రతి లావాదేవీపై ఛార్జీలు అమల్లోకి వస్తాయనుకోవడం పూర్తిగా అపోహ మాత్రమే. 2016 ఏప్రిల్ మాసంలో భారత జాతీయ చెల్లింపుల సంస్థ (ఎన్‌పీసీఐ) కేవలం 21 భాగస్వామ్య బ్యాంకులతో, అత్యంత సాధారణ డిజిటల్ వేదికగా యూపీఐ వ్యవస్థను ప్రారంభించింది. అప్పట్లో ఇది బ్యాంకుల మధ్య నగదు బదిలీ చేసే ఒక సరళమైన సాధనంగా మాత్రమే పరిగణించబడింది. కానీ, 2016నవంబర్‌లో జరిగిన నోట్లరద్దు, అనంతరం వేగవంతమైన స్మార్ట్‌ఫోన్, చౌకైన ఇంటర్నెట్ విప్లవం యూపీ ఐకి అపారమైన ప్రాచుర్యాన్ని తెచ్చిపెట్టాయి. క్రమంగా కూరగాయల విక్రేతలు, తేనీటి కొట్టు యజమానుల నుంచి మొదలుకొని బహుళజాతి కార్పొరేట్ సంస్థలు, సూపర్ మార్కెట్లు, పెట్రోల్ బంకులు, విద్యుత్, గ్యాస్ బిల్లులు, ఆసుపత్రి ఖర్చులు, ప్రభుత్వ పన్నుల చెల్లింపుల వరకు సమస్త ఆర్థిక వ్యవహారాలకు యూపీఐ ప్రాథమిక చోదక శక్తిగా మారింది. నేడు నెలకు సుమారు 1,300 కోట్లకు పైగా లావాదేవీలు రూ. 20లక్షల కోట్లకు పైబడిన విలు వతో జరుగుతుండటం, ప్రపంచవ్యాప్తంగా నమోదు అవు తున్న మొత్తం రియల్‌టైమ్ డిజిటల్ చెల్లింపులలో ఏకంగా 46శాతానికి పైగా వాటాతో భారతదేశం అగ్రస్థానంలో నిల వడం యూపీఐ సాధించిన అనన్యసామాన్యమైన విజయా నికి అద్దం పడుతోంది. యూపీఐ ఈ స్థాయిలో ప్రజాదరణ పొందడానికి విశ్వవ్యాప్త వ్యాప్తి చెందడానికి ప్రధాన కారణం వినియోగదారులు, వ్యాపారులపై ఎటువంటి ప్రత్యక్ష సేవా రుసుములు లేకపోవడమే. డిజిటల్




లావాదేవీలను ప్రోత్స హించడం, పారదర్శక ఆర్థిక వ్యవస్థను నిర్మించడం నగదు చలామణిని తగ్గించడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం2020 జనవరి 1వ తేదీ నుండి యూపీఐ రూపే డెబిట్ కార్డు లావాదేవీలపై 'జీరోఎండీఆర్' విధానాన్ని అమల్లోకితెచ్చింది. సాధారణంగా క్రెడిట్ లేదా డెబిట్ కార్డ్ స్వైపింగ్ మెషిన్ల ద్వారా జరిగే చెల్లింపులపై వ్యాపారులు 1 నుండి 2 శాతం వరకు ఎండీఆర్ రుసుమును బ్యాంకులకు చెల్లించాల్సి ఉండేది. కానీ, యూపీఐ విషయంలో ఈ రుసుమును పూర్తిగా రద్దు చేయడంతో చిన్నవ్యాపారులు సైతం ఎలాంటి ఆర్థిక భారం లేకుండా క్యూఆర్ కోడ్‌లను స్వీకరించారు. ఈ ఉచిత సేవల వల్ల వ్యవస్థకు కలిగిన నష్టాన్ని భర్తీ చేసేం దుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిఏటా బడ్జెట్‌లో రూ. 1,500కోట్ల నుండి రూ.3,000కోట్ల వరకు ప్రోత్సాహక నిధులను బ్యాంకులకు, ఫిన్‌టెక్ సంస్థలకు కేటాయిస్తూ వస్తోంది. అయితే, లావాదేవీల సంఖ్య పరిమాణం ఏటికేడు ఊహించని రీతిలో పెరిగిపోవడంతో, ఈవ్యవస్థను నడపడానికి అయ్యే నిర్వహణ వ్యయం కూడా ఊహకందని స్థాయికి చేరింది. సురక్షితమైన సాంకేతిక మౌలికవసతులు, భారీ సామర్థ్యం కలిగిన డేటాసర్వర్లు, సైబర్ భద్రతాప్రమాణాలు, మోసాల నివారణ వ్యవస్థలు, నిరంతర నెట్‌వర్క్ విస్త రణ కోసం బ్యాంకులు, గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి చెల్లింపు సేవల సంస్థలు, వేలకోట్ల రూపాయలను నిరంతరం వెచ్చించాల్సి వస్తోంది. ఆర్థిక నిపుణుల అంచనా ప్రకారం, ప్రతి సంవత్సరం యూపీఐ వ్యవస్థ సాంకేతిక నిర్వహణకు రూ.12,000 కోట్లకు పైగా వ్యయం అవుతోంది. ప్రభుత్వం అందించే అరకొర ప్రోత్సాహకాలు ఈ వ్యయాలకు ఏమాత్రం సరిపోకపోవడంతో, తీవ్రమైన ఆర్థిక ఒత్తిడికి గురవుతున్న బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు మర్చంట్ లావాదేవీలపై తిరిగి పరిమిత స్థాయిలో ఎండీఆర్‌ను ప్రవేశపెట్టాలని గత కొన్నేళ్లుగా ప్రభుత్వాన్ని, రిజర్వు బ్యాంకును పదే పదే కోరుతూ వస్తున్నాయి. ఈ తీవ్రమైన ఆర్థిక భారాన్ని భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకునే లోక్‌సభ ఈ చట్ట సవరణకు ఆమోద ముద్ర వేసింది. ఈ చట్టం ఆమోదం పొందిన నేపథ్యాన్ని లోతుగా పరిశీలిస్తే, భవిష్యత్తులో ప్రభుత్వం నిబంధనలు తీర్చిదిద్దినప్పటికీ సామాన్య ప్రజలపై లేదా చిన్న లావాదేవీలపై ఎలాంటి భారం పడే అవకాశం లేదని స్పష్టమవుతోంది. చిన్న మొత్తాల లావాదేవీలు (ఉదాహరణకు రూ. 2,000 లోపు ఉన్నవి), వ్యక్తుల మధ్య జరిగే వ్యక్తిగత నగదు బదిలీలు, వీధి వ్యాపారుల చెల్లింపులను ఈ రుసుముల నుండి పూర్తిగా మినహాయించే అవకాశాలే మెండుగా ఉన్నాయి. కేవలం పెద్ద ఎత్తున వ్యాపారాలు నిర్వహించే కార్పొరేట్ సంస్థలు, బహుళజాతి ఈకామర్స్ వేదికలు మరియు పరిమితికి మించి భారీ లావాదేవీలు జరిపే వర్తకులపై మాత్రమే పరిమిత రీతిలో సేవా రుసుములు విధించే ఛాన్స్ ఉంది. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# సిజెపి నిరసనలో పోలీసు చర్యలపై విచారణ కమిటీ



## రిటైర్డ్ జడ్జి నాయకత్వంలో ఏర్పాటు: సుప్రీంకోర్టు

### ఆందోళనల్లో 2,873 మంది పాత నేరస్తులు: ఢిల్లీ పోలీసులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నేతృత్వంలో జులై 20న జరిగిన విద్యార్థుల నిరసన సందర్భంగా పోలీసులు అతిక్రమించారన్న ఆరోపణలను పరిశీలించేందుకు విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి, మాజీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సిబిఐ మాజీ డైరెక్టర్, మాజీ డిజిపి తదితరులతో కూడిన ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. ప్రతిపాదిత ఉన్నత స్థాయి కమిటీలో చేర్చాల్సిన ఇతర సభ్యులపై వివిధ పార్టీల నుంచి సూచనలు కోరుతూ, ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. నిరసన సందర్భంగా తాము అధిక బలప్రయోగం చేయలేదని ఢిల్లీ పోలీసులు ఖండించినప్పటికీ, జాతీయ రాజధానిలో జులై 20న జరిగిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా చోటుచేసుకున్న హింసకు సంబంధించిన వీడియో ఫుటేజ్, సిసిటివి రికార్డింగ్‌లను పరిశీలన కోసం కమిటీకి అప్పగించాలని ఆదేశిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఈ కమిటీ, మార్చ్ సందర్భంగా జరిగిన హింసకు సంబంధించిన వీడియో ఫుటేజ్, సిసిటివి రికార్డింగ్‌లను, పోలీసుల ప్రతిస్పందనను పరిశీలించి, సుప్రీంకోర్టుకు తగిన చర్యలను సిఫార్సు చేస్తుంది. లైంగిక వేధింపులకు గురయ్యామని ఆరోపణలు ఎదుర్కొంటున్న మహిళా నిరసనకారుల ఫిర్యాదులను కూడా ఈ ప్యానెల్ పరిశీలిస్తుంది.

జులై 20న జరిగిన నిరసనలో 240 మంది పోలీసులు గాయపడ్డారని, ఆ నిరసనలోకి 'చరిత్ర నేరగాళ్లు చొరబడ్డారని ఆరోపిస్తూ, హత్య, అత్యాచారం, అపహరణలు వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడిన 2,873 మంది వ్యక్తులు మినహా, మిగిలిన వారిపై ఉన్న కేసులను కొట్టివేయవచ్చని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి తెలిపారు. 'చలో సంసద్' నిరసన సందర్భంగా బలప్రయోగం చేయడాన్ని ఢిల్లీ పోలీసులు గట్టిగా సమర్థించుకున్నారు. ఈ ఆందోళనను 'అసాంఘిక శక్తుల్ను', 'చరిత్ర నేరస్తుల్ను హైజాక్ చేశారని, దీని ఫలితంగా శాంతిభద్రతల విఘాతం ఏర్పడి 240 మందికి పైగా పోలీసు సిబ్బంది గాయపడ్డారని వారు ఆరోపించారు. సంఘటనా స్థలంలో ఉన్న 92 మందిపై 10కి పైగా క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో 47 మంది 'చరిత్ర నేరస్తుల్ను అని వారు తెలిపారు.

నిరసనకారులపై మితి మీరిన బలప్రయోగం జరిగిందంటూ దాఖలైన పిటిషన్లకు ప్రతిస్పందనగా న్యూఢిల్లీ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సచిన్ శర్మ దాఖలు చేసిన అఫిడవిట్‌లో, తమ చర్యలను కోర్టు నియమించిన కమిటీ ద్వారా పరిశీలించు కోవడానికి ఢిల్లీ పోలీసులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. పార్లమెంటు వైపు నిరసనకారులు ముందుకు సాగకుండా నిరోధించడానికి పదేపదే చేసిన హెచ్చరికలు, ప్రయత్నాలను పోలీసులు పట్టించుకోక పోవడంతోనే బలప్రయోగానికి పాల్పడ్డారని ఢిల్లీ పోలీసులు సమర్పించారు. "పోలీసులు బలప్రయోగం చేసిన విషయాన్ని న్యాయస్థానం నియమించిన కమిటీ పరిశీలించవచ్చు. ఢిల్లీ పోలీసులు అటువంటి కమిటీకి పూర్తి సహకారం అందించి, అవసరమైన అన్ని వివరాలను అందిస్తార్ను అని శర్మ అన్నారు.

# కొందరు ఔట్.. కొందరికి ప్లేస్‌మెంట్ కేబినెట్ ప్రక్షాళన!



**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందే కేబినెట్ ప్రక్షాళనకు సిద్ధమైన ప్రధాని మోడీకి ఆ అవకాశం లభించలేదు. దీనికి బిజీ షెడ్యూల్ తో పాటు మరికొన్ని ఇతర కారణాలు కూడా ఉన్నాయి. దీంతో పార్లమెంట్ సమావేశాల తర్వాత కేబినెట్ ప్రక్షాళన వాయిదా పడింది. అయితే ఊహించిన విధంగానే ఇప్పుడు కేబినెట్ మార్పులకు పావులు కదులుతున్నాయి. కానీ పార్లమెంట్ సమావేశాలకు ముందు అనుకున్న మార్పులే కాదు, అనుకోని మార్పులు కూడా ఇందులో ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాక్రోచ్ ఉద్యమం, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, మూడు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు, పీయూష్ గోయల్‌కు బీజేపీ లో కోశాధికారి పదవి, అంతకు ముందే మరో ఇద్దరు కేంద్రమంత్రులు రవ్‌నీత్ బిట్టూ, జార్జికురియన్‌ల రాజీనామాలు ఇలా ఈ మధ్య కాలంలో చాలా మార్పులు జరిగాయి. ఇప్పుడు బీజేపీ జాతీయ కార్యవర్గం ఏర్పాటు సందర్భంగా పలువురు కేంద్రమంత్రులకు రాష్ట్రాల ఇన్ చార్జ్ బాధ్యతలు కూడా దక్కాయి. దీంతో ఇప్పుడు కేబినెట్ ప్రక్షాళన మరింత ఉత్కంఠ భరితంగా మారింది. ఇందులో మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న దేవేంద్ర ఫడ్నవీస్‌కు కూడా అవకాశం దక్కబోతోందన్న ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆయన నిన్న ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. దీంతో ఉద్ధవ్ శివసేన ఎంపీ సంజయ్ రౌత్ ఈ ప్రచారాన్ని మరోమారు ముమ్మరం చేశారు. దీంతో ఫడ్నవీస్ స్పందించక తప్పలేదు. తాను ఢిల్లీకి వచ్చినప్పుడల్లా ఇలాంటి ఊహాగానాలు మొదలవుతాయని, కానీ వాటిలో ఏమాత్రం వాస్తవం లేదని ఆయన తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యత మేరకు మహారాష్ట్రలోనే ఉన్నానని, ఇకపైనా ఇక్కడే ఉంటానని ఫడ్నవీస్ తేల్చేశారు. మరోవైపు కేంద్రమంత్రి వర్గంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు స్థాన చలనం తప్పదని తెలుస్తోంది. ఆమె స్థానంలో ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌ను నియమించేందుకు ప్రధాని మోడీ సిద్ధమవుతున్నారు. దీంతో పాటు యూపీ, పంజాబ్ వంటి ఎన్నికలు జరిగే రాష్ట్రాల నుంచి ఎక్కువ మంది ఎంపీల్ని కేబినెట్లోకి తీసుకునే ఛాన్స్ ఉంది. వీరిలోనూ సామాజిక సమీకరణాల వారీగా అవకాశాలు దక్కుతాయని భావిస్తున్నారు. ఇక ఈసారి కేబినెట్ విస్తరణలో తెలుగు రాష్ట్రాలకు అవకాశం ఉండబోదని తెలుస్తోంది.

## పిఎంకేర్స్ ఫండ్ నిధులు రూ.8452.07 కోట్లు

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** పీఎం కేర్స్ ఫండ్ నిధులు సరికొత్త గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఈ నిధి మొత్తం విలువ రూ. 8,452.07 కోట్లకు వృద్ధి చెందింది. పెట్టుబడి వ్యూహాల్లో తీసుకొచ్చిన మార్పుల కారణంగానే ఈ స్థాయిలో వృద్ధి నమోదైందని తాజా ఆడిట్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో రూ. 7,173.03 కోట్లుగా ఉన్న నిధులు, ఏడాది ముగిసే సమయానికి గణనీయంగా పెరిగాయి. గతంలో నిధులన్నీ అధికంగా సేవింగ్స్ ఖాతాల్లోనే ఉండగా, ఇప్పుడు మెరుగైన రాబడి కోసం వాటిని ఫిక్స్‌డ్ డిపాజిట్లకు మళ్లించారు. ప్రస్తుతం మొత్తం నిధుల్లో రూ. 6,641 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉండగా, కేవలం రూ. 605.41 కోట్లు మాత్రమే సేవింగ్స్ ఖాతాల్లో ఉన్నాయి. అంటే పీఎం కేర్స్ మొత్తం నిధుల్లో దాదాపు 92.8 శాతం ఎఫ్‌డీలలోనే ఉన్నాయి. గడిచిన ఏడాదిలో ఫిక్స్‌డ్ డిపాజిట్ల ద్వారా రూ. 469.38 కోట్ల వడ్డీ లభించగా, సేవింగ్స్ ఖాతాల ద్వారా కేవలం రూ.5.77 కోట్లు మాత్రమే సమకూరింది. వీటితో పాటు స్వదేశీ విరాళాల రూపంలో రూ.479.04 కోట్లు, విదేశీ విరాళాల రూపంలో రూ.92.83లక్షలు అందాయి. వివిధ ఏజెన్సీల నుంచి మరో రూ.324.66కోట్ల రిఫండ్‌లు కూడా ఈ ఖాతాలోచేరాయి. కొవిడ్19 మహమ్మారి విజృంభించిన తరుణంలో, 2020 మార్చి 27న పీఎం కేర్స్ ఫండ్‌ను ఒక పబ్లిక్ ఛారిటబుల్ ట్రస్ట్‌గా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విపత్కర పరిస్థితుల్లో తక్షణ ఆర్థిక భరోసా కల్పించడమే ఈ నిధి ప్రధాన ఉద్దేశం.

# విద్యార్థులపై ఎకె47తో కాల్పులు నిజమే!



## సుప్రీంకోర్టులో బీహార్ ప్రభుత్వం అఫిడవిట్

### శివాన్ జిల్లా ఎస్పీని బదలీ చేసిన సర్కార్

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** నీట్ యుజి పేపర్ లీక్‌పై దేశవ్యాప్తంగా నిరసనల్లో భాగంగా బీహార్‌లో విద్యార్థులపై పోలీసులు కాల్పులు జరపడం నిజమేనని మంగళవారం సుప్రీంకోర్టుకు బిహార్ ప్రభుత్వం తెలిపింది. జులై 25న సివాన్‌లో జరిగిన ఈ కాల్పుల్లో ఎవరూ తీవ్రంగా గాయపడలేదని స్పష్టం చేసింది. ఆందోళనకారుల మధ్య కానిస్టేబుల్ చిక్కుకుపోవడంతో ఎకె47తో కాల్పులు జరపాల్సి వచ్చిందని కోర్టు దృష్టికి తెచ్చింది. ఈ మేరకు అఫిడవిట్ ద్వారా సుప్రీంకోర్టుకు కీలక విషయాలను వెల్లడించింది. ఈ సందర్భంగా జులై 25న నిరసనల్లో సివాన్‌లోని జెపి చౌక్ వద్ద నిరసనకారుల మధ్య కానిస్టేబుల్ అభిషేక్ కుమార్ చిక్కుకున్నాడని బిహార్ ప్రభుత్వం పేర్కొంది. వారి నుంచి తప్పించు కునేందుకు కానిస్టేబుల్ ఎకె47తో గాలిలోకి నాలుగు రౌండ్లు కాల్పులు జరిపాడని తెలిపింది. మరోవైపు, నిరసనకారులను చెదరగొట్టేందుకు హతి చౌక్ సమీపంలో అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ నిలేశ్ కుమార్ సింగ్ కూడా 9ఎంఎం పిస్టల్‌తో రెండురౌండ్లు కాల్పులు జరిపారని చెప్పుకొచ్చింది. పోలీసుల చర్యలో ముగ్గురు ఆందోళనకారులకు చిన్నపాటి తుపాకీ గాయాలయ్యాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, వారు ఎకె47 బుల్లెట్లతో గాయపడలేదని తేల్చిచెప్పింది. అలాగే, కానిస్టేబుల్ కాల్పులు జరిపిన ప్రదేశంలో ఎవరూ గాయపడలేదని పేర్కొంది. మరోవైపు, కానిస్టేబుల్ అభిషేక్ కుమార్‌ను సస్పెండ్ చేశామని, అతను శాఖా పరమైన విచారణను ఎదుర్కొంటున్నాడని అఫిడవిట్‌లో బిహార్ ప్రభుత్వం తెలిపింది. ఆరోజు భద్రతా దళాలు సంయమనం పాటించాయని, నిరసనకారులకు ఎలాంటి హాని కలిగించేందుకు ప్రయత్నించలేదని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా విద్యార్థులపై విపరీతమైన బలప్రయోగం చేయలేదనీ వివరించింది. ప్రభుత్వ ఆస్తుల నష్టం, అధికారులపై దాడులకు నిరసనల్లో చేరిన అసాంఘిక శక్తులే కారణమని ప్రభుత్వం ఆరోపించింది. అలాగే నిరసనలకు సంబంధించిన జిల్లాల వారీ వివరాలనూ సుప్రీంకోర్టుకు సమర్పించింది.

**జిల్లా ఎస్పీ బదలీ:**
విద్యార్థులపై ఎకె47తో గాల్లో కాల్పుల జరిపిన ఉదంతం కలకలం రేపుతున్న నేపథ్యంలో బీహార్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శివాన్ జిల్లాలో ఈ ఘటన జరిగిన నేపథ్యంలో ఎస్పీ పురన్ కుమార్‌ను జిల్లా బాధ్యతల నుంచి తప్పించింది. ఎకె47తో కాల్పులు జరిపిన కానిస్టేబుల్‌పై ఇప్పటికే సస్పెన్షన్ వేటు పడింది. పురన్ కుమార్ ఝా స్థానంలో భరత్ సోనీ శివాన్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. భోజ్‌పూర్‌లో మరో కార్యకర్త ఎన్‌కౌంటర్‌తో కలకలం రేగడంతో జిల్లా ఎస్పీపై కూడా వేటు పడింది. భోజ్‌పూర్ బాధ్యతలను మరో అధికారి అవధేశ్ దీక్షిత్‌కు ప్రభుత్వం అప్పగించింది.

# ఇమ్రాన్‌ను తక్షణమే ఆస్పత్రికి తరలించండి

## పాకిస్థాన్ సుప్రీంకోర్టు ఆదేశం



**ఇస్లామాబాద్, ఆగస్టు 18:** పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు భారీ ఊరట లభించింది. ఆయన ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తుండడంతో వెంటనే ఆస్పత్రికి తరలించాలని అక్కడి అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వ అధికారులను ఆదేశించింది. ఇమ్రాన్ వైద్య నివేదికలను ఉటంకిస్తూ కుటుంబసభ్యులు, పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ పార్టీ (పిటిఐ) నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాన్ని ఐటిఐ అధికార ప్రతినిధి జుల్ఫికర్ బుఖారీ స్వాగతించారు. ఈ చర్యలు ముందే తీసుకుని ఉంటే ఆయన ఆరోగ్యం ఇంతగా క్షీణించి ఉండేది కాదని పేర్కొన్నారు. ఇమ్రాన్ పూర్తిగా కోలుకునే వరకు ఆయనను ప్రైవేట్ వైద్యుల సంరక్షణలోనే ఉంచాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఇమ్రాన్ ఆరోగ్య పరిస్థితిపై ఆ దేశ మాజీ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇమ్రాన్ వైద్య నివేదికలను తాను నిపుణులతో కలిసి పరిశీలించానని, ఆయన ఆరోగ్యం రోజు రోజుకు క్షీణిస్తోందని వారు చెప్పారని పేర్కొన్నారు. మూడేళ్ల జైలు జీవితం, ఒంటరితనం వల్ల ఆయన తీవ్రమైన ఒత్తిడి, మానసిక, శారీరక సంబంధమైన సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. గత ఏడు నెలలుగా తన కుటుంబం, పార్టీనేతలు ఎలా ఉన్నారనే విషయాలతో పాటు.. బయట కూడా అసలేం జరుగుతుందో ఆయనకు తెలియదు. అందుకే ఇమ్రాన్ రోజురోజుకు మరింత కుంగిపోతున్నారు' అని పేర్కొన్నారు.

# 'హర్మూజ్' కొత్త అమెరికా ప్రాంతం!

## ట్రూత్‌లో ట్రంప్ సంచలన వ్యాఖ్యలు



**వాషింగ్టన్, ఆగస్టు 18:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హర్మూజ్ జలసంధిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో హోర్ముజ్ జలసంధిని న్యూ యూఎస్ టెరిటరీగా పేర్కొంటూ ఓ మ్యాప్‌ను పోస్ట్ చేశారు. వాషింగ్టన్–టెహ్రాన్ మధ్య శాంతి ఒప్పందం కుదుర్చుకునేందుకు నిర్ణయించిన 60 రోజుల చర్చల గడువు ముగిసిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. ట్రంప్ షేర్ చేసిన మ్యాప్‌లో పర్షియన్ గల్ఫ్ ప్రవేశద్వారం వద్ద ఇరాన్, ఒమన్ మధ్య ఉన్న హోర్ముజ్ జలసంధి చుట్టూ ఓ వృత్తాన్ని గీసి, దానిపై కొత్త యుఎస్‌ప్రాంతం అని పేర్కొన్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి కాజెమ్ ఘరీబాబాదీ మాట్లాడుతూ హర్మూజ్ జలసంధిపై ట్రంప్‌కు ఉన్న భ్రమ త్వరలో తొలగిపోతుందని హెచ్చరించారు. త్వరలో హర్మూజ్ జలసంధిపై ట్రంప్ భ్రమ తొలగిపోతుంది లేదంటే ఆ భ్రమలో ఉన్న వ్యక్తి భ్రమలను మేమే సరిదిద్దుతామని ఘాటుగా వ్యాఖ్యానించారు. హర్మూజ్ జలసంధిని అమెరికా భూభాగంగా ప్రకటిస్తానని ట్రంప్ గతంలోనూ ప్రకటించారు. పోలీస్ అకాడమీ సెంటర్ ఫర్ ట్రైనింగ్ అండ్ ఇంటెలిజెన్స్‌లో మాట్లాడుతూ త్వరలోనే హర్మూజ్ జలసంధిని అమెరికా భూభాగంగా ప్రకటిస్తానని అన్నారు. అంతకు ముందు కూడా హర్మూజ్‌పై అమెరికాకు పూర్తి నియంత్రణ ఉందని ట్రంప్ పేర్కొన్నారు. వారికి నియంత్రణ లేదు. పూర్తి నియంత్రణ మనదే. అది మనదే అని విలేకరులతో అన్నారు. అమెరికా నౌకాదళం జలసంధిలోని మైన్లను తొలగించేందుకు చర్యలు చేపట్టిందని కూడా వెల్లడించారు. ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. హర్మూజ్ జలసంధి ఇరాన్‌కు చెందినదే, ప్రస్తుతం కూడా ఇరాన్‌దే, భవిష్యత్తులోనూ ఇరాన్‌దేనని ఘరీబాబాదీ స్పష్టం చేశారు. జలసంధిని ఎప్పుడు మూసివేయాలి, ఎప్పుడు తెరవాలన్నది ఇరాన్ ఆదేశాల ప్రకారమే జరుగుతుందన్నారు. ప్రపంచ చమురు సరఫరాకు కీలక మార్గంహోర్ముజ్ జలసంధి ప్రపంచంలోని అత్యంత కీలకమైన సముద్ర రవాణా మార్గాల్లో ఒకటి. ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం ప్రారంభమయ్యే ముందు ప్రపంచ చమురు, గ్యాస్ సరఫరాలో దాదాపు 20 శాతం ఈ జలసంధి గుండా రవాణా అయ్యేది. యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇక్కడ నౌకల రాకపోకలు గణనీయంగా తగ్గిపోయాయి. ఇరాన్ ఈ జల మార్గంలో రవాణాను పరిమితం చేస్తూ యుద్ధంలో ఒత్తిడి పెంచేందుకు దీనిని వ్యూహాత్మక సాధనంగా ఉపయోగిస్తోంది. ట్రాన్సిట్ మార్గంపై ఇరాన్–ఒమన్ ఒప్పందంఇదిలా ఉండగా హర్మూజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలకు సంబంధించిన ట్రాన్సిట్ మార్గం మ్యాప్‌పై ఇరాన్, ఒమన్ మధ్య అవగాహన కుదిరింది. దీనిపై సంయుక్త ప్రకటనతో కూడిన తుది ఒప్పందాన్ని రూపొందించే ప్రక్రియ కొనసాగుతోంది.

## వందేమాతరం వివాదం: బిజెపిపై ఖర్గే ధ్వజం

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వందేమాతరం వివాదంపై తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఫిర్యాదు చేయడాన్ని ప్రశ్నించారు. తాము పాడిన వందేమాతరం కొత్తది కాదని చెప్పారు. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ పాడినదే తామూ పాడామని స్పష్టం చేశారు. అది నేరమైతే వారిపైనా కేసులు పెట్టాలని వ్యాఖ్యానించారు. ఆగస్టు 15న కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం ఆలాపనపై వివాదం మొదలైంది. ఖర్గే జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన తర్వాత వందేమాతరం ఆలపించారు. అయితే పార్టీ నిర్ణయం ప్రకారం తొలి రెండు చరణాలతో ముగించాల్సిన గేయాన్ని పూర్తిగా ఆలపించారు. గాయకులు కొనసాగించడాన్ని సోనియా గాంధీ గమనించి వారిని ఆపేందుకు ప్రయత్నించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఘటనపై సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు అందింది. వందేమాతరం ఆలాపనను అడ్డుకునేందుకు ప్రయత్నించారంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఫిర్యాదుదారు కోరారు. దీనిపై ఖర్గే స్పందిస్తూ గత 18 ఏళ్లుగా కాంగ్రెస్ పాడుతున్న వందేమాతరం గీతాన్నే తాజాగా కూడా ఆలపించామని చెప్పారు. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే గేయాన్ని ఆలపించిందని గుర్తుచేశారు. వందేమాతరం విషయంలో కాంగ్రెస్ ఎప్పుడో తీర్మానం చేసిందని ఖర్గే తెలిపారు. భవిష్యత్తులో మరో ప్రభుత్వం వస్తే, వారు ఏ నిర్ణయం తీసుకుంటే అది అందరూ పాటించాలా అని ప్రశ్నించారు.

## జార్ఖండ్‌లో కొత్తగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల ఆందోళన

**రాంచి, ఆగస్టు 18:** జార్ఖండ్‌లోని రాంచీలో కొత్తగా ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు మంగళవారం రాష్ట్ర సచివాలయంఎదుట ఆందోళనకు దిగారు. ఓవక్క జెపిఎస్‌సిని రద్దు చేయాలంటూ ఉద్యోగార్థుల నిరసనతో పరీక్షలను మొత్తం రద్దుచేసిన జార్ఖండ్‌ప్రభుత్వం నిర్ణయంతో ఇపుడు జెపిఎస్‌సిలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు ఆందోళనకు దిగారు. దీనితో జార్ఖండ్ ఉద్యమంలో రివర్స్‌గేర్‌ప్రారంభం అయినట్లు తెలుస్తోంది. జార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించిన కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్షతో పాటు 2014 నుంచి నిర్వహించిన అన్ని ఔట్‌సోర్సింగ్ పరీక్షలను రద్దు చేస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఈ నిరసనలు ప్రారంభమయ్యాయి.

## మూడు రాష్ట్రాలకు పార్టీ కొత్త ఇన్‌ఛార్జిలు: బిజెపి ఎన్నికల గేమ్ ప్లాన్ షురూ..

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** రాబోయే అసెంబ్లీ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది భారతీయ జనతా పార్టీ. గెలుపే లక్ష్యంగా పార్టీ సంస్థాగత నిర్మాణంలో భారీ మార్పులు చేసింది. ఇప్పటికే జాతీయ కార్యవర్గాన్ని పూర్తిగా ప్రక్షాళణ చేసింది. పలు కొత్త ముఖాలకు ఇందులో చోటు కల్పించింది. సీనియర్లకు కీలక బాధ్యతలను అప్పగించింది. రాష్ట్రాల వారీగా సమీకరణాలను బేరీజు వేసుకుని పాత, కొత్త నేతల కలయికతో ఈ నూతన కార్యవర్గాన్ని పునర్నిర్మించుకుంది. దీనికి కొనసాగింపుగా మరిన్ని నిర్ణయాలను తీసుకుంటోంది బీజేపీ హైకమాండ్. ఇందులో భాగంగా మూడు రాష్ట్రాలకు నూతన ఇన్‌ఛార్జిలను నియమించింది. ఉత్తరప్రదేశ్, పంజాబ్, గుజరాత్‌కు ఎన్నికల ఇన్‌ఛార్జ్‌లను నియమిస్తూ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ప్రకటన విడుదల చేశారు. ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ప్రధాన ఇన్‌ఛార్జ్ పదవి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు వినోద్ తావ్డేకు లభించింది. తోడుగా జగదీష్ ఈశ్వర్‌భాయ్ పటేల్ కో ఇన్‌ఛార్జ్‌లుగా నియమితులు అయ్యారు. యూపీలో క్షేత్రస్థాయి సమీకరణాలను సమన్వయం చేయడంలో వినోద్ తావ్డే అనుభవం పార్టీకి ఉపయోగపడుతుందని భావిస్తోన్నారు. వ్యవస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్న పంజాబ్ లో రాష్ట్ర ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా రాజ్యసభ సభ్యుడు సతీష్ పూనియా అపాయింట్ అయ్యారు. అదే సమయంలో.. బీజేపీకి తిరుగులేని కోటగా ఉంటూ వస్తోన్న గుజరాత్ ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా రాజ్యసభ సభ్యుడు తరుణ్ చుగ్‌ను రంగంలోకి దించారు. గుజరాత్‌లో సుదీర్ఘకాలంగా ఉన్న పట్టును మరింత పటిష్టం చేయడానికి ఆయన నాయకత్వాన్ని ఎంచుకుంది పార్టీ హైకమాండ్. ఇక నుంచైనా పార్టీ జాతీయ నూతన కమిటీలో కూడా పలు మార్పులు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీకి జాతీయ ప్రధాన కార్యదర్శిగా కీలక బాధ్యతలు ఇవ్వగా, ఆర్ఎస్ఎస్ మాజీ నేత రామ్ మాధవ్‌ను జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే సింధియా మరోసారి జాతీయ ఉపాధ్యక్షురాలిగా తన స్థానాన్ని నిలుపుకొన్నారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ జాతీయ కోశాధికారిగా నియమితులయ్యారు.



## సిఎం విజయ్ వందరోజులపాలనపై అసెంబ్లీకి నివేదిక

**చెన్నై, ఆగస్టు 18:** తమిళనాడు రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తూ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన విజయ్ విజయవంతంగా 100 రోజుల పాలనను పూర్తి చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పరిపాలనా శైలి, పనితీరుపై మంత్రి ఆధవ్ అర్జున పలు విషయాలను వెల్లడించారు. అసెంబ్లీలో పబ్లిక్ వర్క్స్ బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. విజయ్ పనితీరు, క్రమశిక్షణ తమను ఆశ్చర్యపరుస్తోందని కొనియాడారు. సాధారణంగా నటుల నుంచి రాజకీయ నాయకులుగా మారినవారు నెమ్మదిగా పరిపాలనను అలవాటు చేసుకుంటారని, విజయ్ మాత్రం దీనికి భిన్నమని చెప్పారు. బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజు నుంచే పూర్తి స్థాయి పాలకుడిగా మారిపోయారని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా ఊహించని పరిణామం విజయ్ ప్రస్తుతం రోజుకు సుమారు 18 నుంచి 20 గంటల పాటు అవిశ్రాంతిగా పని చేస్తోన్నారని, ప్రజా సేవలో తీరిక లేకుండా గడుపుతున్నారని ఆధవ్ అర్జున వెల్లడించారు. విజయ్ దినచర్య ప్రతిరోజూ తెల్లవారుజామున 4 గంటలకే ప్రారంభమవుతుందని చెప్పారు. ఆ సమయంలోనే వివిధ శాఖల మంత్రులకు స్వయంగా ఫోన్లు చేస్తూ, ఆయా విభాగాల్లో జరుగుతున్న అభివృద్ధి పథకాల పురోగతిని, తాజా పరిస్థితులను క్షుణ్ణంగా అడిగి తెలుసుకుంటున్నారని తెలిపారు.



# సంక్షిప్త వార్తలు

## హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకపై దాడి: ఒకరు మృతి



**టెహ్రాన్, ఆగస్టు 18:** హర్మూజ్ జలసంధిలో ఓ వాణిజ్య నౌకపై మంగళవారం దాడి జరిగింది. గుర్తు తెలియని క్షిపణి లేదా డ్రోన్ నౌకను ఢీకొట్టడంతో ఇంజిన్ రూమ్ పూర్తిగా ధ్వంసమైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఒక మృతి చెందినట్లు బ్రిటన్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సంస్థ వెల్లడించింది. నౌకలోని మిగతా సిబ్బందిని కాపాడేందుకు ఒమర్ కోస్ట్‌గార్డ్ సిబ్బంది రంగంలోకి దిగినట్లు తెలిపింది. దాడి ఎవరు చేశారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదని పేర్కొంది. ఇరాన్–అమెరికా మధ్య ఉద్రిక్తతలు మరింత పెరుగు తున్న వేళ ఈ దాడి చోటుచేసుకోవడం గమనార్హం.

## ప్రధాని కార్యాలయంపై డ్రోన్ల దాడి



**బాగ్దాద్, ఆగస్టు 18:** ఇరాక్‌లోని కుర్దిస్థాన్ ప్రాంతీయ ప్రభుత్వ ప్రధాని మస్రూర్ బర్జానీ కార్యాలయంపై సోమవారంరాత్రి డ్రోన్ల దాడి జరిగింది. ఈ దాడులకు ఇరానే కారణమని కుర్దిస్థాన్ భద్రతా సంస్థ ఆరోపించింది. ప్రధాని కార్యాలయంతోపాటు కుర్దిస్థాన్ భద్రత, నిఘా సంస్థ 'పరా స్తిన్' అధిపతి నివాసాన్ని కూడా డ్రోన్లు లక్ష్యంగా చేసుకున్నాయని తెలిపింది. ఈ దాడుల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొంది. కీలక ప్రభుత్వ, భద్రతా వ్యవస్థలను లక్ష్యంగా చేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగించే పరిణామమని తెలిపింది. కుర్దిస్థాన్ ప్రధాని మస్రూర్ బర్జానీ ఈ దాడిని తీవ్రంగా ఖండించారు.

## కేంద్రమంత్రి జెపినడ్డాకు యాంజియోప్లాస్టీ




**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో చేరిన ఆయనకు వైద్యులు యాంజియోప్లాస్టీ నిర్వహించారు. ముందురోజు ఈ చికిత్స జరగ్గా, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని ఎయిమ్స్ వర్గాలు నేడు ఒక అధికారిక ప్రకటనలో తెలిపాయి. ఆయనను కార్డియాలజీ విభాగంలో వైద్యుల పర్యవేక్షణలో ఉంచినట్లు పేర్కొన్నాయి. ఈనెల 13వ తేదీ సాయంత్రం జేపీ నడ్డాకు కాస్త నలతగా అనిపించడంతో కుటుంబ సభ్యులు ఆయనను ఎయిమ్స్‌కు తరలించారు.

## బీహార్‌లో భారీగా ఐపిఎస్‌ల బదలీలు..


**పాట్నా, ఆగస్టు 18:** బీహార్‌ప్రభుత్వం మంగళవారం భారీస్థాయిలో పోలీసు అధికారుల బదిలీలు చేపట్టింది. మొత్తం 17మంది సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. పోలీసుల చర్యలపై తీవ్ర వివాదాలు చెలరేగిన భోజ్‌పూర్, సివాన్ జిల్లాల ఎస్పీలను కూడా బదిలీ చేయడం గమనార్హం. రాష్ట్ర హోంశాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం సివాన్ ఎస్పీ పూరణ్‌కుమార్ ఝాను బదిలీ చేశారు. గతనెల 25న సివాన్‌లో విద్యార్థుల ఆందోళన సందర్భంగా పోలీసు బలగాల ఆధ్వర్యంలో ఏకే47 రైఫిల్‌ను వినియోగించిన ఘటన తీవ్ర దుమారం రేపింది.

## డంపర్‌ను ఢీకొన్న వాహనం: 8 మంది కూలీలు మృతి, 32 మందికి గాయాలు



**గ్వాలియర్, ఆగస్టు 18:** మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డుపై ఉన్న ఆవులను తప్పించే క్రమంలో వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న డంపర్ ట్రక్కును ఢీకొట్ట డంతో ఎనిమిదిమంది కూలీలు మృతి చెందారు. మరో 32 మంది గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన భిండ్‌గ్వాలియర్ జాతీయ రహదారిపై చిమ్కా గ్రామం సమీపంలో రాత్రి సుమారు 1 గంటకు ఈ ప్రమాదం జరిగింది.

## చంపత్‌రాయ్, మిశ్రాలకు క్లీన్‌చిట్



**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** అయోధ్యరామాలయంలో విరాళాలను చోరీ చేసిన కేసులో సిట్ తన నివేదికను రిలీజ్ చేసింది. రామ జన్మభూమి ట్రస్టు మాజీ చీఫ్ చంపత్ రాయ్‌తో పాటు మాజీ సభ్యుడు అనిల్ మిశ్రాకు ఆ కేసులో సిట్ క్లీన్ చిట్ ఇచ్చింది. ఈ కేసులో 8 మందిని యూపీ సర్కారు అరెస్టు చేసింది. వాస్తవానికి విరాళాలు చోరీ అయినట్లు తెలిసిన కొన్ని రోజులకే చంపత్ రాయ్ తన రాజీనామాను సమర్పించారు. రామాలయ ట్రస్టు మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌కు స్పెషల్ ఇన్‌వెస్టిగేటింగ్ టీమ్ క్లీన్ చిట్ ఇచ్చింది. ట్రస్టులో సభ్యుడిగా ఉన్న అనిల్ మిశ్రాకు కూడా సిట్ క్లియరెన్స్ ఇచ్చింది.

## అసెంబ్లీ సమావేశాలు

# రాజకీయ లబ్ధి కోసమే వైసిపి సభ్యుల ఆరాటం

● శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్

**సచివాలయం,ఆగష్టు 18,ప్రభాతవార్త :** ప్రజా సమస్యలపై కాకుండా రాజకీయ లబ్దికోసమే వైసీపీ సభ్యులు ఆరాటపడుతున్నారంటూ రాష్ట్ర శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు.మెగా డిఎస్సీ పై వైకాపా సభ్యులు పదేపదే పోడియం వద్ద నిరసన తెలియజేయడం సరికాదని సూచించారు.కనీసం చైర్మన్‌కి కూడా విలువ ఇవ్వకుండా సభను అడ్డుకోవడం సాంప్రదాయం కాదని సభ్యులను ఆదుపులో ఉంచాల్సి న బాధ్యత ఎల్ఓపి ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 50వ శాసనమండలి రెండోరోజు మంగళవారం ఉదయం 10గంటలకు రాష్ట్ర శాసనమండలిచైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అధ్యక్షతన ప్రారంభమైంది.మొదటగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఆమోదం పొందిన 2026,ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనముల (మూడవ సవరణ) బిల్లును ఆమోదించారు.తర్వాత శాసనమండలి డిప్యూటీ చైర్మన్ పదవి ఎన్నికకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేసేందుకు గాను నామినేషన్ దాఖలు చేయాలని నామినేషన్ పత్రాలను 18.08.2026 ఉదయం 10.30నుంచి సాయంత్రం 5గంటల లోపు శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్‌కు సమర్పించాలని మండలి చైర్మన్ తెలిపారు. డిఎస్సీ 2025లో స్పోర్ట్స్ కోటా నియామకంలో జరిగిన అవకతవకలపై చర్చించాలని వైసీపి ఎమ్మెల్సీలు వరదు కళ్యాణి,మొండితోక అరుణ్‌కుమార్,కుంభా రవిబాబు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరించి ప్రశ్నోత్తరాలు చేపట్టిన మండలి చైర్మన్. భాగంగా ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు గురించి, వాణిజ్య పన్ను బకాయిలు,కరువు ప్రభావిత ప్రాంతాల గురించి పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధిత మంత్రులు సమాధానమిచ్చారు

## బలహీన వర్గాలు గుర్తుంచుకోవాల్సిన చరిత్రాత్మక రోజు



అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారధి

**సచివాలయం,ఆగష్టు 18,ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసీలకు 34శాతం రిజర్వేషన్లు కల్పించాలని కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుందని రాష్ట్రగృహ నిర్మాణ శాఖ మంత్రి కె.పార్థసారధి తెలిపారు.అసెంబ్లీ మీడియాపాయింట్ వద్ద మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అర్బన్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 33.33శాతం రిజర్వేషన్లు కల్పించనున్న కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.బిసీలకు రిజర్వేషన్లు కల్పించడం బలహీన వర్గాలకు ఎంతో మేలుచేసేనిర్ణయం.1995లోనే బిసిలకు 34శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత చంద్రబాబు నాయుడిదే.చంద్రబాబు టిడిపి కి బీసీలతో ఉన్న అనుబంధానికి తాజా నిర్ణయం నిదర్శనం.1995నుంచి 2019వరకు బీసీలు 34శాతం రిజర్వేషన్లు పొందారు.వైసీపీ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత బీసీల 34శాతం రిజర్వేషన్లు కోల్పోయే పరిస్థితి వచ్చింది. బీసీలపై నిజమైన ప్రేమ ఉంటే జగన్మోహనరెడ్డి ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్ళి రిజర్వేషన్ల కోసం పోరాడాల్సి ంది. బీసీలకు అన్యాయం జరిగినా గత ప్రభుత్వం సుప్రీంకోర్టులో పోరాటం చేయలేదు. బిసీలను రాజకీయంగా విభజించే ప్రయత్నాలను ఆ వర్గాలు గుర్తించాలి.బిసీలకు 34శాతం రిజర్వేషన్లు నిర్ణయం వారి రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

## మంటలను అదుపు చేసిన పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు




నరసరావుపేటలో భారీ అగ్నిప్రమాదం 4కార్లు దగ్ధం

**నరసరావుపేట క్రైమ్, ఆగస్టు 18 ప్రభాతవార్త :** స్థానిక వినుకొండ రోడ్డులోని ఎన్.ఎస్.బి కార్ డెకార్స్‌లో మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగాయి. క్షణాల్లో మంటలు తీవ్రంగా వ్యాపించడంతో కార్ డెకార్స్‌లోని నాలుగు కార్లు అగ్నికి ఆహుతయ్యాయి. కార్ డెకార్స్‌లో చెలరేగిన మంటలు పక్కనే ఉన్న బిర్యాని కేంద్రానికి సైతం వ్యాపించాయి. దీంతో పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగలు కమ్ముకోవడంతో పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంలో రూ. 50 లక్షల విలువైన వాహనాలు, సామాను కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న నరసరావుపేట వన్ టౌన్ సీఐ ఫిరోజ్, టూ టౌన్ సీఐ ప్రభాకర్, రూరల్ సీఐ సుబ్బారావు, ట్రాఫిక్ సిఐ లోకనాథ్ లతో పాటు ఎస్ఐలు, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. ప్రమాదానికి గల కారణాలను, ఆస్తి నష్టం తదితర వివరాలపై పోలీసు అధికారులు విచారణ చేపట్టారు.

# రాష్ట్రంలో 25 వేలకు మించి జనాభా ఉన్నా పురపాలక సంఘాలుగా చేసే ప్రతిపాదన లేదు

● స్లీపర్ బస్సుల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నాం,కేంద్ర మోటారు వాహనాల నిబంధనలు అమలు చేస్తున్నాం: మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

● రాష్ట్రంలో 4 ప్రతిపాదిత పోర్టులు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయని తెలిపిన మంత్రి జనార్ధనరెడ్డి


ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడుతున్న మంత్రి పి.నారాయణ

**విజయవాడ.ఆగస్టు 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు మంగళవారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. రెండో రోజున కీలక అంశంపై ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. 25 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా ఉన్నతీకరించే ప్రతిపాదన ప్రస్తుతానికి ఏదీ లేదని పురపాలక శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. జాతీయ జనాభాగణన (సెన్సస్) ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈవిషయంలో ముందుకు వెళ్లలేమని ఆయన వెల్లడించారు.ప్రశ్నోత్తరాలసమయంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానమిచ్చారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జనాభా గణన ప్రక్రియ కొనసాగుతోందని,2027 మార్చి 31 వరకు ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉందని ఆయన గుర్తుచేశారు. 25 వేలకు మించి జనాభా ఉన్నా పురపాలక సంఘాలుగా చేసే ప్రతిపాదన లేదని మంత్రి నారాయణ అన్నారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. జనాభా లెక్కల ప్రక్రియ2027 మార్చి 31 వరకు జరుగుతుందని, అప్పటివరకూ మార్పులు చేయవద్దని కేంద్రం సూచించిందన్నారు. ఆ తర్వాత మున్సిపాలిటీలుగా ఉన్నతీకరించడంపై పరిశీలిస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. "రాష్ట్రంలో 1.18 లక్షల హెక్టార్లలో కొబ్బరి సాగు జరుగుతోంది. కోనసీమ జిల్లాలో 10 వేల హెక్టార్లలో కొబ్బరి సాగు కాలం చెల్లిందిగా గుర్తించాం. కొబ్బరి అభివృద్ధి మండలితో సంప్రదింపులు జరిపి పునరుజ్జీవానికి కృషి. పథకాల ద్వారా కొత్త కొబ్బరి తోటల పెంపకానికి ఆర్థిక సాయం అందిస్తామని" మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. కోవూరును మున్సిపాలిటీగా మారుస్తామని మంత్రి లోకేశ్ గతంలో హామీ ఇచ్చారు. ప్రస్తుతం కోవూరులో 72 వేల జనాభా ఉంది. దీనికి పంచాయతీ నిధులు సరిపోవడం లేదు. వేగంగాఅభివృద్ధి చెందుతున్నందున దీన్ని మున్సిపాలిటీగామార్చాలని సభ్యులు కోరారు. దీనిపై మంత్రి నారాయణ సభలో బదులిచ్చారు. 2020 మార్చి 31 నాటి జనాభా లెక్కలుమాత్రమే ప్రస్తుతం అందుబాటులోఉన్నాయన్నారు. కేంద్ర నిబంధనల ప్రకారం 2027 మార్చి31 వరకు ఇందులో మార్పులు చేయకూడదన్నారు. ఆ గడువు ముగిశాక కోవూరు మున్సిపాలిటీ అంశాన్ని పరిశీలిస్తామని మంత్రి స్పష్టం చేశారు.స్లీపర్ బస్సుల్లో అగ్ని ప్రమాదాలపై ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రశ్నకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సమాధానమిచ్చారు. "రాష్ట్రంలో 16 ప్రభుత్వ, 835 ప్రైవేట్ స్లీపర్ బస్సులు నమోదు. స్లీపర్ బస్సుల్లోప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నాం. కేంద్రమోటారు వాహనాల నిబంధనలు అమలు చేస్తున్నాం. స్లీపర్ బస్సుల అగ్ని ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు. డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంలో ఎలాంటి రాజీ లేకుండా చర్యలు తీసుకుంటున్నామని" మంత్రి రాంప్రసాద్‌రెడ్డిఅన్నారు. ఏపీలో నిర్మాణంలో ఉన్న పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల పురోగతిపై ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, గౌతు శిరీష, కాగిత కృష్ణప్రసాద్ అడిగిన ప్రశ్నలకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో 4 ప్రతిపాదిత పోర్టుల్కు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు.రామాయపట్నం(81.45శాతం),మచిలీపట్నం(59 .24శాతం), మూలాపేట(76.17శాతం), కాకినాడ గేట్‌వే(33.04 శాతం) మేరపోర్టులఅభివృద్ధి పనులు పూర్తయ్యాయని చెప్పారు.అలాగే, రాష్ట్రంలో ప్రతిపాదిత 7 ఫిషింగ్ హార్బర్లలో ప్రస్తుతం 4 నిర్మాణంలో ఉన్నాయని అన్నారు. జువ్వలదిన్నె (97.98శాతం), నిజాంపట్నం (81.61శాతం), మచిలీపట్నం(71.96శాతం ), ఉప్పాడ (86.24 శాతం ) మేర ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వెల్లడించారు.ఆదోని శాసన సభ్యులు డాక్టర్ వాల్మీకి పార్థసారథి అడిగిన ..రాష్ట్రంలోని దేవాలయాల్లో అర్చకులు వేదపండితులు పరిచారకులు మరియు ఇతర ధార్మిక సిబ్బంది నియామకల్లో జోనల్ విధానాన్నిఅమలు చేసేందుకు ప్రభుత్వం పరిశీలిస్తుందా?..రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల నియామకల్లో రాయలసీమ ప్రాంతానికి చెందిన అర్చకులు వేద పండితులకు అన్యాయం జరుగుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందా? మరియు శ్రీశైలం, మహానంది, శ్రీకాళహస్తి, కాణిపాకంవంటి ప్రధాన దేవాలయాల నియామకాల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇచ్చేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?మరియు రాయలసీమ జోన్ను పరిగణలో తీసుకొని స్థానిక నిరుద్యోగ అర్చకులు, వేద పండితులు కు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ సమీక్షించే ప్రతిపాదన ఏమైనా ఉందా ఉన్నట్లయితే వాటి వివరాలు తెలుపగలరు అని. ప్రశ్నించారు..మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సమాధానం చెప్తూ., రాష్ట్రంలోని దేవాలయాల్లో అర్చకులు, వేద పండితులు, పరిచారకులు, ఇతర ధార్మిక సిబ్బంది నియామకాల్లో జోనల్ విధానం అమల్లో లేదు, అధ్యక్షా.ప్రధాన దేవాలయాల్లో అర్చకులు, వేద పండితుల నియామకాల్లో రాయలసీమ ప్రాంతానికి అన్యాయం జరుగుతోందన్న విషయం ప్రభుత్వం దృష్టికి రాలేదు. దీనికి స్పష్టమైన ఉదాహరణగా ఇటీవల భర్తీ చేసిన 344 పోస్టుల్లో 172 పోస్టులను రాయలసీమ ప్రాంతంలోని ప్రధాన దేవాలయాల్లో భర్తీ చేశామని తెలిపారు.శ్రీశైలం, మహానంది, శ్రీకాళహస్తి, కాణిపాకం వంటి ప్రధాన దేవాలయాల్లో ఖాళీలు ఏర్పడినప్పుడు నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ ఇచ్చి, అర్హులైన వేద, ఆగమ పండితులను పూర్తి మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తున్నాం. ప్రాంతం కంటే వేద, ఆగమ పరిజ్ఞానానికే ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది.ఇటీవల జరిగిన నియామకాల్లో రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలకు చెందిన వేద, ఆగమ పండితులను ఎంపిక కమిటీల్లో సభ్యులుగా నియమించి, వారి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించాం. సుమారు 1,400 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరైతే, కేవలం 15 మందిని మాత్రమే ఎంపిక చేయాల్సి వచ్చింది. అభ్యర్థుల మధ్య పోటీ చాలా తీవ్రంగా ఉంది. ఒకటి, రెండు మార్కుల తేడాతో కూడా ఎంపికలు జరిగాయి.రాయలసీమ ప్రాంతం నుంచి 1,431 దరఖాస్తులు వచ్చాయి. అందులోనూ అర్హత సాధించిన అభ్యర్థుల్లో 172 మందికి అవకాశం లభించింది. అభ్యర్థులందరూ మంచి ప్రతిభ కనబరిచారు. వేదం, సంస్కృతం, ఆగమ పరిజ్ఞానం వంటి అంశాల ఆధారంగానే ఎంపిక జరిగింది.

# కోనసీమ కొబ్బరి రైతులకు అండగా ప్రభుత్వం

● దెబ్బతిన్న ప్రతి కొబ్బరి చెట్టు స్థానంలో కొత్త మొక్క నాటడమే లక్ష్యం

● ఒక్కో మొక్కకు రూ.1,000 సాయం..

● కాలువల్లో పూడికతీతతో ఉప్పునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

● కొబ్బరి తోటల్లో అంతర పంటలతో రైతులకు అదనపు ఆదాయం


అచ్చెన్నాయుడు

**విజయవాడ,ఆగస్టు 18,ప్రభాతవార్తప్రతినిధి:** కోనసీమలో కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు తాత్కాలిక ఉపశమనం కాకుండా శాశ్వత పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ, బండారు సత్యానందరావులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, దెబ్బతిన్న ప్రతి కొబ్బరి చెట్టు స్థానంలో కొత్త మొక్క నాటించడంతో పాటు కాలువలు, డ్రెయిన్ల పూడికతీత ద్వారా సమస్య మూలాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. రాష్ట్రంలో 1.18 లక్షల హెక్టార్లలో కొబ్బరి సాగు జరుగుతుండగా, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనే 0.36 లక్షల హెక్టార్లలో కొబ్బరి సాగవుతోందని మంత్రి తెలిపారు. కోనసీమ జిల్లాలో సుమారు 10 వేల హెక్టార్లలో కొబ్బరి తోటలు కౌలు రైతుల ద్వారా సాగవుతున్నాయని వివరించారు.గత ఐదేళ్లుగా కాలువల్లో సక్రమంగా పూడికతీత చేపట్టకపోవడంతో సముద్రపు ఉప్పునీరు బ్యాక్ వాటర్ రూపంలో వెనక్కి వచ్చి నేలలో లవణీయత పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. దీని ప్రభావంతో పైకి ఆరోగ్యంగా కనిపించే కొబ్బరి చెట్లు కూడా అకస్మాత్తుగా కుంగిపోయి చనిపోతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సమస్యను తాను స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించానని, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఆయా ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. దెబ్బతిన్న ప్రతి కొబ్బరి మొక్క స్థానంలో కొత్త మొక్క నాటేందుకు ఒక్కో మొక్కకు రూ.1,000 చొప్పున ఆర్థిక సహాయం అందించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశామని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. కొత్త మొక్కలు నాటడంతోనే సమస్య పరిష్కారం కాదని మంత్రి స్పష్టం చేశారు. కాలువలు, డ్రెయిన్లలో పూడిక తొలగించకుండా ఎన్ని మొక్కలు నాటినా, ఎంత పెట్టుబడి పెట్టినా ఆశించిన ఫలితం ఉండదన్నారు. అందుకే సమస్యకు మూలమైన డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మొదటి విడతలో శంకరగుప్తం కాలువ పనులకు నిధులు కేటాయించామని, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇప్పటికే శంకుస్థాపన చేశారని తెలిపారు. ఈ పనులు పూర్తయితే రెండు, మూడు నియోజకవర్గాల్లో ఉప్పునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. మిగిలిన కాలువలను కూడా ఒక సమగ్ర ప్రాజెక్టుగా చేపట్టి శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. కొబ్బరి రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. కొబ్బరి అభివృద్ధి మండలి సహకారంతో 201718 నుంచి 202425 వరకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 5,250 హెక్టార్లను పథకం పరిధిలోకి తీసుకొచ్చినట్లు వివరించారు. కొత్త కొబ్బరి తోటల విస్తరణకు హెక్టారుకు రూ.56 వేల సబ్సిడీని రెండేళ్లలో రూ.28 వేల చొప్పున రెండు సమాన వాయిదాల్లో అందిస్తున్నామన్నారు. ఉద్యానవన తోటల విస్తరణకు సంబంధించిన కార్యక్రమం కింద గుంటలు తవ్వడం, మొక్కలు నాటడం, సాగు పరికరాలు తదితరాలకు మూడు సంవత్సరాల పాటు హెక్టారుకు రూ.2,47,950 వరకు ఆర్థిక సహాయం అందించే అవకాశం ఉందన్నారు. కోనసీమలో కొబ్బరి రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక ప్రాంతీయ కొబ్బరి బోర్డు కార్యాలయం ఏర్పాటు చేయాలని 2024లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ కేంద్ర మంత్రికి లేఖ రాశారని మంత్రి గుర్తుచేశారు.

## హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులకు రూ.1,323.75 కోట్ల పరిపాలనా అనుమతి

రాయచోటి నియోజకవర్గలో 490-535 కి.మీ. వరకు సుమారు రూ.350 కోట్లతో పనులు..




మంత్రి మండిపల్లి

**విజయవాడ.ఆగస్టు 18,ప్రభాతవార్తప్రతినిధి:** హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ఫేజ్-3లో భాగంగా మిగిలిన మెయిన్ కెనాల్, దిది లైనింగ్, నీవా బ్రాంచ్ కెనాల్ తదితర పనులను పూర్తి చేసేందుకు రూ.1,323.75 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేయడంపై రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. హెచ్ఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌ను తొలుత లైనింగ్ లేకుండా నిర్మించడంతో డిజైన్ చేసిన 2,520 క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని పూర్తిస్థాయిలో అందించేందుకు ఇబ్బందులు ఉన్నాయని, అందువల్ల మిగిలిన కాలువ పనులతో పాటు దిది లైనింగ్ పనులను పూర్తి చేయాల్సి న అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారుశ్రీ సత్యసాయి జిల్లాలో బీవిళీళీ మెయిన్ కెనాల్ కిమీ 400.500 నుంచి 485.300/490.000 వరకు మిగిలిన పనులకు రూ.750.07 కోట్లు, అన్నమయ్య జిల్లాలో కిమీ 490.000 నుంచి 554.175 వరకు మెయిన్ కెనాల్ పనులతో పాటు అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో నీవా బ్రాంచ్ కెనాల్ పనులకు రూ.573.68 కోట్లు కేటాయించే ప్రతిపాదనకు అనుమతి లభించిందని తెలిపారు.రాయచోటి నియోజకవర్గ పరిధిలో హెఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ కిమీ 490 నుంచి 535 వరకు సుమారు 45 కి.మీ. మేర పనులు ఉన్నాయి. ఈ పనులకు సుమారు రూ.290 కోట్లు, అదనంగా రూ.60 కోట్లతో కలిపి మొత్తం సుమారు రూ.350 కోట్ల విలువైన పనులు చేపట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం కిమీ 463 నుంచి 554 వరకు హెఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ పనులను ఒకే సింగిల్ ప్యాకేజీగా చేపట్టే ప్రతిపాదన ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో మన నియోజకవర్గ పరిధిలోని 490-535 కి.మీ. పనులు కూడా ఈ సమగ్ర ప్యాకేజీలో భాగం కానున్నాయి.ఈ పనులు పూర్తయితే హెఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యంతో పనిచేసి, కేవీ పల్లి, గాలివీడు, చిన్నమండెం, సంబేపల్లి, రాయచోటి, పీలేరు, చిత్తూరు ప్రాంతాలకు తాగునీరు అందించడంతో పాటు సాగునీటి అవసరాలను తీర్చేందుకు మరింత ఉపయోగపడుతుందని, 25 వేల ఎకరాల ఖాళీ చెరువులు నింపి ప్రజలకు నీటి భరోసా కల్పిస్తాం మంత్రి అన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా శ్రీనివాసపురం, అడవిపల్లి రిజర్వాయర్లను అనుసంధానం చేసి, మార్గమధ్యంలోని ఖాళీ చెరువులను నింపేలా కార్యాచరణ చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించడంలో హెఎన్ఎస్ఎస్ పనులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా ప్రజల చిరకాల నీటి అవసరాలను గుర్తించి బీవిళీళీ పనులకు భారీగా నిధులు కేటాయించి పరిపాలనా అనుమతులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చొరవ, దూరదృష్టితో ఈ ప్రాంతానికి మంచినీరు, సాగునీటి భరోసా మరింత బలోపేతం కానుందని మంత్రి హర్షం వ్యక్తం చేశారు.హెచ్ఎన్ఎస్ఎస్ మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు సాధ్యమైనంత త్వరగా నీటి ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కోరారు.

## మంత్రి లోకేష్‌తో దళవాయి రమాదేవి భేటీ

కుటుంబ సభ్యులతో సహా మంత్రి నారా లోకేష్‌ను కలిసిన ఎంఎల్‌సీ దళవాయి రమాదేవి



**విజయవాడ,ఆగస్టు18,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ మరియు ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ ను దళవాయి రమాదేవి కుటుంబసభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా, క్షేత్రస్థాయి కార్యకర్తగా తన సేవలను గుర్తించి, శాసనమండలి సభ్యురాలిగా అవకాశం కల్పించినందుకు మంత్రి నారా లోకేష్ కు ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రి నారా లోకేష్ ఆమెను అభినందిస్తూ, తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ పార్టీ కోసం నిస్వార్థంగా కష్టపడే నిజమైన కార్యకర్తలను, నాయకులను గుర్తిస్తుందని, వారికి సముచిత స్థానం కల్పించడంలో ముందుంటుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మరింత నిబద్ధతతో పనిచేయాలని ఈ సందర్భంగా ఆమెకు సూచించారు.

# బిసిలకిచ్చిన మరో హామీని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

● రాష్ట్ర బీసీ మంత్రి సవిత

● స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనపై హర్షం

● గ్రామీణ ప్రాంతాల్లో 34 శాతం, పట్టణల్లో 33.33 శాతం అమలు

● సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కు, మంత్రి నారా లోకేశ్ కు ధన్యవాదాలు



**విజయవాడ, ఆగస్టు 18,ప్రభాతవార్తప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఇది చరిత్రలో ఈరోజు బీసీలు మరిచిపోలేని రోజు అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత సంతోషం వ్యక్తంచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు, పట్టణ ప్రాంతాల్లో 33.33 శాతం అమలు కాబోతున్నాయి... అని. బీసీలకు ఎన్నికల ముందు ఇచ్చిన మరో హామీని నిలబెట్టుకున్నందుకు సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్ కు ధన్యవాదాలు తెలియజేశారు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు జగన్ ప్రభుత్వం కోత పెట్టడం వల్ల 16 వేలకు పైగా పదవులకు బీసీలు దూరమయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంగళవారం శాసనసభలో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల బిల్లు చర్చ సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మాత్యులు ఎస్.సవిత మాట్లాడారు. బీసీల పక్షపాత్రి ప్రభుత్వం తమదని మరోసారి రుజువైందన్నారు. బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీని నిలబెట్టుకుంటున్నామన్నారు. స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పించాలని నిర్ణయించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 34 శాతం, పట్టణ ప్రాంతాల్లో 33.33 శాతం మేర రిజర్వేషన్లు అమలు చేయబోతున్నామన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనపై మంత్రిమండలిలో ఆమోదించామన్నారు. అసెంబ్లీలో కూడా ఆమోదిస్తున్నామన్నారు. బీసీల అభ్యున్నతి కోసం ఆనాడు అన్న ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు బీసీలకు మొట్టమొదటిసారిగా 1994లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేశారన్నారు. ఇప్పుడు మరోసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ల కల్పనతో బీసీలకు రాజ్యాధికారంలో అవకాశం కలుగుతుందన్నారు. తమను తాము పాలించుకునే అవకాశం కలుగుతుందని, చరిత్రలో నేడు మరిచిపోలేని రోజు అని మంత్రి సవిత ఆనందం వ్యక్తం చేశారు...**బీసీలను ప్రోత్సహించిన టీడీపీ...**బీసీలను రాజకీయంగా ప్రోత్సహించిన పార్టీ టీడీపీయేనని మంత్రి సవిత తెలిపారు. నేడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉన్న కీలకమైన బీసీ నాయకులందరూ టీడీపీ ప్రోత్సహించనవారేనన్నారు. కింజరాపు ఎర్రన్నాయుడు, దేవేందర్ గౌడ్, కేఈ కృష్ణమూర్తి, యనమల రామకృష్ణుడు, తన తండ్రి ఎస్.రామచంద్రారెడ్డి వంటి ఎందరో బీసీ నేతలు అన్న ఎన్టీఆర్, సీఎం చంద్రబాబు ప్రోత్సహంతో రాజకీయాల్లో తమదైన ముద్ర వేశారని మంత్రి సవిత తెలిపారు. **..బీసీ రిజర్వేషన్లకు జగన్ కోత..** సీఎం చంద్రబాబు అధికారంలో ఉన్న ప్రతిసారీ బీసీలకు మేలు చేసేలా పాలన సాగిస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. బీసీలు ఎప్పుడూ టీడీపీ పక్షపాతమేనని జగన్ కక్షగట్టారన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లలో కోత పెట్టి 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందన్నారు. రిజర్వేషన్లలో కోత వల్ల 16,800 పదవులకు బీసీలు దూరమయ్యారన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని మంత్రి నారా లోకేశ్ తన పాదయాత్రలో గుర్తించారన్నారు. అధికారంలోకి రాగానే బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఆనాడే హామీ ఇచ్చారన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో సీఎం చంద్రబాబునాయుడు సైతం బీసీలకు రిజర్వేషన్లను పునరుద్ధరిస్తామని భరోసా ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ల కల్పిస్తూ బిల్లును రూపొందించామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయనున్నామన్నారు. బీసీలకు మరోసారి రాజకీయ పట్టం కల్పిస్తున్న సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్ కు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు..కూటమి రాకతో బీసీలకు సంక్షేమ దన్ను. సీఎం చంద్రబాబు రాకతో బీసీలకు మరోసారి మంచిరోజులు వచ్చాయని మంత్రి సవిత తెలిపారు. సంక్షేమ పథకాలు అమలుచేస్తూ, బీసీలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత బీసీలకు మొదటి బడ్జెట్ లో రూ.39 వేల కోట్లు, రెండో బడ్జెట్ లో రూ.47 వేలు కోట్లు, మూడో బడ్జెట్ లో రూ.51 వేల కోట్లు కేటాయించామన్నారు. బీసీల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శమన్నారు. చట్టసభలలో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడానికి అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రప్రభుత్వ తదుపరి చర్యకు పంపించామని గుర్తు చేశారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామన్నారు. గీత కార్మికులకు మద్యంషాపులు, బార్లు కేటాయింపుల్లోనూ 10 శాతం మేర కేటాయించామన్నారు. మద్యం షాపుల లైసెన్స్ లో 50 శాతం రాయితీ ఇచ్చామన్నారు. వడ్డెరలకు క్వారీల కేటాయింపుల్లో 33 శాతం మేర రిజర్వేషన్లు, 50 శాతం మేర సినరేజీ మినహాయింపు ఇచ్చామన్నారు. చేపల వేట నిషేధకాలంలో మత్స్యకారులకు ఆర్థిక సాయం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచామన్నారు. 62,541 నేతన్నలకు 200లు, 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. 85,940 మంది నేతన్నలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఇస్తున్నామన్నారు. 71,536 మంది చేనేతలకు నేతన్నల సేవలో పథకం వర్తింప జేశామన్నారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా చేనేతలకు మేలు కలుగజేయాలన్న సంకల్పంతో నేతన్నల సేవలో పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద 202426 మధ్య 15.67 లక్షల బీసీ లబ్ధిదారులకు రూ.15,588.64 కోట్లు చెల్లించామన్నారు. తల్లికి వందనం పథకం కింద రూ.15 వేల చొప్పున 10.46 లక్షల మంది బీసీ విద్యార్థులకు రూ.1,360.61 కోట్లు అందజేశామన్నారు.

# తిరుమల సమాచారం



## సెప్టెంబర్ 15నుండి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

**తిరుమల, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు సప్తగిరులు సిద్ధమవుతున్నాయి. తొమ్మిదిరోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు సెప్టెంబర్ 15నుండి 23వ తేదీ వరకు అంగరంగవైభవంగా చేపట్టనున్నారు. బ్రహ్మోత్సవాల కార్యాచరణను టిటిడి ఖరారుచేసింది. భగవంతుని వాహనసేవలను ఆలయ మాడవీధుల్లో నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా వాహనసేవల వీక్షణకు సౌకర్యాల కల్పనకు ప్రణాళికలు రూపొందించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణ విషయంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని విజయవంతంగా భక్తుల నడుమ బ్రహ్మోత్సవాలను వైభవంగా జరిపించేలా టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రణాళికలు రూపొందించి అమలు చేయిస్తున్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేక దర్శనాలు వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు దర్శనాలు రద్దుచేశారు. సామాన్య భక్తులకు ఎక్కువగా దర్శన సమయం కల్పించేందుకు ఆ తొమ్మిది రోజులు బ్రేక్ దర్శనాలు కూడా రద్దయ్యాయి.

## జోరుగా పుష్కరిణి మరమ్మతు పనులు



**తిరుమల, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** శేషాచలకొండల్లో తిరుమల క్షేత్రంలో వేలపుణ్యతీర్థాలు కలిసే స్వామివారి పుష్కరిణి మరమ్మతులు, శుద్ధిచేసే పనులు వేగంగా సాగుతున్నాయి. గత రెండు వారాలుగా పుష్కరిణిని పూర్తిగా మూసివేసిన టిటిడి ఇంజనీరింగ్ అధికారులు ఈ నెలరోజుల పాటు వివిధ రకాల మరమ్మతు పనులు చేస్తారు. ఈ నెలరోజులు భక్తులు స్నానాలాచరించేందుకు వరాహస్వామి ఆలయం సమీపంలో స్నాన కుశాలలు ఏర్పాటుచేశారు. అలాగే సెప్టెంబర్ 10వరకు కూడా భక్తులను అనుమతించరు. ఇప్పటికే పుష్కరిణిలో నీటిని పూర్తిగా తొలగించి పైపులైన్ల మరమ్మతులు, సివిల్ పనులు చేపడుతున్నారు. ఈ పనులను అదనపు ఇఒ వెంకయ్యచౌదరి తనిఖీ చేసి సూచనలు చేశారు.

## కూరగాయల దాతల సేవలు కీలకం

● టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి



**తిరుమల, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి అన్న ప్రసాద వితరణలో కూరగాయల దాతల సేవలు అత్యంత కీలకమైనవని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్య చౌదరి తెలిపారు. మంగళవారం తిరుమల పద్మావతి అతిథిగృహంలోని సుధర్మ సమావేశ మందిరంలో కూరగాయల దాతలతో సమావేశం నిర్వహించారు. అన్న ప్రసాద విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కూరగాయల సరఫరా, రవాణా, నిల్వ, వినియోగం, నాణ్యత, భవిష్యత్ అవసరాలు తదితర అంశాలపై దాతలతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగేండ్ల నెలలుగా తిరుమలలో రోజుకు సుమారు 4 లక్షల మందికి అన్నప్రసాదం అందిస్తున్నామని, ఇందుకోసం రోజుకు సుమారు 13-14 టన్నుల బియ్యం, 8 టన్నులకు పైగా కూరగాయలు వినియోగిస్తున్నామని చెప్పారు. ఇంత భారీ స్థాయిలో కూరగాయలను నిరంతరం దాతల ద్వారా సమకూర్చడం విశేషమన్నారు. అన్నప్రసాదం అవసరాలకు అనుగుణంగా ఏ సమయంలో ఏ కూరగాయ ఎంత అవసరమో ముందుగానే ప్రణాళిక రూపొందించి, దాతలతో సమన్వయం చేసుకుని కూరగాయలను స్వీకరిస్తున్నామని తెలిపారు. దీంతో కూరగాయల రిజెక్షన్, నష్టాలను గణనీయంగా నియంత్రించగలిగామని చెప్పారు. నాణ్యత, ప్యాకింగ్, రవాణా తదితర అంశాల్లో దాతలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అభినందించారు. రాబోయే రెండు బ్రహ్మోత్సవాల్లోనూ కూరగాయల దాతలు పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు వచ్చారని అదనపు ఈవో తెలిపారు. అన్న ప్రసాదాలకు కూరగాయలను అందిస్తున్న దాతల సేవలను అభినందిస్తూ, వారిని మరింత ప్రోత్సహించేలా టిటిడి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కూరగాయల దాతలను లడ్డూ ప్రసాదాలతో సత్కరించి, శ్రీవారి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశంలో అన్న ప్రసాదం డిప్యూటీ ఇఒ రాజేంద్ర, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి శాస్త్రి పాల్గొన్నారు.

## 20, 21న వెంగమాంబ వర్ధంతి ఉత్సవాలు



**తిరుమల, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** వేంకటేశ్వరస్వామిని తన సర్వస్వంగా భావించి భక్తి సాహిత్యంతో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించిన భక్త కవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 209వ వర్ధంతి ఉత్సవాలు ఈనెల 20, 21 తేదీల్లో తిరుమల, తిరుపతి, తరిగొండలో టిటిడి ఘనంగా నిర్వహించనుంది. వెంగమాంబ జన్మస్థలమైన తరిగొండలోని లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ఆగస్టు 21న లక్ష్మీనృసింహ స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తారు.



# తినేదంతా నెయ్యేనా?

## హైదరాబాద్‌లో విస్తరిస్తున్న కల్తీనెయ్యి మాఫియా

● 130 చోట్ల దాడులు జరిపిన టాస్క్‌ఫోర్స్, హెచ్. ఫాస్ట్

● 36 టన్నుల కల్తీనెయ్యి, రసాయనాలు స్వాధీనం

**హైదరాబాద్, ఆగస్టు 18 ప్రభాతవార్త:** హైదరాబాద్ లో మరోసారి భారీగా కల్తీ ఆహార ఉత్పత్తులు పట్టుబడ్డాయి. నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారితో పాటు హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వేలెన్స్ టీం (హెచ్ ఫాస్ట్), బల్దియాలోని ఫుడ్ సేఫ్టీ విభాగం నగర వ్యాప్తంగా జరిపిన దాడుల్లో 36 టన్నుల కల్తీ నెయ్యితో పాటు దీని తయారీకి వాడే పాం ఆయిల్, డాల్డా సహా రసాయనాలను జప్తు చేశారు. ఈ సందర్భంగా కల్తీ నెయ్యిని తయారు చేస్తున్న వ్యాపారులు, వీటిని విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసు కమి షనర్ వి.సి సజ్జనార్ తెలిపారు. మంగళవారం కమాండ్ కంట్రోల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు వ్యక్తులు మాఫియాగా మారి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని తెలిపారు. కల్తీ ఆహార వస్తువుల తయారీ కేంద్రాలతో పాటు వీటి వి క్రయ సంస్థల గురించి సమాచారం అందగానే దాడులు చేపట్టినట్లు తెలిపారు. మొత్తం 130 ప్రాంగణాల్లో 39 తయారీ కేంద్రాలతో పాటు 91 విక్రయ కేంద్రాలలో దాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. దాడుల్లో 36 టన్నుల కల్తీ నెయ్యి పట్టుబడిందని ఆయన తెలిపా రు. పట్టుబడ్డ కల్తీ నెయ్యి శాంపుల్స్‌ను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపామని ఆయన వెల్లడించారు. దీనిపై ఫుడ్ సేఫ్టీ అథారిటీ అధికారులు విచారిస్తున్నారని కమిషనర్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న కల్తీ నెయ్యిలో 25.5 టన్నుల వివిధ రకాల నూనెతో పాటు 8.7 టన్నుల క్రీం వు ఉందని ఆయన తెలిపారు. కల్తీ నెయ్యి తయారీ లో వాడేందుకు 1200 లీటర్ల పామ్ ఆయిల్, 600 లీటర్ల వనస్పతి, కృత్రిమ సువాసన కోసం ఆరు బాటిళ్ల రసాయనాలు, 30 కిలోల పిండి పదార్థం వుందని ఆయన వెల్లడించారు. కాగా కల్తీ నెయ్యి తయారీలో నేరాళ్లు పక్కాగా వ్యవహరిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. నెయ్యి తయారీకి పాల నుంచి వచ్చిన వెన్న ముఖ్యం కాగా కల్తీ నెయ్యిలో దీనికి భిన్నంగా పాం ఆయిల్‌తో పాటు రసాయనాలు, కొవ్వుపాటి పాలపొడర్‌ను వాడు తున్నారని ఆయన తెలిపారు. ఇలా తయారు చేసిన కల్తీ నెయ్యి చూసేందుకు అసలైన నెయ్యిలాగే వుండేలా చక్కగా ప్యాకింగ్ చేసి 100 గ్రాముల నుంచి ఒక్క కిలో వరకు డబ్బాలలో వుంచి అమ్ముతున్నారని ఆయన తెలిపారు. వీటికి ప్రీమియం నెయ్యి, ప్యూర్ నెయ్యి, ఫార్మ్ ఫ్రెష్ నెయ్యి, నేచురల్ నెయ్యి అనే పేర్లను వాడుతున్నారని కమిషనర్ తెలిపారు. అయితే వీటిపై ఎ లాంటి లైసెన్స్ నంబర్, బ్యాచ్ నంబర్లు వుండడం లేదని ఆయన తెలిపారు. కల్తీ నెయ్యిని ఎక్కువగా పూజ గదుల్లో వాడే దీపాలకు, రెస్టారెంట్లకు, టిఫిన్ సెంటర్లకు, స్వీట్ షాపులకు, ఆయుర్వేద మందుల దుకాణాలకు, డెయిరీ షాపులు, స్టార్ హోటళ్లకు విక్రయిస్తున్నట్లు తేలిందని ఆయన తెలిపారు. కాగా కల్తీ నెయ్యి తయారీలో వాడుతున్న మిల్క్ క్రీంను మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి తయారీదారులు తెప్పిస్తున్నారని కమిష నర్ తెలిపారు. కల్తీ నెయ్యిని తెలంగాణలోనే కాకుండా ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతిస్తున్నా రని ఆయన వెల్లడించారు. కల్తీ నెయ్యి వాడడం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం వుందని కమిషనర్ వెల్లడించారు. కల్తీ నెయ్యిని తయారు చేస్తున్న వారు ఎప్పటి నుంచి వీటిని తయారు చేస్తున్నారు? ఎంతమేరకు విక్రయించారు? ఎక్కడెక్కడ అమ్మారు? వీటిని వాడిన వారు ఎవరు? అనే విషయాలపై సమా చారం సేకరిస్తున్నామని ఆయన తెలిపారు. కల్తీ నెయ్యి తయారీదారులపై కఠినంగా వ్యవహరిస్తా మని, వీరిని అమ్మేవారిని కూడా వదలబోమని ఆయన హెచ్చరించారు. ప్రజలు కూడా కల్తీ ఉత్పత్తుల విషయంలో జాగ్రత్తగా వుండాలని, తక్కువ ధరకు లభించే వస్తువులను కొనవద్దని, నాణ్యమైన వాటినే కొనాలని సజ్జనార్ సూచించారు. కల్తీ ఆహార వస్తువులకు సంబం ధించి ఎవరి వద్ద ఎలాంటి సమాచారం వున్నా వెంటనే 8712661212కు తెలపాలని ఆయన కోరారు. కల్తీ నెయ్యిని పట్టుకున్న పోలీసులను ఆ యన అభినందించారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల అదనపు పోలీసు కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్, టాస్క్‌ఫోర్స్ డిసిపి వైభవ్ గైక్వాడ్ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన నర్సులకు జర్మనీలో ఉద్యోగాలు

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలోని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన మహిళా నర్సులకు జర్మనీలో ప్రతిష్ఠాత్మక ఉద్యోగాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఎంపికైన వారికి నెలకు రూ. 2.75 లక్షల నుంచి రూ. 3.30 లక్షల వరకు ఆకర్షణీయమైన వేతనం లభించనుంది. ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో జర్మనీ జాబ్ ఆపర్చునిటీ ప్రోగ్రామ్‌ఖి పేరుతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. దీని కింద అర్హులైన అభ్యర్థులకు విశాఖపట్నం, తిరుపతి, గుంటూరుల్లోని నైపుణ్యాభివృద్ధి కేంద్రాల్లో శిక్షణ ఇస్తారు. 8 నుంచి 10 నెలల పాటు సాగే ఈ శిక్షణలో జర్మన్ భాషలో బీ2 స్థాయి వరకు నైపుణ్యం కల్పిస్తారు.

సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో శిక్షణ కాలంలో ఉచిత వసతి సౌకర్యం కూడా అందిస్తారు. శిక్షణకు సంబంధించిన పరీక్ష ఫీజును అభ్యర్థులు ముందుగా చెల్లించాల్సి ఉన్నా, ఆ మొత్తాన్ని తర్వాత తిరిగి చెల్లిస్తామని అధికారులు తెలిపారు. ఈ అవకాశానికి 18 నుంచి 35 ఏళ్లలోపు వయసున్న ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన మహిళలు అర్హులు. జీఎన్ఎం లేదా బీఎస్సీ (నర్సింగ్) పూర్తి చేసి ఉండాలి. దీంతో పాటు ఆసుపత్రిలోని ఐసీయూ, ఆపరేషన్ థియేటర్ (ఓటీ) లేదా కార్డియాలజీ విభాగాల్లో కనీసం మూడేళ్ల పని అనుభవం తప్పనిసరి. ఎంపికైన అభ్యర్థులకు వీసా, విమాన టికెట్లతో పాటు ఇతర ప్రయాణ ఖర్చులను జర్మనీలోని నియామక సంస్థలే భరిస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. దరఖాస్తు సమయంలో జనన ధ్రువపత్రం, విద్యార్హత, అనుభవం, కులం, ఆధార్, పాస్‌పోర్ట్ వంటి పత్రాలను జతచేయాలి. పాస్‌పోర్ట్ ప్రస్తుతం అందుబాటులో లేనివారు శిక్షణ పూర్తయ్యేలోగా సమర్పించేందుకు వెసులుబాటు కల్పించారు.

# వర్షాలు సమృద్ధిగా కురవాలి

## 30నుండి కారీరి ఇస్తి, పర్జన్య శాంతి యాగం



**తిరుమల, ఆగస్టు 18 ప్రభాత వార్త ప్రతినిధి:** రాష్ట్రంలో పంటలు పండి, సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలంద రూ క్షేమంగా ఉండాలని కోరుతూ ఈ నెల 30వ తేదీ నుండి అయిదు రోజుల పాటు ధర్మగిరి వేదపాఠశాల లో వరుణ యాగాన్ని నిర్వహించేలా టిటిడి కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా వర్షాలు పడి నీటి సమస్య లేకుండా ఉండాలని ఆకాంక్షిస్తూ ధర్మగిరి వేదవిజ్ఞానపీఠం ఆధ్వర్యంలో వరుణయాగాన్ని నిర్వహించాలని ముహూర్తాన్ని నిర్ణయించారు. ఇందులో భాగంగా వేదవిజ్ఞానపీఠంలో యాగకర్త, రుత్వికుల సమక్షంలో ఆగస్టు 30, 31, సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో వరుణ యాగాన్ని నిర్వహించనున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడిని ప్రార్థిస్తూ తిరుమలలో ఆగస్టు 30 నుండి వరుణయాగం (కారీరి ఇస్తి, పర్జన్య శాంతి) నిర్వహించ నున్నారు. తిరుమల ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠంలో నిర్వహించనున్న యాగంతో వర్షాలు సమృద్ధిగా కురిసి, ప్రజలు సుభిక్షంగా ఉండాలని దేవుడిని ప్రార్థించనున్నారు.



# నషా ముక్త్ భారత్ అభియాన్‌లో జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ

**తిరుపతి, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నషా ముక్త్ భారత్ అభియాన్ ఆరో సంవత్సరం సందర్భంగా విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాల్లో మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా జాతీయ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, బోధనా బోధనేతర సిబ్బందిలో మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించడం, ఆరోగ్యకరమైన మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయడం ప్రధాన లక్ష్యంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపకులు బోధనేతర సిబ్బంది చురుకుగా పాల్గొన్నారు. ఎన్ఎంబీఏ పోర్టల్ ద్వారా ఈప్రతిజ్ఞ నిర్వహించగా, ప్రతిజ్ఞను విజయవంతంగా పూర్తి చేసిన పాల్గొనేవారికి అందుబాటులో ఉన్న పాల్గొని ధృవపత్రాలను డౌన్‌లోడ్ చేసుకునేలా ప్రోత్సహించారు.

# తిరుపతిని దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతాం



**తిరుపతి, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఢిల్లీ చర్చల నుండి క్షేత్రస్థాయి పరిశీలనల వరకు తిరుపతిని దేశానికి రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామని తుడ ఛైర్మన్ డాక్టర్ సి.దివాకర్‌రెడ్డి తెలిపారు. తిరుపతిని సుస్థిర, పర్యావరణహిత, వరదలను తట్టుకునే ఆధునిక నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో తుడా రూపొందించిన 750 కోట్ల "క్లైమేట్ రెసిలియంట్ ఇంటిగ్రేటెడ్ వాటర్ మేనేజ్‌మెంట్ – సిటీ ఆఫ్ లేక్స్ అండ్ ట్యాంక్స్ ప్రాజెక్టు అమలు దిశగా మరో కీలక ముందడుగు పడిందని అన్నారు.

జర్మనీకి చెందిన కెఎఫ్‌డబుల్య ప్రతినిధుల బృందం తుడ, ఐసిఇఐఎల్, ఎపియుఐఎంఎల్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ జలవనరుల శాఖ ప్రతినిధులతో కలిసి ప్రాజెక్టులో భాగంగా ప్రతిపాదించిన చెరువులు, జలవనరుల ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పరిస్థితులు, ప్రాజెక్టు లక్ష్యాలు, హైడ్రాలజికల్ స్టడీస్ అవసరమైన సాంకేతిక అంశాలపై చర్చించారు. అనంతరం తుడా ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించిన అంశాలతో పాటు ప్రాజెక్టు డిపిఆర్ హైడ్రాలజికల్ స్టడీస్, సాంకేతిక అంశాలు, నిధుల సమీకరణ, విభాగాల సమన్వయం తదుపరి కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. వివిధ సంస్థల ప్రతినిధులు అందించిన ప్రశ్నలు, సూచనలపై కూడా చర్చించి తదుపరి కార్యాచరణకు అవసరమైన అంశాలను పరిశీలించారు.

తిరుపతిని దేశానికి రోల్ మోడల్‌గా నిలిపే లక్ష్యంతో "సిటీ ఆఫ్ లేక్స్ ట్యాంక్స్ ప్రాజెక్టును పూర్తి స్థాయిలో అమలు చేస్తామని, డిపిఆర్ ప్రక్రియను వేగవంతం చేసి ప్రథమ దశ పనులను త్వరలో ప్రారంభించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని దివాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ డాక్టర్ యన్ వి శ్రీకాంత్ బాబు, ఎస్ఇ రవీంద్రయ్య, సిపిఒ దేవికుమారి, ఇరిగేషన్ ఎస్ ఇ,తుడా, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## కలసి ఉండటం లేదనే కోపంతో

# భార్యను హత్య చేసిన భర్త

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18 ప్రభాతవార్త:** కుటుంబ కలహాలు, భార్య తనతో కలిసి ఉండటం లేదనే కోపంతో ఓ భర్త దారుణానికి పాల్పడ్డాడు. తూర్పుగోదావరి జిల్లా చక్రద్వారబంధం లో జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమారి (23), నాగరాజు భార్యాభర్తలు. కొంతకాలంగా కుటుంబ కలహాల కారణంగా ఇద్దరూ విడిగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పుట్టింట్లో ఉంటున్న కుమారిని నాగరాజు తన వెంట తీసుకెళ్లాడు. అనంతరం ఆమెతో గొడవకు దిగినట్లు తెలుస్తోంది. తీవ్ర ఆగ్రహానికి గురైన నాగరాజు కుమారి గొంతు నులిమి హత్య చేసినట్లు సమాచారం. ఘటన అనంతరం నాగరాజు తన గొంతును కూడా కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించి, తీవ్రంగా గాయపడిన నాగరాజును చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడికి వైద్యులు చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు దారితీసిన కుటుంబ వివాదాలు, ఘటనకు ముందు జరిగిన పరిణామాలపై వివరాలు సేకరిస్తున్నారు. కుమారి మృతితో ఆమె కుటుంబంలో విషాదం నెలకొంది.

## మెడికో ప్రియాంక హత్య కేసు: పోలీస్ కస్టడీకి నిందితులు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18 ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం లో మెడికో విద్యార్థిని ప్రియాంక హత్య కేసులో నిందితులను పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, నిందితుల పాత్ర, పరస్పర సంబంధాలు, ఉపయోగించిన వాహనం తదితర అంశాలపై పోలీసులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలు, ఇతర ఆధారాలను పరిశీలిస్తూ దర్యాప్తును కొనసాగిస్తున్నారు. కీలక సమాచారం రాబట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. కేసులో మరెవరైనా ప్రమేయం ఉందా అనే కోణంలోనూ విచారణ సాగుతోంది. దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించినట్లు సమాచారం. ప్రియాంక కుటుంబ సభ్యులు మాత్రం ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## బావిలోకి దిగి ఉపిరాడక ఇద్దరు మృతి



**సంతకవిటి (విజయనగరం జిల్లా), ఆగస్టు 18 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా సంతకవిటి మండలం పనసపేటలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. అమ్మమ్మ ఇంటి వద్ద ఉన్న నేల బావిలో మోటార్ పైపుకి ఉన్న ఫుట్బాల్ కీ పోయిందని మరమ్మత్తులు చేసేందుకు బావిలో దిగిన ముజ్జాడ రామకృష్ణ(25) ఆక్సిజన్ అందగా చనిపోవడం జరిగింది. ఎప్పటికీ రాలేదని తమ్ముడు విష్ణుమూర్తి (23) బావిలోకి దిగడం జరిగింది. ఆయన కూడా ఊపిరాడక చనిపోవడం జరిగింది. వీళ్లిద్దరిని కాపాడేందుకు మూడో వ్యక్తి బావిలో దిగడంతో ఊపిరి ఆడక పోవడంతో కేకలు వేయడంతో మరో వ్యక్తి వచ్చి బయటికి తీశారు. రామకృష్ణ బీటెక్ చదువుతున్నాడు. విష్ణుమూర్తి అగ్ని వీర్‌కు సెలెక్ట్ అయ్యి 23న విధుల్లో చేరాల్సి ఉంది. అసిరినాయుడు వరలక్ష్మి కుటుంబానికి ఇద్దరు కుమారులు చనిపోవడంతో మూర్ఛపోయారు. విషయం తెలిసిన సంతకవిటి ఎస్సై ఆర్.గోపాలరావు ఘటన స్థలానికి చేరుకుని పొందూరు, రణస్థలం అగ్నిమాపక కేంద్రం ఎస్సై హేమ సుందర్ సిబ్బందితో కలిసి ఇద్దరు వ్యక్తులను బావిలో నుంచి బయటికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం హాస్పిటల్‌కి తరలించారు.

## యూట్యూబర్ రావణ్ కేసు ఎన్ఐఏ కోర్టుకు బదిలీ

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** సోషల్ మీడియా ద్వారా విద్వేష పూరిత ప్రసంగాలు చేసినట్లు ఆరోపణలు ఎదర్కొంటున్న యూట్యూబర్ రావణ్ అలియాస్ బచ్చలకూరి జోసెఫ్ పై చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా) కింద కేసు నమోదయ్యాయి. ప్రస్తుతం అతడు జైల్లో రిమాండ్ లో ఉన్నాడు. తాజాగా అతడి కేసును గన్నవరం కోర్టు నుంచి విజయవాడ కోర్టుకు బదిలీ చేశారు. ఈ కేసుకు సంబంధించి నమోదైన ఉపా చట్టం తీవ్రత, ప్రత్యేక న్యాయ పరిమితులను పరిగణనలోకి తీసుకుని, కేసు రికార్డులను గన్నవరం కోర్టు నుంచి విజయవాడలోని 2వ అదనపు జిల్లా జడ్జి కోర్టుకు, అలాగే ప్రత్యేక ఎన్ఐఏ కోర్టుకు అధికారులు బదిలీ చేశారు. ఉపా చట్టం కిందికి వచ్చే కేసులకు ప్రత్యేక అధికార పరిధి కలిగిన న్యాయస్థానాల్లోనే విచారణ జరగాల్సి ఉండటంతో ఈ మార్పులు చేపట్టినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, నిందితుడి డిజిటల్ కంటెంట్, నిషేధిత సిద్ధాంతాల ప్రచారం, నెట్‌వర్క్‌లపై సమగ్రంగా విచారించాల్సి ఉందంటూ పోలీసులు కస్టడీ పిటిషన్‌ను దాఖలు చేయగా, విజయవాడ కోర్టులో న్యాయ వాదులు వాదనలు వినిపించారు. ప్రాసిక్యూషన్, డిఫెన్స్ న్యాయవాదుల వాదనలను పరిశీలించిన న్యాయస్థానం, పోలీసు కస్టడీ పిటిషన్‌పై తదుపరి విచారణతో పాటు తీర్పు వెల్లడించేందుకు తేదీని ఖరారు చేసింది.

## ఎసిబికి పట్టుబడ్డ ఒంగోలు ఆర్ఐ



**ఒంగోలు (క్రైమ్), ఆగస్టు 18 ప్రభాతవార్త:** ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎసిబి అధికారులు మంగళవారం దాడులు నిర్వహించి ఇన్చార్జ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరేంద్రను లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఓ స్థలానికి సంబంధించి ల్యాండ్ టైటిల్ పేరు మార్పు చేసేందుకు రూ.15 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఎసిబి అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో పక్కా ప్రణాళికతో రంగం లోకి దిగిన ఎసిబి అధికారులు నగరపాలక సంస్థ కార్యాలయంలో లంచం తీసుకుంటున్న సమయంలోనే అధికారులు పట్టుకోవడంతో కార్యాలయంలో ఒక్కసారిగా కలకలం నెలకొంది. అనంతరం సంబంధిత విభాగంలో పలు కీలక పత్రాలు, రికార్డులు, దస్త్రాలను ఎసిబి అధికారులు పరిశీలించారు. ల్యాండ్ టైటిల్ పేరు మార్పు ప్రక్రియకు సంబంధించిన ఫైళ్లను కూడా పరిశీలించి, లంచం డిమాండ్ చేసిన పరిస్థితులపై వివరాలు సేకరిస్తున్నారు. నరేంద్రకు సంబంధించిన విధులు, సంబంధిత దరఖాస్తు, అధికారిక ప్రక్రియపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ వ్యవహారంలో మరెవరైనా ప్రమేయం ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.

# ధాటీపంచకం భక్తి శరణాగతికి మార్గదర్శకం

**తిరుమల, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీమన్నారాయణుని పాదపద్మాలను ఆశ్రయించిన భక్తులు సంసార బంధాల నుండి విముక్తి పొంది, భగవంతుని అనుగ్రహాన్ని పొందుతారనే సందేశాన్ని ధాటీపంచకం అందిస్తుందని భద్రాచలానికి చెందిన స్థలశాయీ స్వామి తెలిపారు. దాశరథి రచించిన ధాటీపంచకం భక్తి, శరణాగతి, ఆచార్య భక్తి ప్రాధాన్యతను తెలియజేస్తుందని చెప్పారు. భగవంతుని పాదపద్మాలను ఆశ్రయించి, ఆచార్యుల మార్గదర్శకత్వంలో భక్తి మార్గంలో ముందుకు సాగాలని ఈ స్తోత్రం ప్రేరణనిస్తుందని తెలిపారు. తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో టిటిడి ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "శ్రీవైష్ణవ ఆచార్యుల ఆధ్యాత్మిక సేవలు" జాతీయ సదస్సు మంగళవారం రెండో రోజూ కొనసాగింది. మేల్కోటకు చెందిన జగ్గు వెంకటేశం స్వామి రామానుజాచార్యులు దాశరథికి అందించిన పది ఉపదేశాలు భక్తి, శరణాగతి, ఆచార్య నిష్ఠ వంటి ఉన్నత విలువలను తెలియజేస్తాయని అన్నారు. భగవంతునిపై విశ్వాసంతోపాటు భగవద్భక్తుల సేవను కూడా పవిత్రమైన కైంకర్యంగా భావించాలని రామానుజులు బోధించారని చెప్పారు. ఈ ఉపదేశాలు నేటి తరానికి కూడా ఎంతో స్ఫూర్తినిచ్చే ఆధ్యాత్మిక సందేశాలని వివరించారు. ఆచార్య సంపత్‌కుమార్ స్వామి మాట్లాడుతూ కప్యాసం శ్రుతి"పై రామానుజాచార్యులు చేసిన వ్యాఖ్యానం ఎంతో విశిష్టమైనదని తెలిపారు. వేదవాక్యాల్లోని అంతర్లీన ఆధ్యాత్మిక తాత్పర్యాన్ని రామానుజులు భక్తులకు సులభంగా అర్థమయ్యేలా వివరించారని చెప్పారు. ఈ వ్యాఖ్యానంలో భగవంతుని దివ్యత్వం, సౌందర్యం, కళ్యాణగుణాలు ప్రతిఫలిస్తాయని వివరించారు. ఆయీ నరసింహన్ స్వామి మాట్లాడుతూ శ్రీభాష్యంలో జడభరత చరిత్రకు సంబంధించిన శ్లోకాలు, వాటి తాత్త్విక ప్రాధాన్యతను వివరించారు. జడభరతుని చరిత్ర ద్వారా ఆత్మతత్త్వం, దేహ-ఆత్మ భేదం, భక్తి, వైరాగ్యం వంటి విషయాలను తెలుసుకోవచ్చని తెలిపారు. ఉదాహరణల ద్వారా రామానుజులు వేదాంత సిద్ధాంతాలను సామాన్యులకు సైతం సులభంగా అర్థమయ్యేలా వివరించారని చెప్పారు.



# అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్

● రూ. ఒక కోటి 36 లక్షల విలువైన బంగారం, నగదు, స్వాధీనం చేసుకున్న పోలీసులు

**ఒంగోలు (క్రైమ్), ఆగస్టు 18 ప్రభాతవార్త:** పగటి వేళ తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని రెక్కీ నిర్వహించి బంగారు ఆభరణాలు, నగదు దోచుకుంటున్న అంతర్రాష్ట్ర ప్రొఫెషనల్ దొంగను ప్రకాశం జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు .ఎస్పీ హర్షవర్ధన రాజు వెల్లడించిన వివరాల ప్రకారం సీసీ కెమెరాల ఫుటేజీ విశ్లేషణ, సాంకేతిక పరిజ్ఞానం, వాహనాల కదలికలు, క్షేత్రస్థాయి దర్యాప్తు ఆధారంగా నిందితుడి ఆచూకీ గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు సోహైల్ ఖాన్ అలియాస్ మహమ్మద్ సమీర్ ఖాన్ అలియాస్ సమీర్ ఖాన్ అలియాస్ పఠాన్ సమీర్ ఖాన్ అలియాస్ షోహెబ్ ఖాన్, వయస్సు 38 సంవత్సరాలు, కర్ణాటక రాష్ట్రానికి చెందినవాడిగా, ప్రస్తుతం హైదరాబాద్‌లోని షాహీద్‌నగర్‌లో నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. 2026 జూన్ నుంచి ఆగస్టు వరకు నరసరావుపేట, మైలవరం, నూజివీడు, వినుకొండ, ఒంగోలు ప్రాంతాల్లో పగటి సమయంలో తాళం వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. నరసరావుపేటలో జూన్ 2న జరిగిన దొంగతనంలో వచ్చిన నగదులో రూ.18 లక్షలతో ఎక్స్‌యూవీ 700 కారును కొనుగోలు చేసి, మరో రూ.10 లక్షలు తన వద్ద ఉంచుకున్నట్లు నిందితుడు వెల్లడించాడు.

జూలై 1న మైలవరం, నూజివీడు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడగా, నూజివీడు గాంధీనగర్ కేసులో సుమారు 220 గ్రాముల బంగారు ఆభరణాలు రికవరీ అయ్యాయి. జూలై 16న వినుకొండ కొత్తపేటలో దొంగతనానికి ప్రయత్నించినప్పటికీ ఏ వస్తువులు లభించలేదని, అదే రోజు రెడ్డినగర్‌లోని మరో ఇంటిలో దొంగతనం చేసి బంగారు ఆభరణాలు అపహరించినట్లు విచారణలో తేలింది. ఆ కేసులో సుమారు 67.800 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఆగస్టు 5న హైదరాబాద్ నుంచి ఓఎల్ఎక్స్ ద్వారా కొనుగోలు చేసిన పల్సర్ బైక్‌పై ఒంగోలుకు వచ్చిన నిందితుడు ఉదయం ఆంధ్రకేసరి నగర్‌లోని ఓ ఇంటిలో, సాయంత్రం సమతా నగర్‌లోని మరో ఇంటిలో దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈ రెండు ఘటనలపై ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి.

ఆంధ్రకేసరి నగర్ కేసులో 146.200 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.5 లక్షల నగదు, సమతా నగర్ కేసులో 248 గ్రాముల బంగారు ఆభరణాలు రికవరీ చేశారు. అనంతరం మరోసారి ఒంగోలులో దొంగతనాలకు పాల్పడేందుకు ఎక్స్‌యూవీ 700 కారులో వస్తున్న నిందితుడు ఆగస్టు 18న దక్షిణ బైపాస్‌లోని అలాస్ హోటల్ సమీపంలో పోలీసుల వాహన తనిఖీలను గమనించి కారును వెనక్కి తిప్పి పారిపోవడానికి ప్రయత్నించాడు. పోలీసులు వెంబడించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి సుమారు రూ.1.03 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, రూ.15 లక్షల నగదు, రూ.18 లక్షల విలువైన ఎక్స్‌యూవీ 700 కారును స్వాధీనం చేసుకున్నారు. మొత్తం స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ సుమారు రూ.1.36 కోట్లుగా పోలీసులు తెలిపారు.




Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం | బుధవారం 19 ఆగస్టు 2026 | I



## రైల్వే స్టేషన్ల అభివృద్ధి చేయాలని సౌత్ కోస్ట్
# రైల్వే జనరల్ మేనేజర్ నీ కోరిన ఎంపీ పురందేశ్వరి

**రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 18( ప్రభాతవార్త)** కొవ్వూరు, గోదావరి ,రాజమండ్రి, నిడదవోలు రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయాలని విశాఖపట్నం సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథూర్ ని రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి కలిసి కోరారు. కొవ్వూరు రైల్వే స్టేషన్ లో సింహాద్రి ఎక్స్ప్రెస్, సర్కార్ ఎక్స్ప్రెస్, రాయగడ ఎక్స్ప్రెస్ హాల్టింగ్స్ తోపాటు రాజమండ్రి- భీమవరం, నరసాపురం - రాజమండ్రి మధ్య గతంలో నడిచిన అన్ని రైలు సేవలను పునర్దరించాలని కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా బిజెపి అధ్యక్షులు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ కొవ్వూరు రైల్వే స్టేషన్ లో రైళ్ల హాల్టింగ్స్ పునర్దరణ చేయడానికి ఎంపీ కృషి చేస్తున్నారని అన్ని రైలు హాల్టింగ్స్ పునర్దనా ఒకేసారి చేయడం వీలుపడదని రైల్వే అధికారులు తెలియజేయడం వలన విడతల వారిగా నైనా అన్ని రైలులో హాల్టింగ్స్ పునర్దన చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. 2019- 24 ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వహించడం వల్లనే మనం కొవ్వూరు రైల్వే స్టేషన్ లో రైళ్ల హాల్టింగ్స్ ను కోల్పోయామని అన్నారు. ప్రజా ఆకాంక్షలు తీర్చడం కోసమే పనిచేస్తున్నామని బాధ్యత గల ఎన్డీఏ కార్యకర్తలుగా ఇవి సాధిస్తామని తెలిపారు.

# ఆశ్రమ పాఠశాలల్లో బయోగ్యాస్ ప్లాంట్లు
## కలెక్టర్ దినేష్ కుమార్



**రంపచోడవరం, ఆగస్టు 18: ప్రభాతవార్త** పోలవరం జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో గోబర్ధన్ బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో ఎంపీడీవోలు, పంచాయతీ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. 15 రోజుల్లోగా బయోగ్యాస్ ప్లాంట్లు అవసరమైన ఆశ్రమ పాఠశాలలను గుర్తించి నివేదిక ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో ప్రతిరోజూ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మీ కంపోస్టు తయారు చేయాలని ఆదేశించారు. తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి, ఫొటోలతో నివేదికలు సమర్పించాలన్నారు. స్వచ్ఛత కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహిస్తూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, గ్రీన్ షాపుల ద్వారా పర్యావరణహిత ఉత్పత్తులను ప్రోత్సహించాలని తెలిపారు. గ్రామాల్లో చెత్త సేకరణ వాహనాలను సమర్థవంతంగా వినియోగించాలని, పెండింగ్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీడీవో వెంకట్ నారాయణ, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ నరసింహాలయంలో అధికారుల పరిశీలన..



**సఖినేటిపల్లి ఆగస్టు 18, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖా అధికారులు పరిశీలించారు. సూపర్డెంట్ ఆఫ్ ఇంజినీర్ దుర్గేష్ ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ సాంకేతిక లోప సలహాదారులు ఎస్ సుబ్బారావు ఆలయాన్ని, నూతన అన్నదాన భవనాన్ని, రథం షెడ్డు ను పరిశీలించారు. రెండు కోట్ల 80 లక్షలతో దాతలు నిర్మించే అన్నదాన భవనాన్ని తిలకించి చేర్పులు మార్పులు వివరించారు. క్షేత్ర సంరక్షకుడు శ్రీఆంజనేయ స్వామి నూతన ఆలయం నిర్మాణం కొరకు స్తలం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డి ఈ ఉదయ్ కుమార్, పరివేక్షకులు పి విజయ సారధి, కిరణ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లి వెంకన్న నిత్యకళ్యాణం..
# పరవశించిన భక్త జనం..
## నిత్యాన్నదాన పథకానికి రూ. 1, లక్ష ,విరాళం.





**ఆత్రేయపురం, ఆగస్టు 18,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ది చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం మంగళవారం వేలాది మంది భక్తులతో పోటెత్తింది వేకువజామున స్వామివారి కి మేలుకొలుపు, శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శతనామావళి, నిత్య కల్యాణం, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలన్నీ గోవింద నామస్మరణతో మార్మోగాయి.. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. కైకలూరు చెందిన చెరుకువాడ సంతోష్ కుమార్ రాజు, కీర్తి దంపతులు, వారి కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన పథకానికి రూ. 1,00,000/- విరాళంగా అందించారు . స్వామివారి దర్శనం అనంతరం వారికి ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు లు శ్రీ స్వామివారి చిత్రపటం ప్రసాదాలను అందజేశారు.

# ఆదిత్య విశ్వవిద్యాలయంలో విజ్ఞానదాయకంగా ముగిసిన
# 'ఏఐ సైబర్ సెక్యూరిటీ రెవల్యూషన్'పై గెస్ట్ లెక్చర్



**గండేపల్లి. ఆగస్టు 18. ప్రభాతవార్త** గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో, సీఎస్ఐ స్టూడెంట్ చాప్టర్ సహకారంతో "ఏఐ సైబర్ సెక్యూరిటీ రెవల్యూషన్ " అనే అంశంపై గెస్ట్ లెక్చర్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మిస్టర్ రామకృష్ణ చైతన్య ఎమని, ఇన్ఫర్మేషన్ ప్రొటెక్షన్ మేనేజర్, ఎవెర్నార్త్ హెల్త్ సర్వీసెస్, హైదరాబాద్ రిసోర్స్ పర్సన్‌గా హాజరై విద్యార్థులకు కృత్రిమ మేధస్సు మరియు సైబర్ భద్రతకు సంబంధించిన అంశాలపై విలువైన అవగాహన కల్పించారు. ఆధునిక సైబర్ భద్రతలో కృత్రిమ మేధస్సు పాత్ర, పెరుగుతున్న సైబర్ ముప్పులు, సంస్థల సమాచార భద్రతకు ఎదురవుతున్న సవాళ్లపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు ఏఐ మరియు సైబర్ భద్రత రంగాల్లో పరిశ్రమ నిపుణుల నుంచి ప్రత్యక్ష అవగాహనను అందించింది. కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆధునిక సైబర్ భద్రతా సాంకేతికతలపై ఆసక్తి పెరగడంతో పాటు, భవిష్యత్‌లో ఏఐ మరియు సైబర్ భద్రత రంగాల్లో అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి ప్రేరణ లభించింది. ఈ కార్యక్రమం విద్యార్థులకు విజ్ఞానదాయకంగా, ఉపయోగకరంగా విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ గ డాక్టర్ ఐ వీరాంజనేయులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడెమిక్స్) డాక్టర్ ఎస్ రమాశ్రీ, ప్రో వైస్ ఛాన్సలర్ (ఇంజనీరింగ్, సైన్సెస్) డాక్టర్ ఎ రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి సురేష్, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం వి రాజేష్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం హెడ్ డాక్టర్ మాకినీడి రాజాబాబు, డిప్యూటీ హెడ్స్ డాక్టర్ ఎ. లక్ష్మణరావు, ఎస్. నీలిమ మరియు విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.





## ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపిన
# కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనవాడి కొండబాబు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 (ప్రభాతవార్త )**బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మంత్రి మండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నందుకుగాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు శాసన సభలో బీసీ ప్రజాప్రతినిధులతో కలిసి ధన్యవాదాలు తెలియజేశారు.

# సత్యదేవుడిని దర్శించుకున్న స్వామి శ్రీనివాసానంద సరస్వతి



**అన్నవరం, ఆగస్టు 18 (ప్రభాతవార్త) :** కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామి వారి దర్శనం కోసం ఆనందాశ్రమ పీఠాధిపతి, ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షులు స్వామి శ్రీనివాసానంద సరస్వతి రత్నగిరికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అధికారులు పీఠాధిపతిని సత్యదేవుని ఆలయానికి తీసుకువెళ్లి అంతరాలయంలో స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం స్వామి శ్రీనివాసానంద సరస్వతి వారికి వేద ఆశీర్వచనాలతో స్వామివారి శేష వస్త్రాన్ని బహుకరించి, ప్రసాదం మరియు చిత్రపటాన్ని పీఠాధిపతికి అందజేశారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో రూ. 1లక్ష జరిమానా,జైలు.

**తాళ్లరేవు, ఆగస్టు 17( ప్రభాతవార్త):** మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్ట ప్రకారం శిక్షలు తప్పవని కోరంగి ఎస్ ఐ పి. సత్యనారాయణ హెచ్చరించారు. ఇటీవల మండల పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ లో 11 మంది పై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వారిని కోర్టుకు హాజరుపరచగా పదిమందికి ఒక్కొక్కరికి రూ. 10,000 చొప్పున మొత్తం రూ 1 లక్ష జరిమానా విధించారన్నారు. మరొక వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష వేసినట్లు తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు కోరింగ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. అతి వేగంగా ప్రయాణించే వాహన చోదకులను అదుపులోకి తీసుకుని భారీ స్థాయిలో జరిమానాలు విధించి, రహదారి భద్రతకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ఇకపై కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని ఎస్ ఐ పేర్కొన్నారు.

# పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలో కొనరంకితం కావాలి
## - అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**పిఠాపురం, ఆగస్టు 18 ( ప్రభాతవార్త )** ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అస్వస్థత నుంచి కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలో పునర అంకితం కావాలని, మంగళవారం పిఠాపురంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో జనసైనికులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పవన్ కళ్యాణ్ ఆదేశాలను కర్తవ్యం నిష్టతో నిర్వర్తిస్తున్న ఎమ్మెల్సీ హరిప్రసాద్ హృద్రోగం నుంచి కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని ఆకాంక్షిస్తూ ఆంజనేయ స్వామి సన్నిధిలో ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రార్ధన కార్యక్రమం నిర్వహించడం జరిగిందిఈ సందర్భంగా నాగవల్లి వ్రత పూజ, సింధూర అర్చన, మృత్యుంజయ నామస్మరణ తదితర ప్రత్యేక పూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ అభయాంజనేయ స్వామి అనుగ్రహంతో వారిద్దరికీ సంపూర్ణ ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు, శక్తి, ధైర్యం, ఆరోగ్యాన్ని ప్రసాదించాలని జన సైనికులు ప్రార్థించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కంచర్ల భవాని శంకర్, పిఠాపురం పట్టణ వైస్ ఇన్చార్జ్ బాలిపల్లి అనిల్, మొగలి రాజా, పిఠాపురం పట్టణ వార్డు ఇన్చార్జిలు గౌతు రాజా, బాలిపల్లి శివ సూర్య జన సైనికులు గండేపల్లి గౌతమ్, దాసరి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## రాళ్లబండి సుబ్బారావు వర్ధంతి సందర్భంగా వారసత్వ కట్టడాలపై ఆందోళన



**రాజమహేంద్రవరం అర్బన్: ఆగస్టు 18 (ప్రభాతవార్త)** నగరంలోని చారిత్రక, సాంస్కృతిక వారసత్వ కట్టడాల పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. రాళ్లబండి సుబ్బారావు వర్ధంతి సందర్భంగా ఆయన మాట్లాడారు. 2023లో మాజీ ఎంపీ మార్గాని భరత్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.6 కోట్ల గ్రాంట్ మంజూరు చేయగా, కేంద్ర ప్రభుత్వం మరో రూ.4 కోట్లు కేటాయించిందని తెలిపారు. అయితే ఇప్పటివరకు నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడం ఆందోళనకరమన్నారు. పుష్కరాల నాటికైనా పనులు పూర్తవుతాయా? నిర్మాణానికి అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందా? అంటూ ప్రశ్నించారు. కేంద్రం రూ.4 కోట్లు మంజూరు చేసినప్పటికీ రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి నగరంలో కనిపించరని, ఢిల్లీలోనూ కాకుండా బాపట్లలోనే ఎక్కువగా ఉంటున్నారని టీకే విశ్వేశ్వరరెడ్డి ఘాటుగా విమర్శించారు. వారసత్వ పరిరక్షణ సమితి కన్వీనర్ దేశిరెడ్డి బలరాంనాయుడు మాట్లాడుతూ టౌన్‌హాల్, నేదునూరి గంగాధరం లైబ్రరీ, విక్రమ్‌హాల్, కందుకూరి వీరేశలింగం గృహం, రాళ్లబండి సుబ్బారావు మ్యూజియం, దామెర్ల ఆర్ట్ గ్యాలరీ వంటి చారిత్రక కట్టడాలు శిథిలావస్థకు చేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేసి వారసత్వ సంపదను కాపాడాలని కోరారు.

# శృంగధార గ్రామంలో వ్యక్తి హత్య



**శంఖవరం ఆగస్టు 18 ప్రభాతవార్త** శంఖవరం మండలంలోని సబ్ ప్లాన్ ఏజన్సీ పెద మల్లాపురం పంచాయతీ శృంగధార గిరిజన గ్రామంలో వ్యక్తి హత్యకు గురయ్యాడు. అన్నవరం ఎస్సై శ్రీహరిబాబు తెలిపిన వివరాల ప్రకారం... శృంగధార గ్రామానికి చెందిన కైకాని చంద్రయ్య భార్యను రాజమ్మంగి మండలంలోని ఓకుర్తి గ్రామానికి చెందిన ముర్ల మణికుమార్ (32) తరచూ వేధిస్తున్నాడనే కారణంతో చంద్రయ్య మణికుమార్ ను హత్య చేసినట్లు తెలిపారు. గతంలోనూ వీరిరువురు మధ్య వివాదాల నేపధ్యంలో కాల్పులు జరిగిన ఘటన కూడా చోటుచేసుకుంది. హత్యకు పాల్పడిన చంద్రయ్య ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉండగా, అన్నవరం ఎస్సై ఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రత్తిపాడు సిఐ సూర్య అప్పారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## సమాజ శ్రేయస్సు, రైతు సుభిక్షత కోసమే మహా వరుణ యాగం
## మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు



**తుని, ఆగస్టు 18,( ప్రభాతవార్త )**
సమాజ శ్రేయస్సు, రాష్ట్రంలో రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుతూ తుని మండలం తేటగుంట లో మహా వరుణ యాగం నిర్వహించడం జరుగుతుందని మాజీ మంత్రి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. ఈ సందర్భంగా తేటగుంట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ ఎల్నినో నేపధ్యంలో వర్షా భావ పరిస్థితులు కారణంగా వ్యవసాయంపై పెను ప్రమాదం చూపిస్తుందని ఈపరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వాలతో పాటు మానవ ప్రయత్నాలు కూడ ఉండాలని మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు.రైతు సుభిక్షంగా ఉంటేనే సమాజం క్షేమంగా ఉంటుందని ఆయన అన్నారు.మున్నెన్నడూ లేని విధంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున రైతుల శ్రేయస్సు కోసం అన్నదాతల భాగస్వామ్యంతో వరుణ యాగం తలపెట్టామని యనమల పేర్కొన్నారు.ఈనెల 19 నుంచి నాలుగు రోజులపాటు యనమల గార్డెన్స్ లో వరుణ యాగం ఋత్వికుల వేదమంత్రాలతో పూజా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.రాజకీయాలకు అతీతంగా రైతులు చేపట్టిన వరుణయాగానికి కులమతాలకు అతీతంగా అందరూ విచ్చేయాలని ఆయన ఆహ్వానించారు.ఇది మానవ ప్రయత్నం.యజ్ఞయాగాలు చేపట్టడం మన ధర్మమని అన్నారు .భగవంతుడు కరుణ చూపించి వర్షాలు సమృద్ధిగా కురవాలని యనమల ఆకాంక్షించారు.తుని నియోజవర్గం నలు దిశలా పీసీసీ,పుష్కర,పంపా జలాశయాలు ఉన్నప్పటికీ తగిన స్థాయిలో నీటి నిల్వలు లేనందున వర్షాలు పడితే తప్పా ఖరీఫ్ ముందుకు సాగే పరిస్థితి కనిపించడం లేదని వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ ఈమహా యజ్ఞం రైతులు చేసేందుకు ముందుకు వచ్చారని యనమల చెప్పారు .వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు.

# రామచంద్రపురంలో 40 ఏళ్ల కబేలాకు మూత





**రామచంద్రపురం,ఆగస్టు18 (ప్రభాతవార్త):** చోడవరం గ్రామంలో గత నాలుగు దశాబ్దాలుగా స్థానికులు, ద్రాక్షారామం వచ్చే భక్తులను ఇబ్బందులకు గురిచేస్తున్న కబేలా (పశువధశాల) ఎట్టకేలకు మూతపడింది.మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కబేలాను మూసివేసి విద్యుత్ సరఫరా నిలిపివేయాలని ఆదేశించింది. ఉత్తర్వుల మేరకు మంగళవారం పోలీసు బందోబస్తు మధ్య మున్సిపల్,రెవెన్యూ,పశు సంవర్ధక శాఖల అధికారులు కబేలా వద్దకు చేరుకుని జేసీబీలతో పశు వ్యర్థాలు, చెత్తను తొలగించారు. భవిష్యత్తులో మళ్లీ పశువధ జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.కబేలాపై ఆధారపడిన కుటుంబాల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా అదే ప్రాంతంలో డైరీ ఫారం ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు, ప్రభుత్వ సహాయం అందిస్తామని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు.దీంతో నిర్వాహకులు కబేలాను స్వచ్ఛందంగా మూసివేయడానికి అంగీకరించారు.నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న కాలుష్య సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానికులు,భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మత్తు పదార్థాల నిర్మూలనకు
# ప్రజలు సహకరించాలి : సీఐ శ్రీనివాస్



**యు.కొత్తపల్లి, ఆగస్టు 18 (ప్రభాతవార్త) :** చాప కింద నీరులా విస్తరిస్తున్న మత్తు పదార్థాల అలవాటు నిర్మూలనకు ప్రజలు సహకరించాలని పిఠాపురం సీఐ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని అమీనాబాదు సెంటర్లో మంగళవారం రాత్రి స్థానిక ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో పేరుతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగం, రవాణాను అరికట్టేందుకు ప్రజలంతా పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత దారితప్పి ఎంతో విలువైన ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తల్లిదండ్రులకు, సమాజానికి భారంగా మారుతున్నారన్నారు. డ్రగ్స్ మహమ్మారిని సమాజం పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజలు ముందస్తు సమాచారాన్ని పోలీస్ శాఖకు అందించి మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల ప్రాణాలకు..
# రక్షణ ఏది?

- ఉచిత బస్సు ప్రయాణంలో నరకయాతన!
- సరిపడా బస్సులు లేక ప్రయాణికుల తంటాలు
- అడ్డతీగల - రంపచోడవరం రూట్‌లో తీరని రవాణా కష్టాలు



**అడ్డతీగల, ఆగస్టు 18. ప్రభాతవార్త** ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం మహిళలకు ఆర్థికంగా ఊరటనిస్తున్నప్పటికీ,వారి ప్రాణాలకు మాత్రం రక్షణ లేకుండా పోతోందని ప్రయాణికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పథకం అమలు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో రద్దీకి తగ్గట్టుగా సరిపడా బస్సులు నడపకపోవడం, రోజూ తీవ్ర అవస్థలు పడుతున్నామని మహిళలు వాపోతున్నారు.

**ప్రమాదకరంగా ఫుట్‌బోర్డులు**

రూట్లలో తిరగాల్సిన బస్సుల సంఖ్యను తగ్గించడంతో ప్రయాణికుల నిరీక్షణ సమయం విపరీతంగా పెరిగిపోతోంది. ఒకే బస్సులో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించాల్సి రావడంతో మహిళలు,చిన్న పిల్లలు ఊపిరాడని వాతావరణంలో, ఫుట్‌బోర్డులపై వేలాడుతూ ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు.తరచూ బస్సులు మధ్యలోనే నిలిచిపోవడం వంటి సమస్యలతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.ప్రతి రూటుకీ బస్సులు నడుపుతామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటికీ అడ్డతీగల మండలం నుండి రంపచోడవరం వెళ్లడానికి సరిపడా బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక మహిళలు వాపోతున్నారు. ఉచిత ప్రయాణం కల్పించాం కదా అని ప్రభుత్వం చేతులు దులుపుకుంటే సరిపోదు, మా ప్రాణాలకు రక్షణ ఏది?" అని మహిళా ప్రయాణికులు నిలదీస్తున్నారు. కేవలం పథకాన్ని ప్రకటించడమే కాకుండా, తక్షణమే కొత్త బస్సులను అందుబాటులోకి తెచ్చి, రద్దీకి తగినట్లుగా సర్వీసులను పెంచాలని కోరుతున్నారు. ముఖ్యంగా అడ్డతీగల – రంపచోడవరం మార్గంలో వెంటనే బస్సు సర్వీసులను పునరుద్ధరించి సురక్షిత ప్రయాణాన్ని అందించాలని ప్రజాప్రతినిధులను, అధికారులను వారు డిమాండ్ చేస్తున్నారు.

**CHANGE OF NAME**

I, NAVUNDRU MANGA DEVI, D/o. Ramudu Madiki Resident of Door No 1-146, Srirama nagar, Neelapalli Thallarevu mandal, D.R Ambedkar Konaseema Dist, Pin:533464, AP. Have Changed my name from NAVUDNRU MANGA DEVI (Old Name) to NAVUNDRU MANGA DEVI (New Name) Hence after all my documents Correspondence Will Continue with my new name NAVUNDRU MANGA DEVI.

**CHANGE OF NAME**

I, Dommeti Manikandan, S/o.Hari Krishna Rao Resident of Door No.5- 65, Edarapalli, Amalapuram Mandal, Dr.B.R. Ambedkar Konaseema Dist, Pin: 533201, AP. Have Changed my name from DOMMETHI MANIKANDAN (Old name) to DOMMETI MANIKANDAN (New Name) Hence after all my documents Correspondence Will Continue with my new name DOMMETI MANIKANDAN.

# వీరభద్రారెడ్డికి ప్రశంసల వెల్లువ



**పెదపూడి 18 ఆగస్టు ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లల మామిడాడ గ్రామానికి చెందిన మేడపాటి వీరభద్రారెడ్డికి ఆగస్టు 15వ తేదీన అనుకోకుండా అతని బ్యాంక్ ఖాతాకి లక్ష రూపాయలు వచ్చాయి. లక్ష రూపాయలు ఖాతాకి రావడం గమనించిన వీరభద్రారెడ్డి వెంటనే బ్యాంకు వారికి తెలియజేశారు అయితే ఆ లక్ష రూపాయలు విశాఖపట్నం జిల్లా విశాఖపట్నానికి చెందిన వేత్రి వేలం రాధిక ఖాతా నంది అమ్మాయి కాలేజ్ ఫీజు నిమిత్తం లక్ష రూపాయలను బదిలీ చేసే సమయంలో అనుకోకుండా వీరభద్రారెడ్డి ఖాతాకు రావడం జరిగిందని వారు ఫోన్ చేసి కన్నీరు మున్నీరు కాగా వెంటనే వీరభద్రారెడ్డి బ్యాంకు ద్వారా వారి ఖాతా నుండి లక్ష రూపాయలు వచ్చాయో అదే ఖాతాకు యూపీఐ ద్వారా చేరవేయడం జరిగింది. పోయిందనుకున్న సొమ్ము తిరిగి రావడంతో రాధిక కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు అదే విధంగా బ్యాంకు వారు వీరభద్రారెడ్డి నిజాయితీకి ప్రశంసల వర్షం కురిపించారు వీరభద్ర రెడ్డి ఎస్ హెచ్ ఆర్ సి ఎస్పీవో లో కాకినాడ జిల్లా కోఆర్డినేటర్ గా పనిచేయడంతో ఆ సంస్థ వారు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు ఈ సందర్భంగా వీరభద్ర రెడ్డి మాట్లాడుతూ పరాయి సొమ్ము పాము లాంటిదని ఎవరి కష్టమైనా ఒక్కటేనని అందుకే అనుకోకుండా వచ్చిన సొమ్మును ఎవరి వద్ద నుండి వచ్చిందో వారికే పంపించడం జరిగిందని ఆయన అన్నారు

# ప్రతి రైతు పంట కు ఇన్సూరెన్స్ చేయించుకోవాలి....


### - డి ఆర్ సి ఏడిఏ జయ రామలక్ష్మి



**బిక్కవోలు 18 ఆగస్టు ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం బిక్కవోలు మరియు ఊలపల్లి గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డిఆర్సి ఏడిఏ ఎస్ జయ రామలక్ష్మి మరియు డి ఏ ఓ ఆఫీస్ టెక్నికల్ ఏవో కే సూర్య రమేష్ విచ్చేశారు. ఈ సందర్భంగా జయ రామలక్ష్మి మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం వల్ల ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల వల్ల వరి పంటకు నష్టం కలిగే అవకాశం లేకపోలేదని కనుక ప్రతి ఒక్క రైతు జాగ్రత్త వహించాలని ఆమె అన్నారు. అనంతరం టెక్నికల్ ఏవో సూర్య రమేష్ మాట్లాడుతూ పంట పొలాలలో పంటను నష్టపరిచే ఎలుక యొక్క జీవన విధానం మరియు అది పంటను ఏ విధంగా నష్టపరుస్తుంది, పంట పొలాలలో వాటిని ఏ విధంగా గుర్తించాలి, బ్రోమాడియోలిన్ 2% మందును ఏ విధంగా తయారు చేసుకొని ఎలుకల బొరియల దగ్గర వాడుకోవాలి అనేది రైతులకు వివరించారు. బిక్కవోలు మండల వ్యవసాయ అధికారి జి వాణి మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రతి రైతు పంటల ఇన్సూరెన్స్ కచ్చితంగా చేయించుకోవాలని, దీనికి గాను ఈ నెల 31వ తేదీ వరకు ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టే గడువు తేదీని పెంచడం జరిగిందని, కావున రైతులు అందరూ తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఆగస్టు19వ తేదీ నుండి బిక్కవోలు మండలం లోని అన్ని గ్రామాలలో రైతు సేవా కేంద్రాలలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం లో భాగంగా ఎలుకల మందు మిశ్రమాన్ని రైతులకు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుంది అని, రైతులు అందరూ ఈ మందు మిశ్రమాన్ని తీసుకొని సామూహికంగా ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టాలని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో లు కె.శ్రీనివాసు కె.ఎం.భాస్కర్ రెడ్డి వీవీఏలు, రైతులు పాల్గొనడం జరిగింది.

# కోనసీమ కొబ్బరి రైతులను ఆదుకోవాలి

### -కొబ్బరి ఉప ఉత్పత్తుల కేంద్రాలను ఏర్పాటుచేయాలి- అసెంబ్లీలో ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, ఆగస్టు 18, (ప్రభాతవార్త)** కోనసీమ కొబ్బరి రైతులను ఆదుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శాసనసభ వేదికగా గళమెత్తారు కోనసీమలో కొబ్బరి తోటల ప్రాధాన్యత రాష్ట్రమంతా తెలుసన్నారు సరైన ఆదాయం లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు కొబ్బరి తోటల పునరుజ్జీవనానికి సహాయ సహకారాలు అందిస్తున్నామని మంత్రివర్యులు తెలిపారని రైతులను పూర్తిగా ఆదుకుంటే కానీ వారు నిలదొక్కుకునే పరిస్థితి లేదన్నారు కోనసీమను ప్రత్యేక దృష్టితో పరిగణించి కొబ్బరి ప్రాంతీయ కార్యాలయం కానీ, క్వాయర్ ప్రాంతీయ కార్యాలయం కానీ ఏర్పాటు చేయాలని కోరారు ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేయడంతో పాటు అంతర పంటల సాగు కోసం చేయూతనివ్వాలన్నారు కేంద్ర ప్రభుత్వం సైతం కొన్ని పథకాలు తీసుకుని వచ్చిందని వృద్ధాప్య దశకు వచ్చిన కొబ్బరి చెట్ల స్థానంలో కొత్త మొక్కలు నాటడానికి సహకారం అందిస్తున్నట్లు వ్యవసాయశాఖామంత్రి అచ్చెన్నాయుడు తెలిపారని దానితోపాటు ప్రత్యేకమైన దృష్టి సారించి కొబ్బరి రైతులను ఆదుకోవాలని సభాముఖంగా కోరారు కొబ్బరి ఉప ఉత్పత్తులు అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు ద్వారా కొబ్బరి ఉత్పత్తుల విలువ మరింత పెరిగేలా చూడాలని కోరారు కొబ్బరి రైతులను ప్రత్యేకంగా ఆదుకోవాలని కోరారు

# ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు ఆహ్వానం



**మామిడికుదురు.ఆగస్టు 18(ప్రభాతవార్త)** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం 2026-27 విద్యా సంవత్సరానికి గానూ 10వ తరగతి, ఇంటర్ ప్రవేశాల గడువును పొడిగించినట్లు మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిరంజీవిరావు తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా సెప్టెంబర్ 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాల కొరకు అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ భూపతి మనోహర్ రాజును సంప్రదించాలని సూచించారు.

# గంజాయి సేవిస్తే పుదుచ్చేరి జైలుకే



**యానాం, ఆగస్టు 18 (ప్రభాతవార్త)** యానాం నియోజకవర్గపరిధిలో కొంతమంది యువత గంజాయి సేవిస్తున్నారని ఎక్కువ పిర్యాదులు వస్తున్నాయని అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వారి ప్రవర్తన మార్చుకోకపోతే పుదుచ్చేరి జైలుకు పంపుతామని సిఐ డి సురేష్ బాబు హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవలి గంజాయిసేవిస్తున్నట్లు పిర్యాదులు వస్తుండటంలో అనుమానాస్పద ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి గట్టినిఘా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అదేవిధంగా పలువురు గంజాయితో పట్టుబడగా వారిపై సైతం కేసులు నమోదు చేసి అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. యువతకు గంజాయికి దూరంగా ఉండాలని వారి తల్లిదండ్రులు సైతం వారినీ ఒకకంటకనిపెడుతుండాలన్నారు. ఈ సమావేశం లో ఎస్సై కుమరన్, పోలీసులు పాల్గొన్నారు.

# మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి అడ్డతీగల సి.ఐ.గజేంద్రకుమార్



**అడ్డతీగల,ఆగస్టు 18, ప్రభాతవార్త** సమాజంలో ప్రతి మహిళా తమ రక్షణ కోసం ఉన్న చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అడ్డతీగల సర్కిల్ ఇన్ స్పెక్టర్ గజేంద్రకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక సంతను పురస్కరించుకుని ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో ప్రజలు, మహిళల కోసం ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా రక్షణ చట్టాలు, అత్యవసర సమయాల్లో శక్తి యాప్ ను ఏ విధంగా వినియోగించాలో సవివరంగా తెలియజేశారు. నేటి కాలంలో విపరీతంగా పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు సమర్పించవద్దని సూచించారు. వాహనదారులు ప్రయాణాల్లో తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. రహదారులపై పశువులను విడిచిపెట్టడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నందున, యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే గంజాయి వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, గంజాయిని రవాణా చేసినా లేదా విక్రయించినా కఠినమైన చట్టపరమైన శిక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, సంతకు వచ్చిన మహిళలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అడ్డతీగలలో రోడ్డుపైనే వైద్యం!

### -అనుమతులు లేకుండానే ఆర్ఎంపీల వైద్యం.. పట్టించుకోని అధికారులు-చిన్న జ్వరానికే యాంటీబయాటిక్స్, పెయిన్‌కిల్లర్లు, స్టెరాయిడ్లు గిరిజనుల ఆరోగ్యంతో చెలగాటం



**అడ్డతీగల, ఆగస్టు 18, ప్రభాతవార్త** అడ్డతీగల మండలంలో కొంతమంది ఆర్ఎంపీలు వైద్య నిబంధనలను పక్కనపెట్టి బహిరంగంగా వైద్యం నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల కేంద్రంలో వారపు సంత జరిగే రోజుల్లో రోడ్డుపక్కనే తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న ప్రదేశాల్లో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వైద్యం చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. తగిన వైద్య అనుమతులు, అర్హతలు లేకుండానే చికిత్సలు అందిస్తున్నారనే ఆరోపణలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. చిన్నపాటి జ్వరం, దగ్గు వంటి సాధారణ సమస్యలకు సైతం యాంటీబయాటిక్స్, పెయిన్‌కిల్లర్లు, స్టెరాయిడ్లను విచక్షణారహితంగా, మోతాదుకు మించి ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చిన్న పిల్లలకు కూడా ఇలాంటి మందులు ఇవ్వడం మరింత ఆందోళన కలిగిస్తోంది. దీనివల్ల తాత్కాలికంగా ఉపశమనం లభించినప్పటికీ, మందుల దుష్ప్రభావాలతో పరిస్థితి విషమించి ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. అడ్డతీగలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందుబాటులో ఉన్నప్పటికీ, కొంతమంది అమాయక గిరిజనులు అవగాహన లేక ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. తక్కువ ఖర్చుతో త్వరగా చికిత్స లభిస్తుందనే భావనతో వారి వద్దకు వెళ్తుండటంతో ఈ పరిస్థితిని కొందరు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. గతంలో కూడా ఆర్ఎంపీల వ్యవహారంపై రంపచోడవరం ఐటీడీఏ పీవో ఆధ్వర్యంలో సంబంధిత వ్యక్తులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు సమాచారం. వైద్య నిబంధనలకు విరుద్ధంగా చికిత్సలు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అప్పట్లో హెచ్చరించినప్పటికీ, పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. వైద్య రంగంలో అర్హతలు, అనుమతులు లేకుండా చికిత్సలు నిర్వహించడం ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలపై అవగాహన తక్కువగా ఉండటాన్ని ఆసరాగా చేసుకుని ఎవరికి వారు వైద్యం చేయడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. రోడ్డుపక్కన బహిరంగంగా వైద్యం నిర్వహిస్తున్న వారిపై సంబంధిత వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు తక్షణమే తనిఖీలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్నట్లు నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు.

# వి బి జి రామ్ జి పథకంపై అవగాహన సదస్సు




**బిక్కవోలు 18 ఆగస్టు ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయంలో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పంచసమ్మేళన్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎం.పి.పి., జెడ్.పి.టి.సి., ఎం.పి.టి.సి., గ్రామ స్పెషల్ ఆఫీసర్స్కి వి.బి.జి.రాం.జి పథకం (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అజీవికా మిషన్ (గ్రామీణ) పై అవగాహన కార్యక్రమం నిర్వహించడమైనది. కేంద్రప్రభుత్వం వికసిత్ భారత్ 2047 లో భాగంగా వి.బి.జి.రాం.జి ని రూపొందించడమైనది. దీనిలో భాగంగా జల భద్రత, గ్రామీణ మౌలిక వసతులు, గ్రామీణ జీవనోపాధులు,విపత్తు నిర్వహణ లలో 318 పనులు, అను నాలుగు ప్రధాన విభాగాలుగా నిర్వహించడం జరిగిందని అందులోవేతన శ్రామీకులకు 100 నుండి 125 రోజులకు పెంచడం,నిరుద్యోగ భృతి కల్పించడం,ఆలస్యం చెల్లింపులకు అపరాధరుసుముతో చెల్లించుట,నిధులు 60:40 రేషియేలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కేటాయింపు గురించి తెలియజేయడం జరిగినది ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు తేతలి సుమ, ఎం.పి.డి.ఓ., వీ.శ్రీనివాస్, డిప్యూటి ఎం.పి.డి.ఓ., జాన్ మిల్టన్, డిప్యూటి ఎం.పి.డి.ఓ., వై. మునీశ్వరరావు, మండల పరిషత్ పరిపాలన అధికారి వి.ఎన్.ప్రసాద్., గ్రామ స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు

# ఏకలవ్య పాఠశాలల్లో కమిటీ తీర్మానాలతో వస్తువుల కొనుగోలు



**రంపచోడవరం. మారేడుమిల్లి, ఆగస్టు 18: ప్రభాతవార్త.** ఏకలవ్య నమూనా గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన వస్తువులు, పరికరాలను కమిటీ తీర్మానాల మేరకు కొనుగోలు చేసుకోవచ్చని పోలవరం జిల్లా సంయుక్త కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి మారేడుమిల్లి గ్రామంలోని ఏకలవ్య నమూనా గురుకుల పాఠశాలలో అవసరమైన వస్తువులు, పరికరాల కొనుగోలుకు సంబంధించిన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంయుక్త కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఏకలవ్య పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన వస్తువులు, పరికరాలను కమిటీ తీర్మానాల మేరకు కొనుగోలు చేయాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సామగ్రిని నిబంధనల ప్రకారం సమకూర్చుకోవాలని తెలిపారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్ ప్రసాద్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎలక్ట్రిక్ ఆటోలను ప్రారంభించిన ఎమ్మెల్యే బత్తుల



**సీతానగరం, ఆగస్టు 18, (ప్రభాతవార్త):** మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఏడు ఎలక్ట్రిక్ ఆటోలను రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నివారణకు ఈ-వాహనాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. మండలంలో పారిశుధ్య నిర్వహణ సేవలను మరింత వేగవంతం చేసేందుకు ఇవి ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, నాటక అకాడమీ డైరెక్టర్ మద్దాల ఏసుపాదం, సొసైటీ చైర్మన్ మట్ట వెంకటేశ్వరరావు, కందికట్ల అరుణ కుమారి, ఎంపీడీవో ఎం.భారతి, తదితరులు పాల్గొన్నారు.

# కళాశాలకు కొత్త భవనం మంజూరు చేయాలి

### -పాడా పి. డి శివరామ ప్రసాద్,కు ఎస్. ఎఫ్. ఐ వినతి



**పిఠాపురం, ఆగస్టు 18 ( ప్రభాతవార్త)** పిఠాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలస్థితికి చేరుకుందని, విద్యార్థుల భద్రత ను దృష్టిలో ఉంచుకుని కొత్త భవనం మంజూరు చేయాలని, మంగళవారం పాడా ప్రాజెక్టు డైరెక్టర్ శివరామ ప్రసాద్ కు, భారత విద్యార్థి ఫెడరేషన్ వినతి పత్రం అందజేసింది. కళాశాలలో తరగతి గదుల కొరత కారణంగా విద్యార్థులు స్వేచ్ఛ వాతావరణం లో చదువుకోలేకపోతున్నారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో నాలుగు కొత్త తరగతి గదుల నిర్మాణానికి హామీ ఇచ్చినప్పటికీ, ఆచరణకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలలో మౌలిక వసతుల కొరత, తాగునీటి సమస్య, క్రీడా మైదానం ఆక్రమణలు వంటి సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కళాశాలకు చెందిన క్రీడామైదాన్ని ప్రైవేటు వ్యక్తులు పార్కింగ్ స్థలంగా ఉపయోగించుకుంటున్నారని దీనితో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారని తెలియజేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించడంతో విద్యార్థులంతా కళాశాల బయటనున్న " అన్నా క్యాంటీన్ "ను ఆశ్రయిస్తున్నారని వారు ఆరోపించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే విద్యార్థుల విద్యా ప్రమాణాలు దెబ్బతినడంతో పాటు ఉత్తీర్ణత శాతం తగ్గిపోయే ప్రమాదం ఉందని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పిఠాపురం ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కళాశాల సమస్యలను గుర్తించి, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు తేజశ్రీ, కరుణాకర్, విజయ్, నితిన్, అశోక్, సూరిబాబు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో కాంట్రాక్టు ఉద్యోగాలకు దరఖాస్తులు.



**తాళ్లరేవు ఆగస్టు 18 (ప్రభాతవార్త):** తాళ్లరేవు మండలంలోని పాఠశాలల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన బోధనా సిబ్బంది నియామకం కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాళ్లరేవు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పత్తిగొంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నీలపల్లి పాఠశాలల్లో సోషల్ సబ్జెక్టు బోధించేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సుంకరపాలెంలో లెక్కలు/గణితం బోధించేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఈ నెల 21వ తేదీ వరకు తాళ్లరేవు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో స్వీకరించనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు కాంట్రాక్ట్ ప్రాతిపదికన, నిర్దేశిత కాలపరిమితి (01.09.206 నుండి 30.04.2027) వరకు విధులు నిర్వహించాల్సి ఉంటుందని, నెలకు రూ.12,000 లు గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా టెట్ క్వాలిఫై అయి ఉండాలన్నారు.

# బహుజన వీరుడు, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు...

### -భారీ బైక్ ర్యాలీ పాల్గొన్న గౌడ యువత



**ఆత్రేయపురం, ఆగస్టు,18,(ప్రభాత వార్త)** బహుజన చక్రవర్తి, గోల్కొండ కోట ను ఏలిన వీరుడు,సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 376వ జయంతి వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెర్లపాలెం గ్రామంలో సెంటర్లో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి గౌడ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు జయంతి వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి పంచారు. ఈ సందర్భంగా గౌడ నాయకులు మాట్లాడుతూ సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు ఆయన అందించిన స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. పాపన్న గౌడ్ జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, ఆయన జయంతిని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని నాయకులు డిమాండ్ చేశారు. మహనీయుల చరిత్రను భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. జయంతి సందర్భంగా ఆత్రేయపురం మండలానికి చెందిన యువత పెద్ద సంఖ్యలో పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో ఉన్న పాపన్న గౌడ్ విగ్రహాలకు పాలాభిషేకాలు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంతో మెర్లపాలెం గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మిద్దె ఆదినారాయణ, మార్గని గంగాధర్, గుడేళ్ల నాగేంద్ర గౌడ్, వంక రామకృష్ణ గౌడ్, మట్టసాయి , మట్ట వెంకన్న, మట్ట శ్రీను, అయినవిల్లి నాగేంద్ర , ఉర్రింకల సుబ్రహ్మణ్యం గౌడ్,గౌడ సంఘ నాయకులు, పెద్దలు, యువతతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# అభయ ఆంజనేయ స్వామివారి 23వ వార్షికోత్సవం

### -హోమంలో స్వామివారి ప్రతిబింబం



**కె గంగవరం, ఆగస్టు 18, (ప్రభాతవార్త):** కే గంగవరం మండలం సుందరపల్లి గ్రామం గోదావరి నది తీరాన వేయించేసినటువంటి శ్రీ అభయ ఆంజనేయ స్వామివారి 23వ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో గ్రామ ప్రజలు,ఆలయ కమిటీ వారు ఘనంగా నిర్వహించారు. వేద పండితులు పెద్దింటి గోపాలకృష్ణమాచార్యులు, లక్ష్మణాచార్యులు,సుదర్శనం రామకృష్ణమాచార్యులు, తదితర ఆచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు హోమాలు, గంధ సింధూరం, తులసి, తమలపాకు పూజ నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన భారీ అన్నదాన కార్యక్రమం మధ్యాహ్నం 3 గంటల వరకు వచ్చిన వారికి లేదు అనకుండా కొనసాగుతూనే ఉన్నదని ఆలయ కమిటీ వారు తెలిపారు. గ్రామ,చుట్టుపక్కల ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పూర్ణాహుతి అనంతరం తీసినటువంటి ఫోటోలో హోమంలో స్వామివారి ప్రతిబింబం కనిపించడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది.

# 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు కావాలి



**రంపచోడవరం, ఆగస్టు 18: ప్రభాతవార్త.** పోలవరం జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువతీ యువకులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 399 పోలింగ్ కేంద్రాలకు బీఎల్‌వోలను నియమించామని, కొత్త ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ అని తెలిపారు. మ్యాపింగ్ కాని 8,514 మంది ఓటర్లను గుర్తించామని, 16,182 మందికి నోటీసులు జనరేట్ చేసి 15,537 మందికి జారీ చేసినట్లు చెప్పారు. మిగిలిన 645 నోటీసులను త్వరలో జారీ చేస్తామన్నారు. మృతులు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు ఓటరు జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు. అక్టోబరు చివరి నాటికి ఓటరు జాబితా ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎన్నికల సంఘం నిబంధనలను రాజకీయ పార్టీలు పాటించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

# బీఎస్ఎన్ఎల్ కేబుల్ రక్షణ లేదు.. కేబుళ్లే లక్ష్యంగా..

### -కడియంలో కేటుగాళ్ల తవ్వకాలు.



**కడియం, ఆగస్టు 18 ( ప్రభాతవార్త)** ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌కు చెందిన కేబుళ్లకు కడియం మండల కేంద్రంలో రక్షణ లేకుండా పోతోంది. కడియం-- ద్వారపూడి ప్రధాన రహదారి పక్కన ఉన్న బీఎస్ఎన్ఎల్ కేబుళ్లను గుర్తుతెలియని వ్యక్తులు తరచూ లక్ష్యంగా చేసుకుని చోరీ చేయడంపై ఆందోళన నెలకొంది. మండల కేంద్రం కడియం కెనరా బ్యాంకు ఎదురుగా సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కేబుల్ కోసం తవ్వకాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న బీఎస్ఎన్ఎల్ అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకునేలోపే నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ప్రాంతంలో గతంలోనూ కేబుళ్ల చోరీకి సంబంధించిన ఘటనలు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. కేబుళ్ల చోరీకి గురైన ప్రతిసారీ బీఎస్ఎన్ఎల్ అధికారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం పరిపాటిగా మారిందని పేర్కొంటున్నారు. గతంలో ఇతర నెట్‌వర్క్‌లకు చెందిన కేబుళ్లు కూడా ఇదే తరహాలో చోరీకి గురైన సందర్భాలున్నాయి. నిత్యం వందలాది వాహనాలు, ప్రజలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారి పక్కనే అనుమతులు లేకుండా తవ్వకాలు జరుగుతున్నా పర్యవేక్షణ కొరవడటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోని బ్యాంకులకు నిత్యం వచ్చే ఖాతాదారులు, సిబ్బంది సైతం తవ్వకాలను గమనించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బీఎస్ఎన్ఎల్ కేబుళ్లకు పటిష్టమైన రక్షణ కల్పించడంతో పాటు, అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆకుల వెంకన్నకు మాజీ ఎమ్మెల్యే పొన్నాడ పరామర్శ.



**తాళ్లరేవు, ఆగస్టు 18 (ప్రభాతవార్త):** ఇటీవల గుండె శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైకాపా తాళ్లరేవు గ్రామ కమిటీ మాజీ అధ్యక్షులు ఆకుల వెంకన్నను ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా మంగళవారం రంగనాయక పురం లోని వెంకన్న ఇంటికి స్థానిక జడ్పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, మండల పార్టీ అధ్యక్షులు కాదా గోవింద కుమార్, కాటం శెట్టి రామ్మూర్తిలతో కలసి వచ్చి వెంకన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వల్లభనేని దొరబాబు, పోలేకుర్రు మాజీ సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, బొంతు మోహన్, పొన్నాడ బైరవమూర్తి, అద్దంకి లక్ష్మీనారాయణ, వినకోటి రామకృష్ణ, కొల్లు శ్రీను, నేల శ్రీను పాల్గొన్నారు.


# కూటమి ప్రభుత్వం 2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం

### -క్లస్టర్ ఇంచార్జ్ కంఠం శెట్టి




**కొత్తపేట,ఆగస్టు18, (ప్రభాతవార్త)** రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఏ ఏం సి ఉపాధ్యక్షుడు క్లస్టర్ 6 ఇంచార్జ్ కంఠం శెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యూనిట్ 27 ఇంచార్జ్ యల్లమెల్లి జగన్ మోహన్ పర్యవేక్షణలో 138 బూత్ లో(100%)వంద శాతం డోర్ డోర్ కార్యక్రమం పూర్తి చేసిన సందర్భంగా బూత్ ఇంచార్జ్ కొప్పిశెట్టి శ్రీరామ్ ను సన్మానం చేసి సత్కారం చేశారుఈ కార్యక్రమం లో క్లస్టర్ కో ఇంచార్జ్ బూసి భాస్కర్ రావు యూనిట్ కో ఇంచార్జ్ బీర ఇశాక్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కదలి భీమేశ్వరరావు 139 బూత్ కన్వీనర్ మండేపూడి శ్రీను 136బూత్ పోలిశెట్టి శ్రీను అన్యం మునేశ్వరావు 138బూత్ కో కన్వీనర్ ఎల్ పితాని బేతల స్వామి మట్టపర్తి నవీన్ పులిదిండి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

# కాలువలో ఈతలకు వెళ్లి ప్రమాదాలకు గురికావద్దు




**గండేపల్లి. ఆగస్టు 18. ప్రభాతవార్త** మురారి గ్రామ పంట కాలువలో ఈత కొట్టడం పై నిషేధం -- పోలీసుల హెచ్చరిక మురారి గ్రామ శివారులోని పంట పొలాల్లో ఉన్న పంట కాలువలో కొందరు యువకులు ఈత కొట్టుటకు బాగున్నది అని యూట్యూబ్, ఇన్స్టాగ్రామ్ లో పెట్టినందున కొందరు యువకులు ఈత కొడుతున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. ఈ కాలువ చాలా లోతుగా మరియు అత్యంత ప్రమాదకరంగా ఉన్నందున, ఈత రాని వారు అందులో దిగి మునిగిపోయే ప్రమాదం ఉంది. ప్రజల భద్రతను దృష్ట్యా ఆ ప్రదేశంలో ఈత కొట్టడాన్ని అధికారులు తీవ్రంగా నిషేధించారు. కావున ఎవరూ కూడా సదరు పంట కాలువలో ఈత కొట్టడానికి వెళ్లరాదని తెలియజేయడమైనది. అధికారుల ఆదేశాలను అతిక్రమించి కాలువలోకి దిగినా లేదా ఈత కొట్టినా అట్టి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించడమైనది.

# పెద్దింటి రామం కు ఆస్కార్ బుక్ ఆఫ్ రికార్డ్




**కొత్తపేట, ఆగస్టు 18, (ప్రభాతవార్త)** కొత్తపేట కి చెందిన ప్రముఖ పురోహితులు రికార్డుల మాంత్రికుడు డాక్టర్ పెద్దింటి రామచంద్ర శ్రీహరి అలియాస్ రామం తనకు ఆస్కార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ వచ్చినట్లు తెలిపారు గతంలో 8 లక్షలు బియ్యం గింజలు పై 8 లక్షలు జాతీయ జెండాలను చిత్రీకరణ ను గుర్తించి ఆస్కార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో నమోదు చేసి ఆన్లైన్ ద్వారా సర్టిఫికెట్ అందచేసారని డాక్టర్ రామం తెలి తెలిసిందే ఆయనకు రికార్డు రావడం పట్ల కొత్తపేట చెందిన కవులు కళాకారులు అభినందనలు తెలిపారు

మరిన్ని వార్తలు 6లో

## ఆదిత్య విశ్వవిద్యాలయంలో "ఒరాకిల్ క్లౌడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌పై శిక్షణ కార్యక్రమం



**గండేపల్లి. ఆగస్టు 18. ప్రభాతవార్త** సూరంపాలెం: ఆదిత్య యూనివర్సిటీలోని ఆదిత్య లెర్నింగ్ అకాడమీ మరియు కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో "ఒరాకిల్ క్లౌడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ : జెనరేటివ్ ఏఐ సొల్యూషన్స్ ఆర్కిటెక్ట్ మరియు సర్వీసెస్" అనే ఆధునిక అంశంపై ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సును ప్రారంభించినట్లు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, అధ్యాపకులకు ఆధునిక క్లౌడ్ కంప్యూటింగ్ మరియు జనరేటివ్ ఏఐ సాంకేతిక తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ వి. వైతేశ్వరన్ రిసోర్స్ పర్సన్‌గా హాజరై ఒరాకిల్ క్లౌడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, జెనరేటివ్ ఏఐ సొల్యూషన్స్ మరియు సర్వీసెస్ సంబంధించిన అంశాలపై విలువైన అవగాహన కల్పించారు. క్లౌడ్ ఆధారిత సాంకేతికతలు, జనరేటివ్ ఏఐ పరిష్కారాల రూపకల్పన, వాటి సేవలు మరియు ఆధునిక సాంకేతిక రంగంలో వాటి ప్రాధాన్యత ను వివరించారు.జనరేటివ్ ఏఐ ఆధారిత పరిష్కారాలను క్లౌడ్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా అభివృద్ధి చేయడంలో అవసరమైన సాంకేతిక అంశాలపై రిసోర్స్ పర్సన్ వివరించారు. అలాగే మారుతున్న పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు క్లౌడ్ కంప్యూటింగ్, జనరేటివ్ ఏఐ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.ఈ కార్యక్రమానికి ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్లు డాక్టర్ ఐ వీరాంజనేయులు, అల్లం బాలాజీ వంశీ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎం బి శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడెమిక్స్) డాక్టర్ ఎస్ రమాశ్రీ, ప్రో వైస్ ఛాన్సలర్ (ఇంజనీరింగ్, సైన్సెస్) డాక్టర్ ఎ రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి సురేష్, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం వి రాజేష్ మరియు కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగం హెడ్ డాక్టర్ ఎస్ రమేష్ పాల్గొన్నారు.

## వీధి వ్యాపారులకు అన్యాయం జరగకుండా జోన్లు గుర్తింపు
### -కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 18( ప్రభాతవార్త)** వీధి వ్యాపారులకు అన్యాయం జరగకుండా నిబంధనల మేరకు జోన్లు గుర్తింపు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో టౌన్ వెండింగ్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి వ్యాపారస్తుల చట్టం ప్రకారం పట్టణ ప్రణాళిక మెప్మా సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి రెడ్ ,యంబర్ జోన్ గ్రీన్ జోన్లను గుర్తించినట్లు చెప్పారు. నగర పరిధిలోని వీధులన్నీ జోన్ వారీగా విభజించి నివేదికను సిద్ధం చేసుకున్నట్లు వివరించారు. విద్యాసంస్థలు, వైద్యశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, జంక్షన్ లో ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాలను రెడ్ జోన్ గా ప్రకటించినట్లు తెలిపారు. నిర్దేశిత సమయాల నిర్దేశిత రోజులలో వ్యాపారాలు చేసుకుని ప్రాంతాలను యాంబర్ జోన్లుగా మిగతా ప్రాంతాలను గ్రీన్ జోన్లుగా ప్రతిపాదించడం జరిగిందని వివరించారు. మొత్తం నగర పరిధిలో 62 గ్రీన్ 26 యాం బర్ 58 రెడ్జోన్లుగా గుర్తించినట్లు వెల్లడించారు. రెడ్ జోన్లకు సంబంధించి అభ్యంతరాలు ఉన్నట్లయితే అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి తెలియజేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇప్పించి వారి జీవనోపాధికి ఎటువంటి నష్టం వాటిల్లకుండా ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి సి ఎం ఓ రామలక్ష్మి సానిటరీ సూపర్వైజర్ శ్రీనివాస్ (ట్రాఫిక్ ఎస్ఐ పి శ్రీనివాసరావు టౌన్ వెండింగ్ కమిటీ ప్రెసిడెంట్ సత్యనారాయణ ఎన్జీవో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీ ఆకస్మిక తనిఖీ
### -అధికారుల గైర్హాజరుపై తీవ్ర ఆగ్రహం!



**గొల్లప్రోలు, ఆగస్టు 18(ప్రభాతవార్త):** కాకినాడ పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్ మంగళవారం గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయానికి వచ్చిన్న రైతులు,ప్రజల ఇబ్బందులు, అధికారుల నిర్లక్ష్యంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. ఈ ఆకస్మిక తనిఖీకి సంబంధించిన పూర్తి వివరాలు పరిశీలిస్తే ఎంపీ ఉదయ శ్రీనివాస్ కాకినాడ నుండి చేబ్రోలు పట్టు పరిశ్రమ కేంద్రానికి వెళుతుండగా మార్గమధ్యంలో గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద భారీగా రైతులు, ప్రజలు ఉండటాన్ని గమనించారు. దీంతో ఆయన ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి కారు దిగి నేరుగా రెవెన్యూ కార్యాలయంలోకి వెళ్లారు.ఎంపీ కార్యాలయంలోకి వెళ్లే సమయానికి ఒక విలేజ్ సర్వేయర్,మరో అధికారి, డేటా ఆపరేటర్,జూనియర్ అసిస్టెంట్ విధుల్లో ఉన్నారు.ముఖ్య అధికారులెవరూ సీట్లలో లేకపోవడంతో ఎంపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.అటెండెన్స్ రిజిస్టర్ను తెప్పించుకుని పరిశీలించగా ఆఫీసులో లేని అధికారులు సంతకాలు చేసి ఉండటాన్ని గమనించిన ఎంపీ అధికారుల విధులకు వచ్చారా లేదా అని ఆరా తీశారు.ఈ సందర్భంగా పలువురు రైతులు రీ సర్వేలో తలెత్తిన తప్పులను సరిచేసుకునేందుకు నెలలు తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పనులు జరగడం లేదని ఎంపీ వద్ద వాపోయారు. మ్యుటేషన్,సర్వే దరఖాస్తులు,సబ్ డివిజన్ ఫైళ్లు గడువు దాటినా ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు.ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు,విద్యార్థులకు అవసరమైన వివిధ ధ్రువీకరణ పత్రాలను పెండింగ్‌లో పెట్టడంపై మండిపడ్డారు.గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను సరిచేయించుకోవడానికి రైతులు ఆఫీసు చుట్టూ తిరగాల్సి వస్తుందని నిలదీశారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల దరఖాస్తులను తక్షణమే క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు.ఇది డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నియోజకవర్గమని గుర్తు చేశారు.పిఠాపురం నియోజకవర్గ పరిధిలో అధికారులు మరింత బాధ్యతగా, పారదర్శకంగా పనిచేయాలని హితవు పలికారు.రైతులను ఆఫీసుల చుట్టూ తిప్పించుకున్నా పనులు కోసం లంచాలు డిమాండ్ చేసిన వర్గాలు ఉంటాయని హెచ్చరించారు.గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవల కొంతమంది వీఆర్వోలు ఆ పై అధికారి రైతుల రీ సర్వే తప్పులను సరిదిద్దేందుకు రైతుల వద్ద సొమ్ములు డిమాండ్ చేస్తున్నారని ఎంపీ కి ఫిర్యాదులు అందడంతోనే ఆయన ఈ మెరుపు తనిఖీ చేపట్టినట్లు తెలుస్తోంది. మునుపెన్నడూ లేని విధంగా ఎంపీ నేరుగా తహసీల్దార్ కార్యాలయంలోకి వెళ్లి సుమారు గంటకు పైగా తనిఖీలు చేపట్టడం గొల్లప్రోలులో సంచలనం మారింది.-ప్రజలతో ఆప్యాయంగా ముచ్చటించిన ఎంపీ తహసీల్దార్ కార్యాలయం తనిఖీ ముగించుకుని అనంతరం కార్యాలయం బయట రామ కోవెల వద్ద వేచి ఉన్న ప్రజలను,సీనియర్ సిటిజెన్స్ ను ఎంపీ ఉదయ్ ఆప్యాయంగా పలకరించారు.వారి వద్ద కొంతసేపు కూర్చున్న ఎంపీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## ఘనంగా ప్రారంభమైన శ్రీ ప్రకాష్ 50 వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



**తుని, ఆగస్టు 18,( ప్రభాతవార్త )** శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలు 49 వసంతాలు పూర్తి చేసుకొని 50 వ వసంతం లోకి అడుగుడితున్న శుభ సందర్భంలో 50 వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.ఈ వేడుకల నందు గాతా రహే మేరా దిల్ పేరిట పాటల పోటీలు నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలకు చెందిన తుని, పాయకరావుపేట, అన్నవరం, పెద్దాపురం, కాకినాడ, రాజమహేంద్రవరం పాఠశాలల విద్యార్థులకు మొదటి రోజు జరిగిన ఈ పోటీలలో విద్యార్థులు ఆలపించిన గీతాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. గెలుపొందిన విద్యార్థులు రెండవరోజు జరిగే ఫైనల్స్ లో పాల్గొననున్నారు. విద్యార్థుల్లో ఉన్న ఔత్సాహిక గాయనీ, గాయకులను వెలికితీయాలన్న లక్ష్యంతో గాతా రహే మేరా దిల్ కార్యక్రమం ప్రతీ ఏటా నిర్వహిస్తున్నామని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ తెలిపారు. విద్యార్థులు మధురమైన పాటలు, ఆ పాటల భావాలను ఆస్వాదించాలనే ఉద్దేశంతో ఈ పోటీలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. రెండవ రోజు జరగనున్న గాతా రహే మేరా దిల్ ఫైనల్స్ కార్యక్రమానికి ప్రముఖ సినీ నేపథ్య గాయని ఎస్.పి.శైలజ ముఖ్య అతిధి గా హాజరవుతున్నారని, మెగా రక్తదాన శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా విచ్చేసిన నేపథ్య గాయని ఎ.శైలజ, ప్రముఖ కీ బోర్డు ప్లేయర్ ఇమ్మానుయేల్ మాట్లాడుతూ నేటి పోటి ప్రపంచంలో కొంతమంది తల్లిదండ్రులు కేవలం చదువులకి మాత్రమే ప్రాధాన్యమిస్తున్నారన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని, వారి సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు పట్టుదలతో సాధన చేస్తే తాము అనుకున్న లక్ష్యాలను కోరుకున్న స్థానాన్ని పొందడానికి నేడు ఉన్న పరిస్థితులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరిన్ని అవకాశాలు వస్తున్నాయని, వాటిని వినియోగించుకోవడానికి కాలానుగుణంగా వారి ప్రతిభా పాటవాలను మెరుగుపరుచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు పాటల పోటీల్లో తమ మధురమైన గానాలతో అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలకు చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తుని- పాయకరావుపేటకు చెందిన పలువురు ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వర స్వామి ఆలయానికి మల్లాడి రాజేంద్ర వెండి బహుకరణ.....



**కాకినాడ రూరల్ ,ఆగస్టు 18 ప్రభాతవార్త:** కాకినాడ సిటీ జనసేన పార్టీ సీనియర్ నాయకులు మల్లాడి రాజేంద్రప్రసాద్ ,కనకదుర్గ దంపతులు 36 వ వార్డు దుగ్గిరాలవారి వీదిలో గల విఘ్నేశ్వర స్వామి ఆలయానికి సుమారు రూ.48 వేల రూపాయలు విలువ గల 200 గ్రాముల వెండి ఆలయ ధర్మకర్తలకు బహుకరించారు. సదరు వెండిని అమ్మవారి రజిత చీర తయారీలో వినియోగించవలసిందిగా మల్లాడి రాజేంద్రప్రసాద్ దంపతులు కోరినట్లు ఆలయ కమిటీ కార్యదర్శి నల్లూరి శ్రీనివాస్ తెలిపారు .ఈ సందర్భంగా మల్లాడి రాజేంద్రప్రసాద్ దంపతులను ఆలయ మర్యాదలతో శాలువాతో సత్కరించి స్వామి అమ్మవార్ల తీర్ద ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు నల్లమిల్లి వెంకటరెడ్డి, ట్రెజరర్ మండవిల్లి వెంకన్నబాబు , జాయింట్ సెక్రటరీ నున్న ఈశ్వరరావు, అన్నదాన విభాగం ఆర్గనైజర్ అమలకంటి సూర్య ప్రకాష్ , సభ్యులు నాగం సుబ్బారావు,సాధనాల శ్రీనివాస్ , సాలగ్రామ సర్వేశ్వర రావు ,చిల్లా రమణా రెడ్డి, మిడిమళ్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు

## వ్యసనాలకు దూరంగా.. ధ్యానానికి చేరువగా



**గోపాలాపురం, ఆగష్టు 18 (ప్రభాతవార్త):** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ప్రజాహిత బ్రహ్మకుమారి ఉమాదేవి సూచించారు. గోపాలపురం జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ రామలక్ష్మీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలు, వ్యసనాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ధ్యానం ద్వారా మనసుకు ప్రశాంతత చేకూరడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని ఉమాదేవి తెలిపారు. ఆరోగ్యవంతమైన యువత సమాజానికి ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో నడుచుకుంటూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రిన్సిపల్ రామలక్ష్మీదేవికి ప్రశంసాపత్రం అందజేశారు. అధ్యాపకులు రత్నకుమారి, శ్రీనివాసరావు, తిరుపతయ్య, సునీల్, సుమలతతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మానవ హక్కుల పరిరక్షణే లక్ష్యం: మాణిక్యం




**గోపాలపురం, ఆగస్టు 18 (ప్రభాతవార్త):** ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ తూ.గో జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోపాలపురం మండలం, వాదాలకుంట గ్రామానికి చెందిన కొడమంచిలి మాణిక్యం నియమితులయ్యారు. కొవ్వూరు మండలం, పసివేదలలో నిర్వహించిన ఆంధ్ర రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కల్పించడంతో పాటు మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని మాణిక్యం తెలిపారు. అవినీతి నిరోధక చట్టం, వినియోగదారుల హక్కులు, పోక్సో చట్టం, సమాచార హక్కు చట్టం, బ్యాంకింగ్ లావాదేవీలు, పోలీస్ స్టేషన్లలో పౌర సేవలు తదితర అంశాలపై ప్రజలకు అండగా నిలుస్తామన్నారు. జాతీయ డైరెక్టర్ డి.సురేష్ కుమార్, డాక్టర్ ఫిలోమినా, మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి బిషప్ జోసెఫ్ కైకారపు, ఆంధ్ర రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసన్నరాజు పాల్గొన్నారు.

## జూడోల ధర్నా.. అత్యవసర సేవలు నిలిపివేత
### -పుష్కర్‌ఘాట్ వద్ద నిరసన.. డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి



**రాజమహేంద్రవరం అర్బన్: ఆగస్టు 18 (ప్రభాతవార్త)** గవర్నమెంట్ మెడికల్ కాలేజీకి చెందిన పీజీ వైద్య విద్యార్థులు, రెసిడెంట్ డాక్టర్లు, ఇంటర్న్ సర్జన్లు రాజమహేంద్రవరంలోని ప్రధాన కూడలి పుష్కర్‌ఘాట్ వద్ద ధర్నాకు దిగారు. తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ జూడోలు నినాదాలు చేశారు. జూడోల నిరసనతో నగరంలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర సేవలను నిలిపివేసి నిరసన చేపట్టిన జూడోలు.. ప్రభుత్వం దిగివచ్చి తమ న్యాయమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ నరేంద్ర, డాక్టర్ షేక్ అమీర్ ఆధ్వర్యంలో జూడోలు ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా జూడోలు ప్రధానంగా రెండు డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. ప్రభుత్వం మూడు శాతం పెంపు ఇస్తామని ప్రకటించినప్పటికీ, తమకు 15 శాతం పెంపు ఇవ్వాలని మొదటి డిమాండ్ చేశారు. అలాగే వయోపరిమితిని గతంలో ఉన్న విధంగానే కొనసాగించాలని రెండో డిమాండ్‌గా పేర్కొన్నారు.తమ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి వైద్య విద్యార్థులు, రెసిడెంట్ డాక్టర్లకు న్యాయం చేయాలని జూడోలు కోరారు. డిమాండ్లు పరిష్కారం కాకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## యువత గంజాయి జోలికి వెళ్లకండి. ఎస్. ఐ. చినబాబు



**రాజవొమ్మంగి, ఆగస్టు 18, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం కొమరాపురం గ్రామంలో మంగళవారం సాయంత్రం జడ్డంగి ఎస్. ఐ. చినబాబు గ్రామస్తులకు గంజాయి వల్ల వచ్చే అనర్థాలపై అవగాహనను కల్పించారు. ఈసందర్భంగా ఎస్. ఐ. చినబాబు మాట్లాడుతూ గంజాయి, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి సాగు, అమ్మకం, రవాణా, సహకరించడం నేరమన్నారు. గంజాయితో పట్టుబడి జైలుకు వెళితే కుటుంబ చిన్నాభిన్నం అవుతుందన్నారు. గంజాయి సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ కు కాని, ఎస్. ఐ. జడ్డంగి 9440900766, సి. ఐ. రాజవొమ్మంగి 9440900764 కు ఫోన్ చేసి తెలుపవచ్చునని అన్నారు. సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు. మహిళా చట్టాలు, శక్తి యాప్, రోడ్డు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈకార్యక్రమంలో ఎస్. ఐ చినబాబు, హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు, ఏ. పి. ఎస్. పి. సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## వట్టిగడ్డలో అగ్ని ప్రమాదం..
### -తాటాకు ఇల్లు దగ్ధం.. రూ. 2.20 లక్షలు ఆస్తి నష్టం



**రాజవొమ్మంగి, ఆగస్టు 18, ప్రభాత వార్త** రాజవొమ్మంగి మండలం వట్టిగడ్డ గ్రామానికి చెందిన కోడూరి కొండమ్మకు చెందిన తాటాకు ఇల్లు దగ్ధం కావడంతో రెండు కుటుంబాల వారు కట్టుబట్టలతో మిగిలారు. వీఆర్వో భారతి తెలిపిన ప్రాదమిక సమాచార వివరాలు ఇలా ఉన్నాయి. వట్టిగడ్డ గ్రామానికి చెందిన మర్రి సాంబమూర్తి తాటాకు ఇల్లు ఇటీవల ఆకస్మికంగా అగ్ని ప్రమాదానికి గురై సర్వం కాలిపోవడంతో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, భర్త, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు యం. విజయ్ భాస్కర్ లు రూ. 1లక్ష నగదు సహాయాన్ని ఇచ్చారు. ఇల్లు లేని సాంబమూర్తి కుటుంబానికి కోడూరి కొండమ్మ ఆశ్రయం ఇచ్చింది. సాంబమూర్తి కుమార్తె పద్మ తల్లిదండ్రులు వద్దే ఉంటుందనే కోపంతో అల్లుడు ఇంటికి నిప్పు పెట్టి ఉండవచ్చునని కుటుంబ సభ్యులు, స్థానికులు అనుమానం వ్యక్తం చేసారని ఆర్. ఐ. శాంతకుమారి, వీఆర్వో భారతిలు అన్నారు. ప్రమాద ప్రాంతాన్ని రెవిన్యూ ఇన్ స్పెక్టర్ శాంతకుమారి, వీఆర్వో భారతి లు సంయుక్తంగా పరిశీలించారు. తక్షణ ప్రభుత్వ సహాయంలో భాగంగా 30 కిలోలు బియ్యం, నూనె, పంచదార, పప్పు, ఉప్పును అందించారు. ఈ ప్రమాదంలో సాంబమూర్తి నగదు రూ. 70 వేలు, బంగారం, తో బాటు 2.లక్షల 20 వేలు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేసామని వీఆర్వో భారతి అన్నారు.

## రాజవొమ్మంగి యం. ఇ. ఓ ని సన్మానించిన ఉపాధ్యాయులు



**రాజవొమ్మంగి, ఆగస్టు 18, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండల విద్యాశాఖాధి కారి కె. వి. వి. సత్య నారాయణ దొర ను మంగళవారం యం.ఇ. ఓ. కార్యాలయంలో అమీనాబాద్ కాంప్లెక్స్ ప్రధానో పాధ్యాయులు కొప్పు విక్టోరియా ప్రమీలారాణి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆగస్టు 15 తేదీన పోలవరం జిల్లా కేంద్రమైన రంపచోదవరంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఉత్తమ సేవా పత్రాన్ని అందించి అభినందించడం జరిగింది. ఈనేపథ్యంలో అమినాబాద్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు యం. ఇ. ఓ. కె. వి. వి. సత్యనారాయణ దొరను శాలువా కప్పి సత్కరించారు. ఈకార్యక్రమంలో యం. ఇ. ఓ. 2 టి. సూరయ్యరెడ్డి, హెచ్. యం. విక్టోరియా ప్రమీలారాణి, మఠం శేఖర్ బాబు, చదల మల్లేశ్వరరావు, ఆవూరి చిన్నమ్మాయి, కుమారి, కోటం మంగాదేవి, విజయ కుమారి, సిఆర్పీలు ఆదినారాయణరెడ్డి, మంగరాజు, సతీష్, శ్రీనివాస్, సిబ్బంది సుజాత, ఉష, ఏసుబాబు పాల్గొన్నారు.

## యువతకు సామాజిక బాధ్యత ఎంతో అవసరం...
### -ఎస్సై రవి చంద్రకుమార్



**బిక్కవోలు 18 ఆగస్టు ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం అరికరేవుల గ్రామంలో మంగళవారం యువతతో "కనెక్ట్ యూత్" కార్యక్రమం బిక్కవోలు ఎస్సై రవిచంద్ర కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు బిక్కవోలు మండలం ఆరికరేవుల గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం యువతను పోలీస్ శాఖకు మరింత సేరువ చేయాలనే లక్ష్యంతో వారి సమస్యలను తెలుసుకోవడం చట్టాలు మరియు సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యంగా నిర్వహించామన్నారు యువతతో ముఖాముఖి మాట్లాడి విద్యా ఉద్యోగ అవకాశాలు భవిష్యత్తు లక్ష్యాలు యువతను అడిగి వారికి సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు అంతేకాకుండా యువత చెడు వ్యసనాలకు మాదకద్రవ్యాలకు అసాంఘిక కార్యకలాపాలకు అలాగే డ్రగ్స్, గంజాయి, ఆన్‌లైన్ బెట్టింగ్, సైబర్ నేరాలు, సోషల్ మీడియా దుర్వినియోగం వంటి అంశాలపై యువతకు అవగాహన కల్పించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, తెలియని లింకులు, ఫోన్ కాల్స్, మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన అంశాలపై కూడా అవగాహన కల్పిస్తూ, ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖకు ప్రజలు, ముఖ్యంగా యువత సహకరించాలని ఎస్ఐ రవి చంద్ర కుమార్ కోరారు. యువత తమ ప్రతిభను సద్వినియోగం చేసుకొని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది యువత, గ్రామస్థులు, గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తాళాలు లేకుండా.. తనఖీ చేయకుండా..




**యు.కొత్తపల్లి, ఆగస్టు 18(ప్రభాతవార్త) :** కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం ఉప్పాడలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల భాగస్వామ్యంతో ప్రారంభించిన మహిళా మార్టు మూతపడింది. మండల సమాఖ్య రూ.10లక్షలు, మత్స్యకార సమాఖ్య రూ. 10లక్షలు, మండల మహిళా సంఘాల సభ్యుల నుంచి సుమారు రూ. 42లక్షలు పైగా సొమ్ములతో ప్రారంభించారు. అనంతరం మూతపడిన మార్టు ఆర్థిక లావాదేవీలకు సంబంధించి సొమ్ములు ఏమయ్యాయనేది నేటికి ప్రశ్నలుగానే మిగిలిపోయాయి. ఆర్థిక లావాదేవీలకు సంబంధిత అధికారులు ఎన్ని విచారణలు నిర్వహించినా అవి గోప్యంగానే జరుగుతున్నాయి. అయితే మంగళవారం వెలుగు ఏపీడీ జిలానీ మార్టు తనిఖీకి విచ్చేశారు. కాని తనిఖీ చేయకుండానే వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ విషయంపై ఇంచార్జి ఏపీఎం ప్రశాంతిని వివరణ కోరగా ఈ మార్టుకు పిఠాపురానికి చెందిన ఒక వ్యాపారి సరుకులు సరఫరా చేయడం జరిగిందని, తనకు ఆ సొమ్ము అందలేదని సోమవారం పీజీఆర్ఎస్ లో పిర్యాదు చేయడం జరిగింది. దీంతో ఏపీడీ మహిళా మార్టు తనిఖీకి విచ్చేశారు. అయితే తాళాలు ఉన్న సిబ్బంది అందుబాటులో లేరని చెప్పడంతో ఆయన వెనుదిరిగి వెళ్లిపోయారని తెలిపారు.

### శాంతి భద్రతల సమస్యల పేరుతో
## వైసిపి కార్యక్రమాలు అడ్డుకోవడం దారుణం
### మాజీ ఎంపీ భరత్ రామ్



**రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 18 (ప్రభాతవార్త)** రాజమహేంద్రవరం నగరంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించే కార్యక్రమాలను శాంతి భద్రతల సమస్య పేరుతో పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నించడం దారుణమని మాజీ పార్లమెంట్ సభ్యులు వైసిపి జాతీయ అధికార ప్రతినిధి మార్గాన్ని భరత్ రామ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరైనా ఏ పార్టీలోనైనా చేరే హక్కు ఉందని టిడిపి నుంచి తమ పార్టీ సిద్ధాంతాలు ఆశయాలు నచ్చి వచ్చి చేరితే నష్టమేంటని ప్రశ్నించారు. 40వ డివిజన్లో మూడుసార్లు వైసిపి తలపెట్టిన కార్యక్రమాలను అడ్డుకున్నారని ఇకపై అడ్డుకున్న ఆగేది లేదని ఎట్టి పరిస్థితుల్లోనూ చేరికల కార్యక్రమం జరిగి తీరుతుందని చెప్పారు. ఈనెల 19వ తేదీన మాజీ ఎంపీ భరత్ రామ్ ఆధ్వర్యంలో 41 డివిజన్ పరిధిలోని చింతాలమ్మ ఘాట్ రోడ్డు ఆంజనేయస్వామి గుడి వద్ద పార్టీ నాయకులు కార్యకర్తలు సమావేశం టిడిపి నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి భారీ సంఖ్యలో చేరికలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు దేనికి పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఆయన 3 టౌన్ పోలీస్ స్టేషన్ కి వెళ్లి పోలీసులు నిలదీశారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని అనుమానం ఉంటే ఆ వ్యక్తులను అరెస్టు చేసి స్టేషన్లో కూర్చోబెట్టలే కానీ ఈ విధముగా తమ కార్యక్రమాన్ని ఆపాలను కూడా సరికాదు అన్నారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి విధానాలు సరికాదని పోలీసులు ఇప్పటికైనా తమ వైఖరి మార్చుకోవాలని శాంతిభద్రతలకు వివాదం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత వారిదేనని స్పష్టం చేశారు. తమ కార్యక్రమానికి అనుమతి ఇవ్వకపోతే రోడ్డుపైనే ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు. రాజ్యసభ మాజీ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ సమక్షంలో ఆ నాయకులు వైసీపీలో చేరడం ఖాయమని స్పష్టం చేశారు.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## గ్యాస్ బుకింగ్ పాత విధానాన్ని కొనసాగించాలి
### -అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపిన-సామాజిక వర్గ నేత వరసాల ప్రసాద్



**గోకవరం ఆగష్టు 18 ప్రభాత వార్త** మధ్యతరగతి కుటుంబాలపై వంటగ్యాస్ భారం పెరుగుతోందని 45 రోజులకే గ్యాస్ బుకింగ్ సదుపాయం కల్పించడం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని దళిత నాయకుడు వరసాల ప్రసాద్ ఆరోపించారు. ఈ సమస్యపై మంగళవారం గోకవరం మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన స్థానికులతో కలిసి అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు సంబంధిత వినతి పత్రాన్ని తాసిల్దార్ పినిశెట్టి రామకృష్ణకు అందజేశారు ఈ సందర్భంగా వరసాల ప్రసాద్ యాక్ట్ మీడియా తో మాట్లాడుతూ. గతంలో 30 రోజులకు ఒకసారి వంటగ్యాస్ బుకింగ్ చేసుకునే విధానం ఉండేదని, ప్రస్తుతం 45 రోజుల తర్వాతే బుకింగ్ చేసుకునేలా నిబంధనలు తీసుకురావడం సరైన విధానం కాదన్నారు. సాధారణంగా ఒక గ్యాస్ సిలిండర్ 30 రోజుల్లోనే పూర్తవుతుందని, 45 రోజుల వరకు వేచి ఉండాల్సి రావడం వల్ల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. కట్టెపుల్లలు, బొగ్గులు వంటివి అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు అదేవిధంగా చిన్న దుకాణాలు, టీ కొట్లు, చిరు వ్యాపారాలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న వారికి కమర్షియల్ గ్యాస్ ధరలు పెరగడం భారంగా మారిందన్నారు. దీంతో వంటగ్యాస్ ఉపయోగం పెరిగిందని తద్వారా కుటుంబాలకు వంటగ్యాస్ అందుబాటులో లేకుండా పోతుందని అన్నారు ప్రైవేట్ పరంగా గ్యాస్ ను అదనపు ధరకు విక్రయాలు జరుపుతున్నారని ఆరోపించారు కమర్షియల్ గ్యాస్ ధర పెరగడంతో పలువురు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు కమర్షియల్ ధరను తగ్గించి చిరు వ్యాపారులను ఆదుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు గ్యాస్ బుకింగ్ విధానంలో ఏమైనా అవకతవకలు ఉంటే వాటిని ప్రభుత్వం పరిశీలించి, సామాన్య ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం స్పందించి 30 రోజులకే వంటగ్యాస్ బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించాలని గతంలో ఉన్న విధానాన్ని యధావిధిగా కొనసాగించాలని వరసాల ప్రసాద్ ప్రజలు తరఫున విజ్ఞప్తి చేశారు ....

## రెండేళ్ల నమ్మకం..సంక్షేమం అభివృద్ధి..
### -23వ రోజు ఇంటింటికి తెలుగుదేశం...



**అంబాజీపేట, ఆగస్టు 18, (ప్రభాతవార్త):** కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, అభివృద్ధి, సంక్షేమంలో పాలన పరుగులు పెడుతుందని నియోజవర్గ టిడిపి కో -కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ,రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు గంగాధరరావు (పెదబాబు)లు అన్నారు. మండలంలోని మాచవరం పంచాయతీ కార్యాలయం పరిధిలో 007 క్లస్టర్ ఇన్చార్జి గణపతి వీర రాఘవులు ఆధ్వర్యంలో 110, 116 పోలింగ్ బూత్ లో డోర్ టు డోర్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అలాగే పుల్లేటికుర్రు గ్రామంలో క్లస్టర్ 009 దాసరి వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో 148,149 పోలింగ్ బూత్ లలో డోర్ టు డోర్ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీ సూపర్ హిట్ అయిందని, రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాలకు ప్రయోజనం కల్పిస్తూ, అభివృద్ధి-సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.అనంతరం ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి రవణం రాము, మండల తెలుగు యువత అధ్యక్షుడు జోగి కృష్ణ చైతన్య, నాగాబత్తుల వెంకట సుబ్బారావు, దొమ్మేటి వెంకట రామారావు,పుల్లేటికుర్రు సొసైటీ చైర్మన్ దొమ్మేటి సురేష్ కుమార్, యూనిట్ ఇన్చార్జి దాసరి శ్రీనివాస్, బూత్ కన్వీనర్స్ మర్రి రామకృష్ణ, కోట మురళి,బొక్కా ధర్మారావు,కొప్పినీడి ఈశ్వరరావు,గుత్తుల సురేష్ కుమార్, వర్రే చింతన్న, నయినాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఊర్లకులపాడు బి. ఆర్. సి. కేంద్రాన్ని ఏ. ఓ. తనిఖీ



**రాజవొమ్మంగి, ఆగస్టు 18, ప్రభాతవార్త** మారేడుబాక పంచాయితీ ఊర్లకులపాడు గ్రామంలో కోసూరి అప్పలరాజు ప్రకృతి వ్యవసాయ నోడల్ బి ఆర్. సి. కేంద్రాన్ని మంగళవారం మండల వ్యవసాయాధికారి చక్రధర్ తనిఖీ చేశారు. రిజిస్టర్లు, కాషాయాల నిల్వను చూసారు. ఎలినో ప్రభావం వల్ల సీడ్ బాల్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులు సాగు చేసే పంటలకు అవసరమైన ద్రావణాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఈకార్యక్రమంలో లక్ష్మణ్ రెడ్డి, అబ్బాయి పాల్గొన్నారు.

## ప్రగతి లో నషా ముక్త్ భారత్ అభియాన్



**గండేపల్లి ఆగస్టు 18. ప్రభాతవార్త** గండేపల్లి మండలం సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల లో నషా ముక్త్ భారత్ అభియాన్ – 6వ సంవత్సరం జాతీయ ఇ-ప్రతిజ్ఞ అవగాహన కార్యక్రమం కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు మరియు సిబ్బందికి నిర్వహించబడింది.మాదక ద్రవ్యాల దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించడం మరియు మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం.కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ ప్రచారంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించబడింది.కళాశాల ఛైర్మన్ డా పరుచూరి కృష్ణారావు ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు బానిస కావడం అనేది దేశానికి వినాశనం.యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, తమ కెరీర్ పై మరియు దేశ నిర్మాణంపై దృష్టి పెట్టాలి. కాబట్టి అందరం కలిసి మాదకద్రవ్యాలకు నో చెప్పుదాం అని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వైస్ ప్రెసిడెంట్,విద్యార్థులు మరియు సిబ్బంది ఇ-ప్రతిజ్ఞ చేశారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps